అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 25-10-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 245 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



అవినీతికి ఆ పిల్లర్లే సాక్ష్యమా!?

కాళేశ్వరం ప్రాజెక్టు సమీక్షకు డిమాండ్

- చదీచప్పుడూలేని రాష్ట్ర సర్కారు
- తేల్చని కేంద్ర బృందం
- గందరగోళచర్యల్లో ప్రభుత్వం
- కుట్ర ఉందంటూ పోలీసు కేసు

నవతెలంగాణ
ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని లక్ష్మిబ్యారేజీ కుంగిన నేపథ్యంలో మొత్తం ఆ ప్రాజెక్టు నిర్మాణంపైనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. పగుళ్లు వచ్చిన పిల్లర్లే అవినీతి, అక్రమాలకు సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. దీంతో మొత్తం ప్రాజెక్టునే నిపుణులతో పూర్తిస్థాయిలో సమీక్ష చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది. తద్వారా సమగ్ర విచారణ చేసి అవినీతి తిమింగలాలను పట్టుకుని శిక్షించాలనే డిమాండ్ ముందుకు వస్తున్నది. కానీ, తెలంగాణ ప్రభుత్వం గానీ, సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులుగానీ స్పందించకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ పేరుతో ప్రజాప్రతినిధులు, ఉన్నతస్థాయి అధికారులు నోరు కుట్టేసుకున్నారు. అన్ని అంశాలపై స్పందిస్తున్న ప్రభుత్వంలోని కీలకమంత్రులు కాళేశ్వరం కుంగుబాటుపై మాత్రం కిక్కురుమనకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుకు చెందిన లక్ష్మిబ్యారేజీ నిర్మాణం పూర్తయి దాదాపు ఐదేండ్లు అవుతున్నది. బ్యారేజీకి చెందిన 18, 19, 20, 21 పిల్లర్లల్లో 20వ పిల్లర్‌కు పూర్తిస్థాయిలో పగుళ్లు వచ్చి దెబ్బతిన్నట్టు సాగునీటి శాఖ ఇంజినీర్ల అంచనా. అయితే నిజాలను దాచిపెడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. ఈనేపథ్యంలో కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) డ్యామ్ సేఫ్టీకి చెందిన అనిల్‌కుమార్ జైన్ ...11లో



సమగ్ర విచారణ జరిపించాలి

- వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి
- బాధ్యులెవరో తేల్చి తగిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 11లో

బ్రిడ్జి ఎందుకు కుంగింది..?

- మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన కేంద్ర జలవనరుల బృందం
- పోలీసులతో భారీ బందోబస్తు
- బ్యారేజీ వద్ద 144 సెక్షన్

వివరాలు 11లో

ఇక రథ్ ప్రభారీలు

రాజకీయ ప్రచారకులుగా ప్రభుత్వ అధికారులు

- ప్రభుత్వ ఘనకార్యాల ప్రచారం
- నవంబర్ 20 నుంచి రెండు నెలల పాటు కార్యక్రమం
- ఇది కోడ్ ఉల్లంఘనేనంటున్న సీనియర్ అధికారులు
- సీఈసీకి ఫిర్యాదు

'జిల్లాల్లో రథ్ ప్రభారీలుగా నియమించేందుకు ప్రభుత్వ సహాయ కార్యదర్శులు, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుండి గ్రామ పంచాయతీ స్థాయి వరకూ అధికారులను వెంటనే నామినేట్ చేయండి. గత తొమ్మిది సంవత్సరాల మోడీ పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను నవంబర్ 20వ తేదీ నుండి జనవరి 25 వరకూ ప్రచారం చేసేందుకు ఈ అధికారులను ఉపయోగించుకోవాల్సి ఉంది' ... ఇది తాజాగా మోడీ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వు. ఇలా అధికారికంగానే ప్రభుత్వోద్యోగులను రాజకీయ ప్రచారకులుగా మార్చడం ఈ దేశం ఇప్పటి వరకూ ఎరుగని వింత. ఈ మోడీ సర్కారు తెగింపుపై మాజీ ఉన్నతాధికారులు మొదలు రాజకీయ విశ్లేషకుల వరకూ మండి పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పుడు ఇది చర్చనీయాంశంగా మారింది.



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. మూడోసారి కేంద్రంలో అధికారాన్ని చేపట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రభుత్వం సాధించిన విజయాలను గురించి ప్రచారం చేసేందుకు, వాటిని ప్రదర్శించేందుకు దేశంలోని మొత్తం 765 జిల్లాల్లో 'రథ్ ప్రభారీ'లను (ప్రత్యేక అధికారులను) నియమించాలంటూ ఈ నెల 17న అన్ని మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆ ఆదేశాలు సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున హల్‌చల్ చేస్తున్నాయి.

నిప్పులు చెరిగిన కాంగ్రెస్ నేతలు

జైరాం రమేష్, పవన్ ఖేరా వంటి కాంగ్రెస్ ప్రతినిధులు కూడా మోడీ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. స్వతంత్రంగా, రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన ప్రభుత్వోద్యోగులను, సైనికులను ఇలా ప్రచారానికి వాడుకోవడం తగని పని అని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రధానికి ఓ లేఖ రాశారు. కేంద్ర సివిల్ సర్వీసుల ...2లో

మాజీ అధికారుల మండిపాటు

ప్రభుత్వ ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ స్పందించారు. ఈ నెల 21న ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి ఓ లేఖ రాస్తూ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, ఆ ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా ఆదేశాలు జారీ చేయడం అంటే ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది. ఇలాంటి చర్యలు ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. ఎన్డీఏ ప్రభుత్వానికి మేలు చేకూర్చేందుకే ఇలాంటి ఆదేశాలు ఇచ్చారు' అని ఆయన విమర్శించారు.

అధికారులను రథ్ ప్రభారీలుగా నియమించాలంటూ రక్షణ శాఖ సహా అన్ని మంత్రిత్వ శాఖలకు జారీ చేసిన ఆదేశాలపై సీనియర్ అధికారులు ...2లో

నేడు కాంగ్రెస్ రెండో జాబితా..!

తెలంగాణలో 60 స్థానాలపై స్పష్టత

- వామపక్ష పార్టీలతో పొత్తు గురించి సీఈసీ భేటీలో చర్చ
- మిగిలిన స్థానాలకు అభ్యర్థుల ఖరారు

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) బుధవారం భేటీ కానుంది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా... ఈ నెల 15న 55 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల చేసింది. మిగిలిన 64 స్థానాలకు అభ్యర్థుల ఖరారుపై ఇటీవల రెండుసార్లు భేటీ అయిన స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల ప్రతిపాదనలకు సిద్ధం చేసింది. ఇందులో వామపక్ష పార్టీలతో పొత్తు, వారికి కేటాయించే నాలుగు సీట్లు, మిగిలిన 60 స్థానాలపై స్పష్టత వచ్చినట్టుగా తెలుస్తోంది. అయితే ఆ ప్రతిపాదనలను బుధవారం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇతర నేతల సమక్షంలో జరిగే సీఈసీలో చర్చించి, ఆమోదించనున్నారు. అనంతరం తుది జాబితా ...11లో

కొండగల్‌లో పోటీకి రా..

- నువ్వా–నేనా తేల్చుకుందాం: సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్
- కొడంగల్‌ను ఎడారిగా మార్చారంటూ విమర్శలు
- గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఓటమి తప్పదని హెచ్చరిక



వివరాలు 11లో

ముందుంది మొసళ్ల పండుగ...



కాంగ్రెస్‌పై మంత్రి కేటీఆర్ సెటైర్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కాంగ్రెస్ పాలిత కర్నాటకలో అధికారులు కరెంటు ఇవ్వడం లేదని రైతులు కొంత మంది మొసలిని తీసుకొచ్చి సబ్ స్టేషన్‌లో వదలారా? అన్న వైరల్ వీడియోను మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు. ముందుంది మొసళ్ల పండుగ అంటే ఇదేనేమో అంటూ సెటైర్ వేశారు. దీనిపై నెటిజన్లు స్పందించారు. ఇలాంటి పండుగలను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలకే పరిమితం చేద్దాం. దిక్కుమాలిన పండుగలను తెలంగాణకు తీసుకురావద్దంటూ ఒక నెటిజన్ కామెంట్ పెట్టాడు. మరో నెటిజన్, కరెంటు లేక జిరాక్స్ సెంటర్ దగ్గర రెండు గంటల నిలబడిన రోజులు మళ్లీ వస్తాయేమో అంటూ కామెంట్ పెట్టాడు. మరొకరు కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కటిక చీకట్లే అని కామెంట్ పెట్టారు.

సీఎం టూర్ షెడ్యూల్‌లో స్వల్పమార్పులు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నియోజకవర్గాల టూర్ షెడ్యూల్ లో స్వల్ప మార్పులు జరిగాయి. ఈ నెల 26న అచ్చంపేట, వనపర్తి, మునుగోడులో, 27న పాలేరు, మహబూబాబాద్, వర్ధన్నపేట లలో ఆయన పర్యటించనున్నారు. మిగిలిన టూర్ షెడ్యూల్ యథావిధిగానే కొనసాగనున్నది.



దిగ్గజ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ
కన్నుమూత

వివరాలు 12లో



నగరం ఊరెళ్లింది...

బోసిపోయిన హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ కూడలి ప్రాంతం..

కేసీఆర్‌పై పోటీగా.. 100 నామినేషన్‌లు వేస్తాం

- మాస్టర్‌ప్లాన్ ముంపు బాధిత రైతుల ప్రకటన

వివరాలు 11లో

దెబ్బ మీద దెబ్బ

ఒక్కొక్కటిగా ఊడుతున్న కమలం రేకులు

- నేతల మధ్య చిచ్చుపెట్టిన తొలి జాబితా
- కమలానికి రాజీనామా యోచనలో పలువురు సీనియర్లు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎన్నికల వేళ బీజేపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతున్నది. జాతీయ నాయకత్వం ప్రకటించిన తొలి జాబితా ఆ పార్టీ నేతల మధ్య అగ్గి రాజేసింది. టిక్కెట్ దక్కక కొందరు, తాము ఆశించిన స్థానం వేరే వారికి కేటాయించటంతో మరికొందరు ఆ పార్టీని వీడుతున్నారు. ఇంకొందరు తమ అనుయాయులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామంటూ చెబుతున్నారు. తాజాగా నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రమాదేవి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ముధోల్ సీటును ఆశించి భంగపడిన ఆమె తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కన్న తల్లిలా భావించిన పార్టీలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అందుకే బీజేపీని వీడుతున్నట్టు ప్రకటించారు. మరోవైపు మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఆ పార్టీకి బై బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. మునుగోడు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తే తాను గెలవనని సర్వేల్లో తేలడంతో ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే రాజగోపాల్‌రెడ్డి మాజీ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కూతురు స్రవంతి రెడ్డితో మంతనాలు జరిపారు. తనకు మద్దతనిచ్చి.. సహకరిస్తే భవిష్యత్తులో మంచి పదవి ఇప్పిస్తానంటూ గ్యారెంటీ ఇచ్చినట్టు సమాచారం. మునుగోడు నుంచే కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న మరో నేత చలమల కృష్ణారెడ్డితోనూ ఫోన్లో సంప్రదించేందుకు రాజగోపాల్ ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదని సమాచారం. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో రాజగోపాల్ ఏ క్షణంలోనైనా కాంగ్రెస్‌లో చేరే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మపురి (మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు) నుంచి టిక్కెట్ ఆశించిన మాజీ ఎంపీ వివేక్‌కు బీజేపీ అక్కడ కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్ స్థానాన్ని కేటాయించింది. దీంతో ఆయన పార్టీపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో అటు రాజగోపాల్, ఇటు వివేక్ ఇద్దరూ ప్రత్యేకంగా భేటీ అయి... త్వరలోనే ఒక నిర్ణయం ప్రకటించే అవకాశముందని సమాచారం.




మరోవైపు భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కూడా బీజేపీని వీడనున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మునుగోడు లేదా ...11లో

రాజ్యాంగ విరుద్ధం

అటవీ సంరక్షణ చట్టంపై సుప్రీంలో పిటిషన్

- సమాధానమివ్వాలంటూ కేంద్రానికి నోటీసులు



న్యూఢిల్లీ : అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సీనియర్ అధికారులు, అటవీ పరిరక్షణఎేత్తలు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైన దిగా ప్రకటించాలని వారు అభ్యర్థించారు. రాజ్యాంగం కల్పించిన అనేక ప్రాథమిక హక్కులను ఈ చట్టంఉల్లం ఘిస్తోందని తెలిపారు. రిట్ పిటిషన్‌పై ఆరు వారాల్లో సమాధానమివ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ మార్చి 27 లోక్‌సభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై శాస్త్రవేత్తలు, ప్రభుత్వ మాజీ అధికారులు, పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సవరణ చట్టంలో అనేక లోసుగులు ...11లో

దళిత యువకుడిపై అమానుషం..

- సోయా దొంగిలించాడనే ఆరోపణతో నగ్నంగా ఊరేగింపు

నవతెలంగాణ–బోధన్

సోయా దొంగలించాడనే ఆరోపణతో దళిత యువకుడిని దుస్తులు విప్పించి నగ్నంగా గ్రామాల్లో ఊరేగించారు. ఈ అమానుష ఘటన నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్సాలో చోటుచేసుకుంది. నిందితుల తీరుపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న ఏసీపీ కిరణ్‌కుమార్, బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్ గ్రామంలో పర్యటించి వివరాలు ఆరా తీశారు. వివరాల్లోకి వెళ్తే.. హున్సా గ్రామానికి చెందిన దళిత యువకుడు(25) అదే గ్రామానికి చెందిన వ్యక్తులకు సంబంధించిన ...11లో

నవతెలంగాణ
బుధవారం 25 అక్టోబర్ 2023

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

మానవ హక్కులను కాపాడాలి

పాలస్తీనాకు సంఘీభావంగా ఇజ్రాయిల్ ఎంబసీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన

ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసుల దాడి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పాలస్తీనాకు సంఘీభావంగా ఇజ్రాయిల్ ఎంబసీ ఎదుట నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు దాడి చేశారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వీపీ సాను సహా నాయకులు, కార్యకర్తలపై పోలీసులు దాడి చేశారు. మహిళా కార్యకర్తలను రోడ్డుపై ఈడ్చుకెళ్లి పోలీసు వాహనంలోకి ఎక్కించారు.

సోమవారం నాడిక్కడ మానవతావాద జోక్యాన్ని కోరుతూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఇజ్రాయిల్ రాయబార కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. శాంతియుత నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో అనుమతి లేకపోయినా పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని ఎస్ఎఫ్ఐ నిర్ణయించింది. అయితే ఢిల్లీ పోలీసులు నేతలు, కార్యకర్తలపై దాడి చేశారు. ఇది పోలీసుల క్రూరత్వ అద్దంపట్టింది. నాయకులను బలవంతంగా పోలీసు వాహనాల్లోకి నెట్టారు. ఎస్ఎఫ్ఐ



ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణన్, సంయుక్త కార్యదర్శి ఆదర్శ్ ఎం సాజీ, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మణిలాల్ అభిజిత్, ఢిల్లీ అధ్యక్షురాలు ఐషిఘోష్ తదితరులపై కూడా దాడి జరిగింది. వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వారిని విడుదల చేశారు.

తమ కార్యకర్తలు, తమ నాయకులపై అసభ్యంగా ప్రవర్తించినందుకు నిరసనగా జాఫర్ పుర్కలన్ పోలీస్ స్టేషన్ వెలుపల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పాలస్తీనాకు సంఘీభావం తెలిపిన విద్యార్థులపై పోలీసుల హింసను ఎస్ఎఫ్ఐ ఢిల్లీ కమిటీ ఖండించింది. పాలస్తీనా మానవ హక్కుల పట్ల కండ్లు బైర్లు కమ్ముతూ ఇజ్రాయిల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న పాలకుల వైఖరిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది.

స్టాలిన్ సర్కార్ సిఫారసుకు నో

- రెండోసారి తిరస్కరించిన రాష్ట్ర గవర్నర్



చెన్నై : తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్‌సీ) ఛైర్మెన్ నియామకంపై స్టాలిన్ ప్రభుత్వ సిఫారసును గవర్నర్ మరోసారి తిరస్కరించారు. టీఎన్‌పీఎస్‌సీ ఛైర్మెన్‌గా మాజీ డీజీపీ సి.శైలేంద్ర బాబుని సిఫారసు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఫైల్‌ను గవర్నర్ ఆర్.ఎన్. రవి రెండోసారి తిప్పి పంపారు. రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులు 'రాజ్యాంగ నిబంధనలు-ప్రవర్తన'కు విరుద్ధంగా ఉన్నాయని గవర్నర్ ఆరోపించారు. 'రాజ్యాంగ .. సంస్థాగత నిబంధనలు' కనుగుణంగా ఫైల్‌ను తిరిగి పంపాలని ఆదేశించారు.

శైలేంద్ర బాబు డీజీపీగా ఈ ఏడాది జూన్‌లో పదవీవిరమణ చేశారు. దీంతో ఆయనను టీఎన్‌పీఎస్‌సీ ఛైర్మెన్‌గా, మరికొంతమంది పేర్లను కమిటీలో సభ్యులుగా సిఫారసు చేస్తూ గవర్నర్‌కు ప్రతిపాదన పంపింది. అయితే ఏ ప్రాతిపదికన సభ్యులను ఎంపిక చేశారంటూ రెండు నెలల అనంతరం రాజ్‌భవన్ ఈ ప్రతిపాదనను తిప్పి పంపింది. ఈ ప్రక్రియలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించారా..! అని ప్రశ్నించింది. సిఫారసులను సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఫైల్‌ను రాజ్‌భవన్‌కు పంపినట్టు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ నెల ప్రారంభంలో గవర్నర్ ఫైల్ ను రెండోసారి వెనక్కి పంపాలని నిర్ణయించుకున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. సభ్యుల ఎంపిక ప్రక్రియలో కొన్ని లోపాలున్నాయని గవర్నర్ పేర్కొన్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న టీఎన్‌పీఎస్‌సీ ఛైర్మెన్, సభ్యుల నియామకాలను చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం దరఖాస్తుదారులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించినట్టు తెలిపాయి.

నేడు కాంగ్రెస్‌లోకి రాజగోపాల్‌రెడ్డి, వివేక్?

- ఢిల్లీకి బయలుదేరిన నేతలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ చెందిన సీనియర్ నేతలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి వివేక్ వెంకటస్వామి బుధవారం కాంగ్రెస్‌లో చేరనున్నట్టు తెలిసింది. అధిష్టానం నుంచి పిలుపు వచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వారిద్దరూ సమావేశమై కాంగ్రెస్‌లో చేరాలనే నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) కమిటీ సమావేశమవుతున్నది. అందులో కాంగ్రెస్ రెండో జాబితాకు తుది రూపం ఇవ్వనుంది. అంతకు ముందుగానే రాజగోపాల్, వివేక్ కాంగ్రెస్‌లో చేరితేనే రెండో జాబితాలో పేరు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మునుగోడు లేదా ఎల్బీనగర్ టికెటు ఇస్తారనే ప్రచారం జరుగుతున్నది. వివేక్‌కు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలుస్తోంది. మునుగోడు సీటును ఆశిస్తున్న పాల్వాయి స్రవంతి, చలమల కృష్ణారెడ్డి తదితరులను ఒప్పించుకోవాలని రాజగోపాల్‌రెడ్డికి అధిష్టానం సూచించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పాల్వాయి స్రవంతితో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడే క్రమంలో కొంత అసహనానికి గురైనట్టు తెలిసింది. ఎట్టకేలకూ ఆయన రాకను అంగీకరించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. చలమల మాత్రం ఫోన్లో అందుబాటులోకి రావడం లేదు. అయినా కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. గత కొంత కాలంగా రాజగోపాల్‌రెడ్డి, వివేక్ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కొనసాగింది. దసరా పండుగ రోజు దీనిపై రోజంతా మీడియాలో చర్చ నడిచింది. ఎట్టకేలకూ వారి చేరికపై స్పష్టత వచ్చినట్టు ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన వారు...బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్న ప్రచారంతో ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ఇదే క్రమంలో బీజేపీ గ్రాఫ్ రోజు రోజూకు పడిపోతున్నది. ఆ పార్టీలో ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తమకు కలగానే మిగిలిపోతోందనేది వారి భావన. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసిన ఓటమి పాలైన రాజగోపాల్‌రెడ్డి...తర్వాత ఆ పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. పార్టీ సభలు, సమావేశాలకు కూడా హాజరు కావడం లేదు. మోడీ సభలకు కూడా గైర్హాజరయ్యారు. వివేక్ కూడా పార్టీ నేతలతో ముభావంగా ఉంటూ వస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా రాజగోపాల్‌రెడ్డి, వివేక్, ఈటల రాజేందర్, విజయశాంతి, కొండా విశ్వేశ్వరరెడ్డి రహస్యంగా భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ నేతలు వారికి బుజ్జగించారు. ఎన్నికలకు సంబంధించిన కొన్ని కీలక పదవులు కూడా ఇచ్చారు. అయినా వారిలో అసంతృప్తి మంటలు చల్లారాలేదని తెలిసింది. ఇప్పటికే విజయశాంతి బహిరంగంగానే పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈటల రాజేందర్ మాత్రం పైకి గంభీరంగా కనిపిస్తున్నా ...హుజురాబాద్‌లో మాత్రం ఆయనకు ఎదురుగాలి వీస్తోందని తెలిసింది. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంతో ఆయన బయటపడ్డారు. వచ్చేఅసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు పరాభవం తప్పదనే ప్రచారం జరుగుతున్నది. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌పై ఆయన పోటీకి సిద్ధమవుతున్నారు. అయితే బీఆర్ఎస్ కూడా ఈటలపై రివర్స్ గేర్ వేస్తున్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆయనపై పోటీకి బీఆర్ఎస్ బలమైన నేతను (ఇప్పటికే పాడి కౌశిక్‌రెడ్డిని మార్చే అవకాశం ఉందని సమాచారం) బరిలోకి దించి ఆయన ఓడించాలని భావిస్తున్నది. తద్వారా ఈటలను ఇటూ గజ్వేల్‌నూ, అటు హుజురాబాద్‌లోనూ ఓడించేందుకు అధికార పార్టీ పావులు కదుపుతున్నది.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.25 కోట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దసరా పండుగ సందర్భంగా టీఎస్ఆర్టీసీకి దాదాపు రూ.25 కోట్ల అదనపు ఆదాయం సమకూరినట్టు అధికారులు లెక్కలు కట్టారు. అయితే డిపోల నుంచి మరింత సమాచారం వచ్చాక దీనిపై స్పష్టత వస్తుందని చెప్తున్నారు. అక్టోబర్ 13 నుంచి 24వ తేదీ వరకు 11 రోజులపాటు ఆర్టీసీ 5,500 ప్రత్యేక బస్సులను నడిపించింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 1,302 ప్రత్యేక బస్సుల్ని రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలకు ప్రత్యేక బస్సుల్ని నడిపారు. గతంలో దసరా సందర్భంగా సాధారణ చార్జీలతో పాటు మరో 50 శాతం టిక్కెట్ చార్జీగా వసూలు చేసేవారు. అయితే ఈసారి సాధారణ చార్జీలంటూనే డైనమిక్ చార్జీల పేరుతో వసూళ్లు చేశారు. ప్రయాణికులు తక్కువ ఉన్న సమయంలో తక్కువ ఛార్జీలు, రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో ఎక్కువ వసూలు చేశారు. అయితే ప్రయివేటు ట్రావెల్స్‌తో పోలిస్తే డైనమిక్ ఛార్జీలు తక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేందుకు మొగ్గుచూపినట్లు అధికారులు తెలిపారు. దసరా సందర్భంగా రాష్ట్రంలోని మొత్తం పది రీజియన్లలో ఒక్కో రీజియన్‌కు రూ.2.50 కోట్ల వరకు ఆదాయం అదనంగా సమకూరినట్టు భావిస్తున్నారు. అయితే బుధవారం సాయంత్రానికి ఈ లెక్కల్లో స్వల్ప మార్పులు ఉండొచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

జర్మనీ తీరంలో ఢీ కొన్న రెండు భారీ నౌకలు

- పలువురు గల్లంతు

బెర్లిన్ : జర్మనీ సమీపంలోని సముద్రంలో రెండు భారీ నౌకలు మంగళవారం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పలువురు గల్లంతైనట్లు జర్మనీ అధికారులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున హెల్గోలాండ్ ద్వీపానికి నైరుతి దిశలో 22 కి.మీ దూరంలో బ్రిటన్‌కు చెందిన వెరైటీ, బహమాస్‌కు చెందిన పోలేసీ నౌకలు ఢీ కొన్నట్లు జర్మనీకి చెందిన సెంట్రల్ కమాండ్ ఫర్ మారీటైమ్ ఎమర్జెన్సీస్ తెలిపింది. వెరైటీ నౌక పూర్తిగా నీటిలో మునిగిపోగా, ఒకరిని కాపాడినట్లు అధికారులు తెలిపారు.

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

24 గంటల్లో 700 మంది పైగా పౌరుల మృతి

- 400కి పైగా లక్ష్యాలపై

వైమానిక దాడులు



గాజా, జెరూసలెం : అమెరికా, బ్రిటన్,జర్మనీ, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాల అండతో ఇజ్రాయిల్ రెచ్చిపోతోంది. హమాస్ ప్రతిఘటనా దాడిని సాకుగా చూపి అక్టోబర్7 నుండి గాజాపై భీకర వైమానిక దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్ సోమవారం ఒక్క రోజే 700మందికిపైగా పాలస్తీనీయులను పొట్టనబెట్టుకుంది. గత మూడు వారాల్లో ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో 2వేల మంది చిన్నారులతో సహా 5, 887 మంది చనిపోయారు. 18వేల మందికిపైగా గాయపడ్డారు.

దాదాపు పది లక్షల మంది శరణార్థులుగా మారారు. వేలాది భవనాలు నేలమట్టమయ్యాయి. ఆసుపత్రుల్లో జనరేటర్ల కోసం ఇంధన నిండుకుందని, చిన్నారులు, రోగులు నానా అవస్థలు పడుతున్నారని గాజా ఆసుపత్రుల అధికారులు దయనీయస్థితిలో వేడుకుంటున్నా ఇజ్రాయిల్ కనికరించడం లేదు. ఇంధన ట్యాంకులు ఆసుపత్రులకు చేరకుండా సరిహద్దు ప్రాంతాల్లోనే నిలిపివేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఎ) సైతం గాజాకు మానవతా సాయం అత్యవసరంగా అందాల్సివుందని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది.

ప్రత్యేకించి ఇంధనం చాలా కీలకంగా మారిందని, ఈ దశలో పూర్తి స్థాయిలో సురక్షితమైన మానవతా సాయం అందాల్సి వుందని డబ్ల్యుహెచ్ఎ ప్రాంతీయ అత్యవసర పరిస్థితుల డైరెక్టర్ డాక్టర్ర ఇక్ బ్రెన్నన్ కోరారు. తమ సహాయ కార్యకర్తలకు ఎలాంటి రక్షణ కల్పించడం లేదని ఐక్యరాజ్య సమితి సంస్థలు తెలిపాయి. గాజాలోకి మరింత సాయం వెళ్ళేలా చూడాలని ఐక్యరాజ్య సమితి ఇజ్రాయిల్‌ను మరోమారు కోరింది. వేలాదిమంది ప్రజలు విపత్కర పరిస్థితుల్లో వున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

పదాతి దళాలు

ఇజ్రాయిల్, గాజాకు సరిహద్దుల్లో పెద్ద సంఖ్యలో ఇజ్రాయిల్ ట్యాంక్‌లు, బలగాలు మోహరించి వున్నాయి. పదాతి దళ దాడికి ఆదేశాలు కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. గతరాత్రి గాజాలో 400కి పైగా మిలిటెంట్ లక్ష్యాలపై దాడిచేశామని ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. ముగ్గురు డిప్యూటీ కమాండర్లతో సహా పెద్ద సంఖ్యలో హమాస్ మిలిటెంట్లను హతమార్చామని వెల్లడించింది.

నెతన్యాహుకు మాక్రాన్ వత్తాసు

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు యుద్ధోన్మాదంతో రెచ్చిపోతుంటే పశ్చిమ దేశాల నేతలు ఒక్కొక్కరూ వచ్చి ఆయనకు వత్తాసు పలుకుతున్నారు. బైడెన్, ఒలాఫ్ షుల్జ్, సునాక్, తాజాగా మాక్రాన్ ఇజ్రాయిల్‌ను సందర్శించి హమాస్‌పై దాడులకు మరింత ఆజ్యం పోస్తున్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీతో సహా ప్రపంచ వ్యాపితంగా ప్రజలు ఇజ్రాయిల్ దాష్టీకాలను ఖండిస్తూ భారీ ర్యాలీలు నిర్వహిస్తుంటే, వాటిని లెక్కచేయకుండా ఈ సామ్రాజ్యవాద దేశాల నేతలు ఇజ్రాయిల్‌కు కొమ్ముగాస్తున్నారు. మంగళవారం టెల్ అవీవ్‌కు చేరుకున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో భేటీ అయి ఇజ్రాయిల్‌తో భుజం భుజం కలిపి నడుస్తామని చెప్పారు. ఈ సంక్షోభాన్ని ఉపయోగించుకుని గాజా నుండి పాలస్తీనీయులను పూర్తిగా తరిమేసేందుకు ఇజ్రాయిల్ భారీ కుట్ర పన్నినట్టు వార్తలొస్తున్నాయి.

ఇక రథ్ ప్రభారీలు

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనలకు ఇది విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల అధికారులు రాజకీయ కార్యకర్తలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. సైనికులు ప్రభుత్వ పథకాల మార్కెటింగ్ ఏజెంట్లుగా మారుతున్నారని మండిపడ్డారు. దీనిని ప్రమాదకరమైన చర్యగా అభివర్ణించారు.

ఇందిర హయాంలో...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని ఇందిరాగాంధీ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారంటూ 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు చారిత్రక తీర్పు చెప్పింది. దీంతో ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆమెపై అనర్హత వేటు పడింది. ప్రధాని సచివాలయంలో తనకు సహాయకుడిగా పనిచేస్తున్న యశ్‌పాల్ కపూర్ అనే అధికారిని తన విజయావకాశాలను మెరుగుపరచుకునేందుకు ఇందిర ఉపయోగించుకున్నారని, తద్వారా ఆమె ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ తీర్పు వచ్చిన రోజే గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ (ఐ) ఘోర పరాజయం పొందింది. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్న మోడీ దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. ఇందిరకు వ్యతిరేకంగా 19 ర్యాలీలు, ఆరు రోడ్‌షోలలో ప్రసంగించారు. అయితే ఆయన ఇప్పుడు ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించి ప్రచారార్భాటం కోసం ప్రభుత్వ అధికారులను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మాజీ అధికారుల మండిపాటు

(మొదటిపేజీ తరువాయి)

కూడా స్పందించారు. 'రక్షణ శాఖ అధికారులను ఎన్డీఏ ప్రభుత్వ విజయాలపై ప్రచారానికి పంపడం ఆందోళన కలిగించే విషయం. దీర్ఘకాలంలో ఇలాంటి చర్యలు మంచివి కావు' అని వారు అభిప్రాయపడ్డారు. మరోవైపు శర్మ లేఖకు మద్దతుగా మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ దేవసహాయం కూడా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అయితే ఈ లేఖలపై సీఈసీ ఇంకా స్పందించలేదు. ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎన్‌సీ సక్సేనా సైతం ప్రభుత్వ చర్యపై ఘాటుగా మాట్లాడారు. ప్రభుత్వోద్యోగులను ప్రచారానికి వాడుకోవడం తాను ఇప్పటి వరకూ చూడలేదని ఆయన చెప్పారు. ప్రభుత్వోద్యోగులు, రాజకీయవేత్తల మధ్య ఉన్న రేఖను ఇది చెరిపేస్తోందని విమర్శించారు. 'ఒక వైపు ఎన్ఎస్ఎస్ఓ, ఎన్ఎఫ్‌హెచ్ఎస్ వంటి సమాచార వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ అధిపతి ఇటీవలే రాజీనామా చేశారు కూడా. మరో వైపేమో ప్రభుత్వ పనితీరుపై ప్రచారం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.

కోటీశ్వరులపై పన్నులు తగ్గించాలి

సంపదపై 2 శాతం మాత్రమే పన్ను విధించాలి

- ఈయూ సంస్థ సలహా ఎగవేతలను నిరోధించవచ్చని సూచన



న్యూఢిల్లీ : ప్రపంచంలోని పేదలు మరింత పేదలవుతుంటే..కోట్ల సంపద పోగేసుకుంటున్న కోటీశ్వరులపై మాత్రం పన్నులు తగ్గించాలని ఈయూ టాక్స్ అబ్జర్వేటరీ అనే సంస్థ ప్రభుత్వాలకు సూచించింది. పన్నులు తగ్గించి, తద్వారా కోటీశ్వరుల ఆదాయం పెంచితే వారు సంపద అసమానతలు, వాతావరణ మార్పులు వంటి ఆందోళన కలిగించే విషయాలపై దృష్టి సారిస్తారని, వాటిపై నిధులు వెచ్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపింది. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు వంటి సేవలపై మరిన్ని నిధులు వెచ్చించాల్సిన అవసరముందని కూడా అభిప్రాయ పడింది. ఈయూ టాక్స్ అబ్జర్వేటరీ అనేది 2021లో ఏర్పడిన పరిశోధనా సంస్థ. ఇది అంతర్జాతీయ పన్నులకు సంబంధించిన అంశాలపై అధ్యయనం చేస్తుంది.

బహుళజాతి సంస్థలపై కనీస పన్ను విధించే విషయంపై అంతర్జాతీయ ఒప్పందం కుదుర్చుకోవాలని ఆ సంస్థ సూచించింది. పన్ను ఎగవేత దారులకు సంబంధించిన సమాచారాన్ని బ్యాంకులు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే విషయంపై కూడా ఈ సంస్థ అధ్యయనం చేసింది. ఈ వ్యవస్థ 2017లో ప్రారంభమైంది. ఈ సంవత్సరంలోనే 100 దేశాలు పన్ను ఎగవేతదారుల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నాయి. మన దేశం గత సంవత్సరం స్విస్ బ్యాంకుల నుండి సమాచారం పొందింది. పన్ను ఎగవేతలను అడ్డుకునేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వం బహుళజాతి సంస్థలపై 15% పన్ను విధించింది. అయితే ఈ వ్యవస్థలోని లొసుగులను ఆసరాగా చేసుకొని ఎంఎన్‌సీలు పన్నుల ఎగవేతకు పాల్పడ్డాయని నివేదిక తెలిపింది. ప్రస్తుతం ప్రపంచంలో పన్ను విధించని సంపద 25% మాత్రమేనని వివరించింది.

చాలా మంది కోటీశ్వరులు తమ సంపదలో కేవలం 0-0.5% పన్ను మాత్రమే చెల్లిస్తున్నారని నివేదిక ఎత్తిచూపింది. పన్ను ఎగవేత కోసం వారు షెల్ కంపెనీలలో తమ సంపదను దాచుకుంటున్నారని తెలిపింది. కోటీశ్వరుల సంపదలో 2% మాత్రమే పన్నుగా వసూలు చేయాలని నివేదిక సూచించింది.

తీవ్ర తుఫానుగా 'హమూన్'..


- బంగాళాఖాతంలో అల్పపీడనం

భువనేశ్వర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుఫానుగా మారింది. ఈ తుఫానుకి 'హమూన్'గా పేరు పెట్టినట్టు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం ప్రకటించింది. ఒడిసాకు 200 కి.మీ దూరంలో తీరం దాటే అవకాశం ఉన్నందున ఒడిశాపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 21 కి.మీ వేగంతో దూసుకువస్తున్న ఈ తుఫాను మరికొన్ని గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని అన్నారు. ఒడిశాలోని పారాదీప్‌కు 230 కి.మీ, పశ్చిమ బెంగాల్‌లోని ధిగాకు 240 కి.మీ దూరంలో, బంగ్లాదేశ్‌లోని చిట్టిగాంగ్‌కు 410 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు.

ఈశాన్య దిశగా కదులుతున్న తుఫాను క్రమంగా బలహీనపడి తీవ్రంగా మారే అవకాశం ఉందని, గంటకు 65 -75 కి.మీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎండీ అంచనా వేసింది. బుధవారం బంగ్లాదేశ్‌లోని హెపుపరా , చిట్టిగాంగ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు ఒడిశాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు.

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే..

ఈవీఎంలను సమకూర్చడానికి ఈసీకి ఏడాది



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికల నిర్వహణకు సరిపడ ఈవీఎంలకు సమకూర్చడానికి ఈసీకి ఏడాది పడుతుంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) తయారీకి అవసరమైన సెమీకండక్టర్లు, చిప్‌లలో కొరత కారణంగా జమిలి ఎన్నికలకు సిద్ధంగా ఉండటానికి ఒక సంవత్సరం సమయం అవసరం అని ఈసీ వర్గాలు తెలిపాయి. "కోవిడ్-19 మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో సెమీకండక్టర్ల కొరత ఈవీఎంల సేకరణ సమయపాలనను మరింత గందరగోళానికి గురిచేసింది" అని తెలిపాయి. సెమీ కండక్టర్స్, చిప్‌లు, ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్) మెషీన్‌లను ఉత్పత్తి చేయడానికి కూడా అవసరం, ఇవి ఓటింగ్ మెషీన్‌లో భాగంగా ఉంటాయి.

ఈ ఏడాది ప్రారంభంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి ఈసీ సెమీకండక్టర్ కొరత కారణంగా ఈవీఎంల సేకరణకు తన బడ్జెట్‌లో 80 శాతం కంటే ఎక్కువ ఉపయోగించలేకపోయిందని తెలిపింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఎనిమిది మంది సభ్యుల ప్యానెల్‌కు ఏకకాలంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఈసీ కొరత సమస్యను లేవనెత్తినట్టు తెలిసింది.

22వ లా కమిషన్ 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలిస్తోంది. 2024, 2029లో ఏకకాల ఎన్నికల కోసం తాత్కాలిక కాల పట్టికలను రూపొందించే అవకాశం ఉంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలతో పాటు కొన్ని అసెంబ్లీ ఎన్నికలను, చివరికి 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు అన్ని అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని సూచించవచ్చు.

21వ లా కమిషన్ 2018లో ఏకకాల పోల్స్ సమస్యను పేర్కొంది. అయితే చివరి నిమిషంలో విభేదాల ఫలితంగా తుది నివేదిక కాకుండా ముసాయిదా నివేదికను విడుదల చేసింది. ఇలా చేయడం వల్ల ప్రజా ధనాన్ని ఆదా చేయడం, పరిపాలనా యంత్రాంగంపై భారం తగ్గడం, ప్రభుత్వ విధానాన్ని మెరుగ్గా అమలు చేయడం వంటి కారణాలతో ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు మద్దతు ఇచ్చింది. కానీ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం "ప్రస్తుత రాజ్యాంగంలోని చట్రంలో సాధ్యం కాదు. ఆ ఆలోచన ఫలించాలంటే రాజ్యాంగ సవరణలు అనివార్యం" అని అంగీకరించింది. అయితే, ప్రభుత్వానికి తుది సిఫార్సు చేయడానికి ముందే దాని పదవీకాలం ముగిసింది.

2024, 2029లో ఏకకాల ఎన్నికలను నిర్వహించడానికి అవసరమైన ఓటింగ్ యంత్రాలను పెంచడానికి అవసరమైన రూ. రూ.5,200 కోట్లు, రూ. 8,000 కోట్ల అదనపు ఖర్చులను భరించవలసి ఉంటుందని లా కమిషన్‌కు ఎన్నికల సంఘం ఇచ్చిన అంచనాలను స్పష్టం చేస్తున్నాయి. భారతదేశం అంతటా పోలింగ్ స్టేషన్ల సంఖ్య కూడా పెరుగుతుందని, 2014లో 11.8 లక్షల నుంచి 2029 నాటికి 13.57 లక్షలకు పెరుగుతుందని ఈసీ స్పష్టం చేసింది.

కులతత్వాన్ని, ప్రాంతీయవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయాలి

- ప్రధాని మోడీ సుద్దులు



న్యూఢిల్లీ : కులతత్వాన్ని, ప్రాంతీయవాదాన్ని సమాజం నుంచి కూకటివేళ్లతో పెకిలించిపారేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి చెడుపై దేశభక్తి సాధించిన విజయానికి గుర్తుగా ఈ దసరా పండుగ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. న్యూఢిల్లీలోని ద్వారకాలో మంగళవారం జరిగిన దసరా ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. శతాబ్దాల ఎదురుచూపుల తర్వాత అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరుగుతుండటం ప్రజల అదృష్టమని ఆయన చెప్పుకొచ్చారు. త్వరలోనే మందిరం పూర్తవుతుందని, ఇది ప్రజల సహనానికి దక్కిన విజయమని మోడీ చెప్పారు. చంద్రయాన్ విజయవంతం కావడం, నూతన పార్లమెంటు భవన సముదాయాన్ని ప్రారంభించుకోవడం, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తీసుకురావడం వంటి అనేక అభివృద్ధికర విజయాలను భారత్ ఈ ఏడాది సాధించిందని మోడీ తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి సాధించినట్లు అవుతుందని పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక హోదా పెంపొందేలా కనీసం ఒక పేద కుటుంబానికి సహాయం పడటంతో సహా పది ప్రతీనలు ప్రతి పౌరుడు తీసుకోవాలని ఆయన కోరారు. నీటిని పొదుపు చేద్దాం, డిజిటల్ లావాదేవీలు, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం, పనిలో నైపుణ్యాన్ని పెంచుకుందాం, దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహిద్దాం, తృణధాన్యాలను విరివిగా వినియోగిద్దాం వంటి ప్రతీనలను కూడా ప్రధాని ప్రజలతో చేయించారు. చిన్నరాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమంటూ ప్రాంతీయవాదాన్ని పెంచిపోషించే బిజెపి పార్టీలో అగ్రనాయకుడిగా ఉంటూ నిత్యం కులాల మధ్య చిచ్చురాజేసే భావజాలంతో అంటకాగే మోడీ ఇలాంటి నీతులు చెప్పడం విడ్డూరమని వ్యాఖ్యలు వినిపించాయి.

పూటకో కండువా..!

• రోజుకు రెండు పార్టీల్లో చేరిక • జంపింగ్ జిలానీలతో పార్టీలకు తలనొప్పి • చేరిన వాళ్లకు, చేర్పించిన వారికి తాయిలాలు • 'స్థానిక' ప్రజాప్రతినిధులు, నేతల తీరుతో తంటాలు • ఎవరు ఏ పార్టీయో తెలియని గందరగోళం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఎన్నికల సమయంలో గోడమీద పిల్లిలా వ్యవహారం ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారింది. పూటకో కండువా కప్పుకోవడంతో ఎవరు ఏ పార్టీయో తెలియని గందరగోళ స్థితి నెలకొంది. ఓ పదిమంది ఓ పార్టీ నుంచి మరోపార్టీలో చేరారంటే క్యాడర్‌ను కోల్పోయిన పార్టీ శిబిరంలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. కాబట్టి ఈ చేరికలను ఓ రాజకీయ వ్యూహంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. ఇదే అదనుగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వార్డుమెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కాస్త పేరున్న నేతలు అల్లోడిబంతి ఇల్లోడిబంతి ఆడుతున్నారు. ఈ చేర్పులు మార్పుల తతంగంలో చేర్పించిన వారికి, చేరిన వారికి లబ్ధి చేకూరుతున్నట్టు తెలుస్తోంది. ఓస్థాయి కలిగిన లీడర్లను ఓ ఐదారుగురిని చేర్పిస్తే పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుతున్నట్టు చర్చసాగుతోంది.

కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌కు షాక్..!

నిన్న ఓ పార్టీ కండువా కప్పుకుంటే తెల్లవారి అదే వ్యక్తులు మరో పార్టీలో చేరుతున్నారు. అలా వారు చేరింది మొదలు కాంగ్రెస్‌లో చేరితే బీఆర్ఎస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లో చేరితే కాంగ్రెస్‌కు షాక్ అంటూ సోషల్‌మీడియా టీమ్‌లు విచ్చలవిడిగా ట్రోల్ చేస్తున్నాయి. ఇందుకోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు రూ.లక్షలు వెచ్చించి సోషల్ మీడియా టీమ్‌లను సైతం నియమించుకున్నాయి. కొందరైతు రెండు, మూడు బృందాలను సైతం దుష్ప్రచారం కోసం ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

నిన్న కాంగ్రెస్.. నేడు బీఆర్ఎస్

విజయదశమి రోజున ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలో ఓ ముగ్గురు సర్పంచ్‌లు, ఓ ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తెల్లవారేసరికి ఏం జరిగిందో తెలియదు గానీ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరూనాయక్ ఆధ్వర్యంలో ఎన్‌వీ బంజర సర్పంచ్ సక్రాంనాయక్, రజబ్‌అలీ నగర్ సర్పంచ్, ఉపసర్పంచ్ బోడ శరత్, దంగుల నర్సింహారావు, మంగ్యాతండా సర్పంచ్ బీజా మత్రు తిరిగి సొంతగూటికి చేరారు. ఇది ఈ ఒక్క నియోజకవర్గంలోనే కాదు దాదాపు అన్నిచోట్లా ఇదో తంతులా సాగుతోంది.

బలవంతపెట్టారని కొందరు.. మభ్యపెట్టారని మరికొందరు...

ఈ మార్పులుచేర్పుల వ్యవహారంపై ఒక్కొక్కరు ఒక్కో రీతిలో స్పందిస్తున్నారు. బలవంతపెట్టారని కొందరు చెబుతుంటే.. మరికొందరు మభ్యపెట్టి కండువా కప్పారని అంటున్నారు. ఖమ్మం నగరం 31వ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెల్లంపల్లి సుబ్బారావు ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ నాయకులు బలవంతంగా ఇండ్లలోకి వచ్చి కండువాలు కప్పి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని ఆరోపిస్తూ మరుసటి రోజు మంత్రి పువ్వాడ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మొన్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీసుజాత కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అయితే ఎక్కువ మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి రావడం.. కారణాలు తెలియదుగానీ తెల్లవారే సరికి తిరిగి సొంతగూటికి చేరుతున్న ఉదంతాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి.

చేరినా.. చేర్పించినా పైసలే..!

నేతలకు మించిన తెలివితేటలను జంప్‌జిలానీలు ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వస్తే ఆయనకు జై కొడుతుండగా.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగానే ఆయనతోనే అంటున్నారు. అస్సలు ఎవరు మన వెంట.. ఎవరు కాదు.. అనే విషయంలో పార్టీలే గందరగోళ స్థితిలో ఉన్నాయి. దాదాపు ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ పార్టీలు మారి వచ్చినవారే కావడంతో వారి బాటలోనే తామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కొందరు నేతలు ఈ ఎన్నికల సీజన్‌లో చేరికల వ్యవహారాన్ని ఓ ఆదాయ వనరుగా మలుచుకున్నారనే చర్చ సాగుతోంది. ఓ పదిమందిని పార్టీ మార్పించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాయకునికి చేరిన వారి స్థాయిని బట్టి రూ.50వేల నుంచి రూ.లక్షలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. చేరిన వారికి సైతం రూ.పది వేల నుంచి రూ.20వేల వరకు చేతిలో పెడుతున్నారనే చర్చ నడుస్తోంది. అందుకే ఉదయమో పార్టీ.. సాయంత్రం మరోపార్టీ కండువాలు కప్పుకుంటున్నట్టు చెబుతున్నారు. ఈ తరహా ట్రెండ్ రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కొనసాగుతోంది. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి, భద్రాచలం నియోజకవర్గాల్లో ఈ మార్పుల చేర్పుల వ్యవహారం అధికంగా ఉందని అంటున్నారు.

రాష్ట్ర పథకాలపై అంతర్జాతీయ వేదికపై ప్రసంగించనున్న కవిత

• ఆహ్వానించిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర పథకాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అంతర్జాతీయ వేదికపై ప్రసంగించనున్నారు. లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆమెను ఆహ్వానించింది. ఈ నెల 30న ఆమె డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ ఇతివృత్తంలో భాగంగా ఉపన్యాసం ఇవ్వనున్నారు. తెలంగాణ స్థితిగతులు మార్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మాట్లాడనున్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ రంగం పురోగమించిన తీరు, రైతులకు రైతుబంధు పేరిట సీఎం కేసీఆర్ అందిస్తున్న పెట్టుబడి సాయం, 24 గంటల ఉచిత విద్యుత్తు అంశాలపై ఆమె ప్రసంగిస్తారు. అలాగే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రీఛార్జ్ అయ్యేలా కుల వృత్తులను ప్రోత్సహించడమే కాకుండా అనేక రూపాల్లో గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిపుష్టికి సీఎం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించనున్నారు. మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటి సరఫరాతో పాటు వైద్య, విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిపై కూడా యూనివర్సిటీలో కల్వకుంట్ల కవిత ప్రసంగించనున్నారు. ఒక్కొక్క పథకం అమలు వెనక ఎంత ప్రయోజనం ఉందో చెప్పడమే కాకుండా సీఎం కేసీఆర్ ఆలోచనల ప్రతిరూపమే తెలంగాణ అభివృద్ధి అని కవిత చాటి చెప్పనున్నారు.

నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

• భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌తో పాటు.. ఇద్దరు జెడ్పీటీసీలు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌ల రాజీనామా

నవతెలంగాణ-భైంసా

నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన వారంతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం శ్రీ బ్యాంకిట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, భైంసా, బాసర జెడ్పీటీసీలు సోలంకి దీప, వసంతా రమేష్, బాసర ఎంపీపీ సునీత విశ్వనాథ పటేల్, ముధోల్ జాగృతి కన్వీనర్ పండిత్ రావు, మాజీ జెడ్పీటీసీలు నీలాబాయి, రామ్‌కిషన్ పటేల్, ప్రమీల రాజేశ్వర్, శోభ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సోలంకి భీంరావు, 8 మంది ఎంపీటీసీలు, పదిమందికి పైగా సర్పంచులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. వారి అనుచరగణం 500 మంది కార్యకర్తలు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ అధిష్టానం తమ మాట వినకపోవడంతో నిర్ణయానికి వచ్చినట్టు తెలిపారు. ఇకనుంచి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఓటమి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే తీరు నచ్చకపోవడం వల్లే ఈ నిర్ణయానికి వచ్చినట్టు వెల్లడించారు. భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామన్నారు. బీఆర్ఎస్ నుంచి పెద్ద మొత్తంలో ప్రజాప్రతినిధులు వెళ్లిపోవడంతో ఆ పార్టీకి బిగ్ షాక్ తగిలినట్టయింది. ఎన్నికల సమయంలో పార్టీని వీడటం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బగా పలువురు బావిస్తున్నారు.

సాంఘీక భద్రత బిల్లు రూపొందించండి

• రాజకీయపార్టీలకు టీజీపీడబ్ల్యూయూ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలోని 4.2 లక్షల మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫాం కార్మికుల కోసం సాంఘీక భద్రత బిల్లు రూపొందించాలని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలాఉద్దీన్ రాజకీయపార్టీలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో ఈ అంశాలను పొందుపర్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయాలని కోరారు. ఓలా, ఊబర్, ర్యాపిడో, పోర్టర్, స్విగ్గి, జొమాటో, బ్లింక్ ఇట్, డుంజో, బిగ్ బాస్కెట్, షాడో ఫాక్స్, అర్బన్ కంపెనీ వంటి పలు సంస్థల సేవల్లో 4.2 లక్షల మంది డెలివరీ భాగస్వాములుగా పనిచేస్తున్నారని వివరించారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం గిగ్ అండ్ ప్లాట్‌ఫాం కార్మికులకు సాంఘిక భద్రత కల్పిస్తూ ఒక చట్టాన్ని తీసుకొచ్చిందని ఉదహరించారు. తెలంగాణాలో కూడా అలాంటి చట్టాన్ని రూపొందించాలని కోరారు. ఆయా యాప్ బేస్డ్ ప్లాట్‌ఫాంలో జరిగే ప్రతి లావాదేవీ పైనా ఒక రుసుమును నిర్ధారించి దాన్ని కార్మికుల సంక్షేమ సెస్ పేరుతో సాంఘీక భద్రత నిధికి డిపాజిట్ చేయాలని సూచించారు. అగ్రిగేటర్స్ (ప్లాట్‌ఫాం యజమానులు), కార్మిక సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులతో త్రైపాక్షిక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగేటర్ల ప్లాట్‌ఫాంలో నమోదు చేసుకున్న కార్మికులందరూ ఆ బోర్డులో ఆటోమాటిక్‌గా రిజిస్టర్ అవ్వాలనీ, ఆయా ప్రయోజనాలు పొందటానికి వారికి అర్హత కల్పించాలని సూచించారు. కేంద్రీకృత ఉమ్మడి పోర్టల్‌ను ఏర్పాటు చేసి, అగ్రిగేటర్ల వ్యాపార వ్యవహారాల పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం..

• బోరబండ సీఐపై వేటు

నవతెలంగాణ - జూబ్లీహిల్స్



విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌పై వేటు పడింది. హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్య బోరబండ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు బోరబండ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల వివరాలు తెలపాలని కోరారు. అదేవిధంగా రౌడీషీటర్ల ఇండ్లు చూపించాలని ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను సీపీ తీసుకెళ్లగా గుర్తించలేకపోయారు. అలాగే గతంలో కూడా సీఐపై కొన్ని ఫిర్యాదులు వచ్చినట్టు ఆధారాలు ఉన్నందున, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే సీపీ ఆఫీస్‌కు రావాలని సీఐకు ఆదేశాలు జారీ చేసి వెళ్లిపోయారు. అనంతరం సీఐ రవికుమార్‌ను సీపీ ఆఫీసుకు అటాచ్ చేశారు.

రాజస్థాన్ టూ హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా

• 100గ్రాముల హెరాయిన్ స్వాధీనం

• ఐదుగురు అంతరాష్ట్ర నిందితుల అరెస్టు

నవతెలంగాణ-కాప్రా

రాజస్థాన్ టూ హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురు అంతరాష్ట్ర నిందితులను ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 100గ్రాముల హెరాయిన్, ఆరు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం, రూ.820 నగదును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్‌వోటీ డీసీపీ కె.మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన బజరంగ్ బిష్ణోయ్, మహేందర్ బిష్ణోయ్, అభిషేక్ బిష్ణోయ్, పి.బిష్ణోయ్, శిశుపాల్ బిష్ణోయ్ సులువుగా డబ్బులు సంపాదించాలని డ్రగ్స్ సరఫరా చేయడం మొదలు పెట్టారు. రాజస్థాన్ నుంచి వివిధ రాష్ట్రాలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న నిందితులు.. హైదరాబాద్‌కు హెరాయిన్ సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో కుషాయిగూడ పరిధిలో హెరాయిన్ సరఫరా చేస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు కుషాయిగూడ పోలీసులతో కలిసి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

రాజకీయ విలువలు పాటించరా?

• స్పోర్ట్స్ అథారటీ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాప్రతినిధులుగా ఉన్న వారు కనీస రాజకీయ విలువలను పాటించరా? అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారటీ మాజీ చైర్మెన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుంట్ల దామోదర రెడ్డి పార్టీ మారాలనుకున్నప్పుడు వారు తమ పదవులకు ఎందుకు రాజినామా చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో పదవులు పొంది కాంగ్రెస్ పార్టీలో కొనసాగటం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే ఎమ్మెల్సీ పదవులకు రాజినామా చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పాలపిట్ట కేసీఆర్‌కు అండగా నిలుద్దాం

• చెడుపై విజయం సాధించడమే విజయదశమి : మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ పాలపిట్ట కేసీఆర్‌కు అండగా నిలుద్దామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట జిల్లా నర్సాపూర్, రంగదాంపల్లిలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాలపిట్టను ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఉత్సాహం తీసుకురావాలని ప్రార్థిస్తున్నానన్నారు. చెడుపై విజయం సాధించడమే విజయదశమి అని గుర్తు చేశారు. గత దసరాకు అనుకున్న రైలును ఈ సంవత్సరం తెచ్చుకున్నామన్నారు. సిద్దిపేట దశాబ్దాల కలలను నిజం చేసుకున్నామని, రాబోయే రోజుల్లో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూరుకు రైలు సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. దసరా రోజు పవిత్రమైన పాలపిట్టను చూస్తే అంతా శుభమే జరుగుతుందన్నారు. పవిత్ర పాలపిట్ట సాక్షిగా ప్రమాణం చేద్దామని, మన పాలపిట్ట కేసీఆర్‌కు అండగా నిలుద్దామని అన్నారు. వచ్చే బతుకమ్మ నాటికి సిద్దిపేట కోమటి చెరువు వద్ద ఆర్టిఫీషియల్ బీచ్, శిల్పారామం ప్రారంభించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల్ రెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

ఆస్తి, అప్పుల విషయంలో గొడవ

• భర్తను హత్యచేసిన భార్య

నవతెలంగాణ-తుంగతుర్తి



ఆస్తి, అప్పుల విషయంలో భర్తతో గొడవపడి కుమారుడితో కలిసి ఓ భార్య భర్తను అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన సూర్యాపేట జిలాల తుంగతుర్తి మండలం రామన్న గూడెం తండాలో మంగళవారం ఉదయం జరిగింది. తుంగతుర్తి సీఐ బ్రహ్మమురారి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన చెందిన భూక్యా హర్జ(49) అతని భార్య భూక్యా కైకకు భూమి, అప్పులకు సంబంధించిన విషయాల్లో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు కూడా ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో నాలుగు నెలల కింద కైక భర్తతో గొడవపెట్టుకుని హైదరాబాద్‌లో తన కొడుకు భూక్యా సురేష్ వద్ద ఉంటుంది. ఆ గొడవలను మనసులో పెట్టుకొని తన భర్తను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో నాలుగురోజుల కింద కైక, కుమారుడు సురేష్ తండాకు వచ్చారు. మంగళవారం ఉదయం 3 గంటల సమయంలో గాఢనిద్రలో ఉన్న హర్జపై భార్య, కొడుకులిద్దరూ కత్తిపీటతో తలపై దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హర్జ.. మృతిచెందాడని నిర్ధారించుకొని నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తమ్ముడు భూక్యా సుందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వందేభారత్‌లో వందశాతం ఓఆర్

• ప్రయాణీకుల్లో 56 శాతం యువతే

• ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వందేభారత్ రైళ్లు వందశాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో నడుస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ రైళ్లలో 56 శాతం యువత ప్రయాణాలు చేస్తున్నదనీ, సీనియర్ సిటిజన్లు కూడా దూరప్రాంతాలకు వేగంగా వెళ్లేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఐదు వందే భారత్ రైళ్లు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడుస్తున్నాయని వివరించారు. సికింద్రాబాద్ - విశాఖపట్నం, సికింద్రాబాద్ - తిరుపతి, తిరుపతి - సికింద్రాబాద్, కాచిగూడ - యశ్వంతపూర్ (హైదరాబాద్ - బెంగళూరు), విజయవాడ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రూట్లలో ఈ రైళ్లు తిరుగుతున్నాయని మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. శ్రామిక వర్గాలు కూడా వందేభారత్ రైలు ప్రయాణాన్ని ఇష్టపడుతున్నారన్నారు. 11.81 శాతం మంది 60 ఏండ్లు పైబడిన ప్రయాణీకులు ఈ రైలులో ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. వేగవంతమైన ప్రయాణంతో గమ్యాల మధ్య సమయాన్ని భారీగా కుదించబడ్డాయనీ, ఈ రైళ్లు జోన్ పరిధిలో ప్రారంభమైననాటి నుంచి ఇప్పటి వరకు 7.16 లక్షల మంది ప్రయాణించారని వివరించారు.

కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

• సీపీఐ(ఎం) ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చండి : తమ్మినేనికి ఉద్యోగ, కార్మిక సంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ(ఎం) ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు కోరాయి. రాష్ట్రంలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా రూపొందించిన 'వర్కర్స్ మ్యానిఫెస్టో' అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. కష్టజీవులకు మేలు చేసే అంశాలను మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరాయి. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు కలిసి వర్కర్స్ మ్యానిఫెస్టోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐయూటీయూసీ తెలంగాణ ఇంచార్జి భరత్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, మెడిసిన్‌పై జీఎస్టీ ఎత్తేసి ధరలు తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, స్థానిక సంస్థల్లో పనిచేసే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమ స్యలను పరిష్కరించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదని వివరించారు. అందుకే ఈసారి మ్యానిఫెస్టోలో కార్మికుల అంశాలను చేర్చాలని తెలిపారు. కోటి మందికిపైగా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టోను రూపొందించినట్టు పేర్కొన్నారు. కాంట్రాక్టు లేబర్ యాక్ట్ 1970 ప్రకారం కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాల్సిన అవసరముందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కార్మిక శాఖ అధికారులను (డీసీఎల్) నియమించాలని కోరారు. పేదలు, సామాన్యులు వినియోగించే మందులపై ధరలు తగ్గించాలనీ, మందులు, మందుల తయారీ పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలనే అంశాన్ని చేర్చాలన్నారు. సింగరేణిలో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలను అమలు చేయాలనీ, దాన్నించి లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు కూడా వాటా చెల్లించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలనే విషయాన్ని తెలిపారు. వారికి పెన్షన్ రూ 7వేలు ఇవ్వాలనే డిమాండ్ తెలియజేశారు.

హైదరాబాద్ పార్టీ నిర్మాణంలో కీలక వ్యక్తి ఎన్‌వీ భాస్కర రావు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు

• ఎన్‌వీ భాస్కర రావు 39వ వర్ధంతి సభ

నవతెలంగాణ-కాప్రా/బాలానగర్

హైదరాబాద్ నగరంలో సీపీఐ(ఎం)ను నిర్మించడంలో ఎన్‌వీ భాస్కర రావుది కీలక పాత్ర అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు అన్నారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర ఉద్యమ నిర్మాత ఎన్‌వీ భాస్కర రావు 39వ వర్ధంతి సభలను ఈసీఐఎల్, బాలానగర్ పార్టీ కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీ నర్సింహారావు పాల్గొని మాట్లాడారు. నగరంలో సీపీఐ(ఎం)ను నిర్మించడంలో దాన్ని పురోగ మార్గంలో నడిపించడంలో భాస్కర రావు పాత్ర కీలకమని చెప్పారు. హైదరాబాద్ నగరం ఉద్యమం పక్కనున్న ప్రాంతాలకు విస్తరించి అక్కడ జిల్లా నిర్మాణాలకు ఉపయోగపడిందని చెప్పారు. భాస్కరరావు స్ఫూర్తితో కార్మిక వర్గంలో పేద ప్రజల పక్షాన నిలబడుతూ ఆందోళన పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. కార్మిక వర్గరాజ్యం కోసం అందరినీ ఐక్యం చేసి ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కోమటి రవి మాట్లాడుతూ.. భాస్కరరావు చేసిన కృషి, నిర్మాణ దక్షత విద్యార్థి దశలో తనకు ప్రేరణనిచ్చాయని గుర్తుచేస్తున్నారు. జె. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్యకర్తలతో వారు వ్యవహరించిన తీరు, నడిపించిన శైలి కార్యకర్తలను ఉత్తేజపరిచేదన్నారు. సీనియర్ నాయకులు దేవి రెడ్డి, పీబీ చారి, ప్రసాద్, భాస్కర రావు కుమార్తె నిర్మల వారితో అనుబంధాన్ని పంచుకున్నారు. యాదగిరిరావు మాట్లాడుతూ.. ఆయన అన్నివేళలా ఆదర్శప్రాయంగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్ బాబు, రాజమల్లు, శివ నారాయణ, జయరాజ్, జయ ప్రకాష్, శారద, వెంకటేశ్వరరావు, ఉన్నికృష్ణన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి కార్తీక్ ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎ. విజయ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక వర్గం కోసం అహర్నిశలు శ్రమించారు
ఎన్‌వీ భాస్కరరావు వర్ధంతిలో పి రాజారావు

కార్మిక నేత ఎన్‌వీ భాస్కరరావు కార్మిక హక్కుల సాధన కోసం అహర్నిశలు శ్రమించారని సీఐటీయూ సీనియర్ నేత పి రాజారావు గుర్తు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌వీ భాస్కరరావు 39వ వర్ధంతి కార్యక్రమం రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. భాస్కరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో సీఐటీయూ ఏర్పడిన నాటి నుంచి ఆయన రాష్ట్ర ఆఫీస్ బేరర్‌గా పనిచేశారని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఎన్ భాస్కరరావు ప్రభుత్వరంగ సంస్థల్లోని కార్మికుల సమస్యలపై ప్రత్యేక కేంద్రీకరణతో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజాతంత్ర బాధ్యతల నిర్వహణలోనూ అవిశ్రాంతంగా పని చేశారని తెలిపారు. కార్మిక వర్గం సంస్కరణ వాదం వైపు కొట్టుకుపోతున్న తరుణంలో కార్మిక వర్గ ఐక్యత, కార్మిక వర్గ రాజ్య స్థాపనకై ఎనలేని కృషి చేశారన్నారు. ఈ వర్ధంతిని పురస్కరించుకుని వచ్చే నెల 7న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో 'వర్తమాన పరిస్థితులు-మతోన్మాద ప్రమాదం-కార్మిక వర్గ సవాళ్ళు' అనే అంశంపై ఎన్‌వీ స్మారక సెమినార్ నిర్వహిస్తామన్నారు. సదస్సులో సీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బీవీ.రాఘవులు, సీఐటీయూ సీనియర్ నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

• బండరాళ్లతో కొట్టి చంపిన రౌడీ షీటర్

• ఎస్ఆర్‌నగర్‌లో ఘటన

• బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తలసాని

నవతెలంగాణ - జూబ్లీహిల్స్



హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఓ వ్యక్తిని రౌడీ షీటర్ బండరాళ్లతో కొట్టి చంపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట డివిజన్ బాపునగర్‌కు చెందిన తరుణ్ నాయక్(30), ఎస్ఆర్‌నగర్‌కు చెందిన రౌడీ షీటర్ షరీఫ్ ఇద్దరూ స్నేహితులు. విజయదశమి సందర్భంగా దాసారం బస్తీలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరూ మద్యం సేవించారు. అనంతరం వారి మధ్య ఏదో విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో షరీఫ్ తరుణ్ నాయక్‌ను తోసేసి బండరాళ్లతో అతనిపై దాడి చేశాడు. స్థానికులు గమనించి అరవడంతో షరీఫ్ అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది అక్కడకు చేరుకొని తరుణ్‌ను అమీర్‌పేట్‌లోని ప్రైమ్ హాస్పిటల్‌కి తరలించిగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం విషయం తెలుసుకున్న వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. కాగా, నిందితుడు షేక్ షరీఫ్‌ను పోలీసులు అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. షరీఫ్‌పై గతంలో అనేక కేసులు ఉన్నాయని, పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు కోరుతున్నారు. హత్యకు గల కారణాలను త్వరలో తెలుసుకొని నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ తెలిపారు.

రౌడీ షీటర్లు లేకుండా చేస్తాం : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రౌడీ షీటర్ దాడిలో మృతి చెందిన తరుణ్ కుటుంబ సభ్యులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. గాంధీ ఆస్పత్రికి వచ్చిన మంత్రి.. మార్చురీలో మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘటన వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలో రౌడీ షీటర్లు లేకుండా చేయాలని అన్నారు. అందుకు తన వంతు సహాయ సహకారాలు పోలీసులకు అందిస్తానని, నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

సంపాదకీయం

చీకటి వ్యాపారం!

ఆశ జీవితాన్ని నడిపిస్తుంది. ఆశయం ఆ జీవితానికి ఒక అర్థాన్ని ఇస్తుంది. కానీ, నేడు సమాజంలో ఆశయం, నైతిక విలువలు, మానవత్వం వంటివి రానురాను అడుగంటిపోతున్నాయి. ఆశ దురాశగా రూపం మార్చుకుంటుంది. కష్టపడకుండా తెల్లవారేసరికి కుబేరులు కావాలనే దురాశ చేయరాని, చేయకూడని పనులు చేయిస్తున్నది. ఈ డబ్బు సంపాదనలో మంచి చెడులు విచక్షణ ఉండటం లేదు. ఏమి చేసి అయినా డబ్బు సంపాదించాలనే ఆరాటం పెరిగిపోతున్నది. డబ్బు సంపాదన ఆరాటంలో రకరకాల మార్గాలు అనుసరిస్తున్నారు. ఏకంగా ఇన్సూరెన్స్ చేయించి వ్యక్తులను హతమార్చి డబ్బు కాజేసేందుకు సైతం వెనుకాడటం లేదు. మానవ అవయవాలను కూడా అమ్ముకొని సొమ్ము చేసేకునే చీకటి వ్యాపారాలు వెలుగు చూస్తున్నాయి. ఈ వ్యాపారం అంతకంతకు విస్తరిస్తున్నది. మానవత్వం ఉన్న వారందరూ ఖండించాల్సి ఘటనలు ఇవి. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తత అవసరం.

> కిడ్నీల మార్పిడికి మనదేశంలో కొన్ని నిర్దిష్టమైన కఠినమైన నిబంధనలు ఉన్నాయి. దీంతో ఏజెంట్లు కొందరు శ్రీలంక లోని కొలంబో కేంద్రంగా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. హైదరాబాదీ యువకుడు ఈ ఉచ్చులో పడే కొలం బోలో ప్రాణాలు పొగొట్టుకున్నాడు. చదువుకున్న యువకులు ఈ ఉచ్చులో ఎలా పడు తున్నారా అని ఆలోచిస్తే కానీ, అసలు విషయం భోదపడదు. చదువు ముగించుకొని సమాజంలో అడుగు పెట్టిన యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ఉపాధిని చూపడంలో విఫల మయ్యాయి. ఆ పాప పంకిలమే నేటి ఈ దుస్థితికి కారణం



అమాయక నిరుపేదలను మాయ మాటలతో నమ్మించి లక్షలాది రూపాయలకు బీమా (ఇన్సూరెన్స్) చేయించి ఆ తర్వాత కొన్నాళ్లకు ఒక వ్యూహం ప్రకారం వారిని హత్య చేసి అది ప్రమాదంగా సృష్టించి ఇన్సూరెన్స్ డబ్బును దిగమింగుతున్న వైనం గతంలో నిజామాబాద్ జిల్లాలో వెలుగు చూసింది. రోజువారీ కూలి చేసుకొనే ఒక వ్యక్తితో లక్షలాది రూపాయల ఇన్సూరెన్స్ చేయించారు. ఆ తర్వాత ఆయన ప్రమాదంలో చనిపోయినట్లు రికార్డులు సృష్టించి ఇన్సూరెన్స్ డబ్బు కాజే స్తున్నారు.. దేశంలో ఇలాంటి సంఘటనలు కొకొల్లలు.. మనుషులు ప్రాణాలను అత్యంత కిరాతకంగా తీసి దాన్ని డబ్బుగా మార్చుకోవడం కంటే దుర్మార్గం మరొకటిలేదు. ఇక మానవ అవయవాల వ్యాపారం కూడా తెలుగు రాష్ట్రాలను కలవర పెడుతుంది. కొన్ని మృతదేహాలను మెడికల్ కాలేజీలకు గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుంటున్నారు. గతంలో ఈ ఆరోపణలు వచ్చాయి. వాటి మీద తీసుకున్న చర్యలు శూన్యం. అందుకే మళ్లీ అది పిలకలేస్తుంది. ఇదంతా ఒక ఎత్తైతే కిడ్నీల అమ్మకాలు మరో ఎత్తు. గతంలో శ్రీలంక రాజధాని కొలంబో కేంద్రంగా ఈ కిడ్నీ రాకెట్ కొనసాగుతున్న విషయం బయట పడింది. కిడ్నీలు ఇస్తే లక్షలాది రూపాయలు ఇస్తా మని ఆశచూపి యువకుల జీవితాలతో ఈ ముఠాలు ఆటలాడుకుంటున్నాయి.

ఒక్క హైదరాబాద్లోనే కాదు. విశాఖపట్నం, విజయవాడ, తమిళనాడు, బెంగళూరులోనూ, ఈ కార్య కలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అవసరాన్ని బట్టి ఒక్కొక్క కిడ్నీకి పది లక్షల నుంచి ఇరవై లక్షల వరకు చెల్లిస్తున్నారు. కిడ్నీల మార్పిడికి మనదేశంలో కొన్ని నిర్దిష్టమైన కఠినమైన నిబంధనలు ఉన్నాయి. దీంతో ఏజెంట్లు కొందరు శ్రీలంక లోని కొలంబో కేంద్రంగా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. హైదరాబాదీ యువకుడు ఈ ఉచ్చులో పడే కొలం బోలో ప్రాణాలు పొగొట్టుకున్నాడు. చదువుకున్న యువకులు ఈ ఉచ్చులో ఎలా పడు తున్నారా అని ఆలోచిస్తే కానీ, అసలు విషయం భోదపడదు. చదువు ముగించుకొని సమాజంలో అడుగు పెట్టిన యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ఉపాధిని చూపడంలో విఫల మయ్యాయి. ఆ పాప పంకిలమే నేటి ఈ దుస్థితికి కారణం.

పట్టభద్రులైన ఆ యువకుడు ఉద్యోగ అన్వేషణలో ఇతర ప్రాంతాలకు వెళ్లడం.... ఆ తరువాత వారికి ఉద్యోగం రాక, కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలిసి ఇంట్లో ఇబ్బంది పెట్టలేక, బతకలేక కొందరు బలవన్మరణాలకు పాల్పడు తుంటే... మరి కొందరూ బతుకు మీద ఆశతో అవయవాలు అమ్ముకుంటున్నారు. దేశాన్ని కారుమబ్బులా కమ్ముకున్న నిరుద్యోగ సమస్య ఈ చీకటి వ్యాపారానికి ఆజ్యం పోస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సక్రమమైన పద్ధతితో ఉద్యోగాలు భర్తీ చేస్తే, కనీసం చదువుకున్న యువతైనా ఇలాంటి చీకటి వ్యాపారాల భారీ పడకుండా ఉంటారు. దేశంలో ఈ పరిస్థితి దాపురించడానికి సరళీకృత విధానాలది ముఖ్య భూమికే. మన దేశంలో నిరుద్యోగం పెల్లుబికడానికి, కార్పొరేటు సంస్థల దోపిడికి, ఇలాంటి వికృత వ్యాపారాలకు ఆ విధానాలు కారణమే. ఇకనైనా ప్రభుత్వాలు, బీమా సంస్థలు ఈ అవయవాల వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పెట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■



అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలి

ఇజ్రాయెల్ యుద్ధ నేరాలను అమెరికా, యూరోపియన్ యూనియన్ కప్పిపుచ్చుతున్నాయని భారత్‌లోని పాలస్తీనా రాయబారి అద్నాన్ అబు అల్హైజా అన్నారు. అంతేగాక, ఇప్పుడు ఇజ్రాయిల్ దేశ చరిత్రలో అత్యంత తీవ్రవాద ప్రభుత్వం ఉంది. అంతర్జాతీయ సమాజం ఇజ్రాయెల్‌పై గట్టి ఒత్తిడి తెస్తే తప్ప పాలస్తీనా ప్రజలకు న్యాయం లభించదు. 60 లక్షల మంది పాలస్తీనియన్లను శాశ్వతంగా లొంగదీసుకోవచ్చని ఇజ్రాయెల్ భావిస్తోందన్నారు. అద్నాన్ అబు 'దేశాభిమాని' పత్రికా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన ముఖ్యాంశాలు...

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సైన్యం దారుణమైన దాడులకు తెగబడుతోంది. అయితే అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దుల్లో 'హమాస్' జరిపిన దాడికి ప్రతీకారంగా దీనిని అభివర్ణిస్తున్నారు. ఇజ్రాయెల్, దాని మద్దతుదారులు చేస్తున్న ఈ వాదనను మీరెలా చూస్తారు?

ఈ క్షణం వరకు పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న దాడులను ఆపలేకపోయారు. ఇజ్రాయెల్ చరిత్రలో ఇప్పుడున్నది అత్యంత తీవ్రవాద ప్రభుత్వం. ఇలాంటి యుద్ధ నేరాలు చేయడానికి ఎవరి సహాయం అవసరం లేదు. కానీ ఇజ్రాయెల్‌కు అమెరికా ఆయుధాలు అందిస్తోంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆ దేశం వెళ్లారు. అమెరికా విమాన వాహక నౌకలు ఇజ్రాయెల్ సరిహద్దులో ఉన్నాయి. ఇజ్రాయెల్ ఇప్పుడు స్వీయదహనంలో ఉంది. ఇజ్రాయెల్‌ను సృష్టించింది బ్రిటన్. అందుకు అమెరికా, ఫ్రాన్స్ వంటివి మద్దతు పలి కాయి. ఇజ్రాయెల్ కేవలం సైనిక శక్తిపై ఆధారపడిన దేశం. అమెరికాకు ఇజ్రాయెల్ అత్యుత్తమ పెట్టుబడి అని అధ్యక్షుడు జోబైడెన్ అన్నారు. యూదులు ఆ విధంగానే చూస్తారు. ఇజ్రాయెల్ ఏర్పడి ఉండకపోతే, తానే ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేసి ఉండేవాడినని కూడా బైడెన్ చెప్పాడు. యుద్ధాలలో ఇజ్రాయెల్ ప్రమేయం కూడా బైడెన్‌కు తెలుసు. 'మాతృభూమి' అనే అబద్ధం ఆధారంగా సృష్టించబడిన ఇజ్రాయెల్ ఇప్పుడు పాలస్తీనియన్లను పొట్టన పెట్టుకుంటోంది. ఇజ్రాయెల్‌కు జన్మనిచ్చిన వారు దీనిని అడ్డుకునేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదు.

అయితే ఇతర దేశాలు పాలస్తీనాకు మద్దతిస్తున్నాయా? ఉదాహరణకు లాటిన్ అమెరికా దేశాలు...?!

అవును, లాటిన్ అమెరికా దేశాలు మాకు మద్దతు ఇస్తున్నాయి. చైనా, గల్ఫ్ దేశాల మద్దతు కూడా వుంది. యూరప్ నుండి కూడా అనేక దేశాల మద్దతు ఉంది.

ప్రస్తుత పరిస్థితికి త్వరలో పరిష్కారం లభిస్తుందన్న ఆశ ఉందా...

గాజా ప్రజలు చాలా దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. ఇజ్రాయెల్ యుద్ధ మంత్రి గాజాపై దిగ్బంధనాన్ని ప్రకటించాడు. వారికి ఆహారం, నీరు, విద్యుత్, మందులు, ఇంధనం నిరాకరించబడ్డాయి. పాలస్తీనా ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. వారి భవనాలపై ఇజ్రాయెల్ బాంబులు వేస్తోంది. 10 లక్షలమంది ప్రజలను ఉత్తరం నుండి దక్షిణ గాజాకు తరలించాలని ఆదేశించింది. అంతేకాకుండా, ఇజ్రాయెల్ యుద్ధ మంత్రి గాజాలోని 22 లక్షలమంది పాలస్తీనీయులను 'మానవ మృగాలు' అన్నాడు. ప్రజాస్వామ్య దేశంలో ఒక మంత్రి ఇలా మాట్లాడతాడా? ఫాసిస్టు పాలనా ప్రతినిధి మాత్రమే ఇలా మాట్లాడతాడు. ఈ విధమైన దండయాత్రను మనం చవిచూస్తున్నాం. వారికి శాంతి అక్కర్లేదు. వారికి భూమి మాత్రమే కావాలి. 6 కోట్ల మంది పాలస్తీనా ప్రజలు ఎప్పటికీ తమ ఆక్రమణలోనే ఉండాలని వారు కోరుకుంటున్నారు.

హమాస్ దాడికి ఎంచుకున్న సమయానికి సంబంధించి కొన్ని వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్న సమయంలో ఇది మొదలవడాన్ని ఎలా చూస్తారు?

హమాస్ ఎదురుదాడి ప్రారంభించింది, దాడి కాదు. గత డిసెంబర్ నుంచి ఇజ్రాయెల్ నిరంతరం దాడులు చేస్తోంది. ఒక్క వెస్ట్ బ్యాంక్‌లోనే 260 మంది చనిపోయారు. అల్ అక్సా మసీదుపై ప్రతి రోజూ దాడులు జరుగుతున్నాయి. అల్-అక్సా మసీదులో పాలస్తీనా మహిళలతో ఇజ్రాయెల్ సైనికులు ఎలా ప్రవర్తించారో అందరూ చూశారు. పాలస్తీనా భూమి ప్రతి రోజూ ఆక్రమణకు గురవుతోంది. పాలస్తీనియన్లు ప్రతి రాత్రి అరెస్టు చేయబడుతున్నారు. ఇజ్రా యెల్ జైళ్లలో దాదాపు 5,000 మంది పాలస్తీనా ఖైదీలు ఉన్నారు. ఈ పరిస్థితి ఒక్క గాజాలోనే కాదు. ఇది వెస్ట్ బ్యాంక్‌లోనూ వున్నది. పాలస్తీనా ప్రజలు ప్రపంచంలోనే అత్యంత దారుణమైన దురాక్రమణను ఎదుర్కొంటున్నారు. దురాక్రమణదారులకు పశ్చిమ దేశాల మద్దతు ఉంది. మాకు ఔదార్యం కాదు, డబ్బు కాదు, సమస్యకు రాజకీయ పరిష్కారం కావాలి. పాలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికారం కాపాడబడాలి. మన పిల్లలు ఇతర పిల్లల్లాగే ఆడుకుంటూ పెరిగే అవకాశం ఉండాలి. అంతేగాని వారు ప్రతిరోజూ దాడుల్లో చనిపోకూడదు. అంతర్జాతీయ సమాజం తన బాధ్యతను నిర్వర్తించాలి. గాజాలోని 22 లక్షలమంది ప్రజలపై దిగ్బంధనానికి ముగింపు పలకాలి. వారికి నిత్యావసరాలు అందాలి. శాంతి ప్రక్రియను ప్రారంభించకుండా, పాలస్తీనా ప్రజలకు న్యాయం చేకూర్చ కుండా అక్కడ శాంతి సాధ్యం కాదు. పాలస్తీనా అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీలో ఇప్పటిదాకా 800 తీర్మానాలు ఆమోదించారు. వీటిలో ఒక్క తీర్మానాన్నైనా అమలు చేయమని ఇజ్రాయెల్‌ను ఎవరూ అడగలేదు. శాంతి ప్రక్రియ చేపడతారని ఆశిస్తున్నాం. ఈ ప్రాంతంలో ఇదే చివరి యుద్ధం కావాలని ఆశిస్తున్నాం. ఇజ్రాయెల్‌ది వర్ణవివక్ష పాలనని ప్రకటించడానికి పశ్చిమదేశాలు సిద్ధంగా ఉండాలి. ఈ ప్రయోగం దక్షిణా ఫ్రికాలో విజయం సాధించింది.

భారతదేశం నుండి పాలస్తీనాకు లభిస్తున్న మద్దతుతో మీరు సంతృప్తి చెందారా...?

భారతదేశంతో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. భారత్‌కు మంచి అవకాశం లభించింది. గాజా సరిహద్దును తెరిచి, నిత్యావసర వస్తువుల పంపిణీకి అవసరమైన పరిస్థితులను కల్పించాలని ఇజ్రాయెల్‌ను భారత్ కోరాలి. ఇజ్రాయెల్ చేస్తున్నది యుద్ధ నేరం. గాజాలోని ఆసుపత్రులను నాశనం చేసే ఎత్తుగడ కూడా ఉంది. ఈ పరిస్థితికి ముగింపు పలకాలి. ఇజ్రాయెల్‌లో ప్రాణనష్టానికి సంబంధించి అతిశయోక్తితో కూడిన వార్తలు వస్తున్నాయి. ఎక్కడైనా సరే మరణం బాధాకరమైనది. అయితే ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం నుంచి అసత్య ప్రచారం జరుగుతోంది. ఇజ్రాయెల్ పిల్లలను హమాస్ చంపిందనే అబద్ధపు వార్తకు సంబంధించి సిఎన్ఎన్ రిపోర్టర్ క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి. ■

ఇజ్రాయెల్ మారణకాండ - మధ్యధరాలో చైనా యుద్ధ నౌకలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

అక్టోబరు ఏడవ తేదీన హమస్ సాయుధులు జరిపిన దాడులలో 1400 మందికి పైగా మరణించారు. దానికి ప్రతీకారం పేరుతో ఇప్పటివరకు ఇజ్రాయెల్ మిలిటరీ, యూదు దురహంకార సాయుధులు పాలస్తీనాలోని గాజా, పశ్చిమగట్టు ప్రాంతాలలో జరుపుతున్న దాడుల్లో మరణాలు, గాయపడిన వారు ఐదు, పదిహేనువేలు దాటారు. ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన వారికి సంతాపం తెలిపేందుకు ఎవరూ ఉండటం లేదనే శీర్షికతో అల్ జజీరా పత్రిక వార్త ఇచ్చింది. దానిలో పేర్కొన్నదాని ప్రకారం సోమవారం నాటికి గాజాలో 2,055 మంది పిల్లలు, 1,119 మంది మహిళలతో సహా 5,087 మంది మరణించారు. గాయపడిన వారు 15,273 మంది. వీరుగాక పాలస్తీనాలో ఆక్రమించిన పశ్చిమ గట్టు ప్రాంతంలో ఇజ్రాయెలీ మూకలు మరో 95 మందిని చంపగా 1,650 మంది గాయ పడ్డారు. ఇక హమస్ జరిపిన ఒక రోజు దాడిలో1,405 మంది మరణించగా, 5,431 మంది గాయపడ్డారు.వీరు గాక పాలస్తీనాలో 720 మంది పిల్లలతో సహా1,400 మంది కనిపించటం లేదు. పశ్చిమ గట్టు ప్రాంతంలో 1,215 మందిని ఇజ్రాయెల్ అరెస్టు చేసింది. బందీలుగా ఉన్న ఇద్దరు ఇజ్రాయెలీ వృద్ధ మహిళలను మానవతాపూర్వక వైఖరితో హమస్ విడుదల చేసింది. ఇజ్రాయెల్ ప్రతీకార ఏకపక్ష దాడులతో ఇరవై మూడులక్షల మంది గాజా పౌరులు నరకయాతన అనుభవిస్తున్నారు. రక్తదాహం తీరని యూదు దురహంకారులు పశ్చిమ దేశాలు ఇస్తున్న మద్దతుతో మరింతగా దాడులు చేసి జనాన్ని మట్టుపెట్టాలని చూస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని స్థితి.

దాడులు, మారణకాండ నివారణలో ఐక్యరాజ్యసమితి విఫలమైంది. ఇజ్రాయెల్ పూర్తి యుద్ధ సన్నాహాల్లో ఉంది. ఒక్క గాజా మీదనే గాక ఇరుగుపొరుగు అరబ్ దేశాలను రెచ్చగొడుతూ ఉగ్రవాదుల సాకుతో అడపదడపా దాడులు చేస్తున్నది. వాటి తీవ్రతను పెంచేందుకు సరిహద్దుల్లోని తమ గ్రామాల్లో ఉన్న జనాన్ని ఖాళీ చేయిస్తున్నది. దానికి ప్రతిగా లెబనాన్ కూడా తన పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నది. ఇజ్రాయెల్-అమెరికా కూటమి దేశాల దుండగాలను నివారించేందుకు, పాలస్తీనియన్ల తరఫున అవసరమైతే రంగంలోకి దిగేందుకు ఇరుగు పొరుగు దేశాలు కూడా సిద్ధపడుతున్నాయి. మరోవైపున అమెరికా, ఐరోపాలోని అనేక పట్టణాల్లో లక్షలాది మంది జనం వీధుల్లోకి వచ్చి గాజాపై దాడులను నిరసిస్తున్నారు. యూదుల రక్షణ పేరుతో అరబ్బులపై మారణకాండకు పూనుకోవద్దని కోరుతున్న వారిలో యూదులు అనేకమంది ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. శనివారం నాడు భద్రతా మండలిలో అమెరికా ప్రతిపాదించిన ఒక తీర్మానంలో ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ చేసుకొనే హక్కు ఉందంటూ సమర్ధనకు పూనుకుంది.దాడుల విరమణకు ఇది సమయం కాదని ప్రకటించింది. గాజాలో జరుపుతున్న కొన్ని దాడులు ఇజ్రాయెల్‌కు ఎదురుదెబ్బకావచ్చని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హెచ్చరించాడు.దాడులకు మద్దతు తెలి పేందుకు ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ మంగళవారం నాడు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ చేరుకు న్నాడు. తాజా పరిణామాలను చర్చించేం దుకు గురువారం నాడు ఐరాస సాధారణ అసెంబ్లీ సమావేశం జరగనుంది.

గాజా ప్రాంతంలో చిక్కుకు పోయిన ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరులు రెండు వందల మందికి పైగా హమస్ చేతుల్లో బందీలుగా ఉన్నారు. వారందరినీ విడుదల చేసిన తరువాతే కాల్పుల విరమణ గురించి మాట్లాడాలని అమెరికా అధినేత జో బైడెన్ చెప్పాడు. ఏదో విధంగా వారిని విడిపించుకున్న తరువాత ఇప్పటి వరకు వైమానిక దాడులు జరుపుతున్న ఇజ్రాయెల్ తదుపరి దశ పేరుతో భూతల దాడులకు సిద్ధం అవుతున్నది. ఇదంతా హమస్‌ను నాశనం చేసే పేరుతో జరుగుతోంది.మరణించిన వారిలో 70 శాతం మంది పిల్లలు, వృద్ధులు, మహిళలే ఉన్నారు. అంటే జనం మీదనే దాడి జరుగుతోందన్నది స్పష్టం. మరింతగా పెరిగితే లెబనాన్‌లోని హిజబుల్ వంటి సాయుధ శక్తులు ప్రతిదాడులకు సిద్ధం అవుతున్నాయి. ఇజ్రాయెల్ కు మద్దతుగా ప్రత్యక్షంగా దాడులకు దిగేందుకు అమెరికా రంగం సిద్ధం చేసుకుంటున్నది. దానికిగాను తమ సైనికులపై దాడులు జరిగినట్లు కట్టుకథలను ప్రచారంలో పెట్టింది. అక్టోబరు 19,20 తేదీలలో ఎమెన్ నుంచి తమ మీద, ఇజ్రాయెల్‌పై ప్రయోగించిన డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులను కూల్చివేసినట్లు ప్రకటిం చింది. అదంతా రాత్రి సమయంలో సముద్ర జలాల మీద జరిగింది గనుక ఎలాంటి ఆనవాళ్లు ఉండవని అధి కారులు చెప్పారు. నిజానికి ఎమెన్‌లో ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ సాయుధుల రాడార్ కేంద్రాలపై అమెరికా నౌకా దళమే ఎర్ర సముద్రం నుంచి క్షిపణులతో దాడి చేసి రెచ్చగొట్టిందని వార్తలు.ఎమెన్ రాజధాని సనా నగరంతో సహా ఉత్తర ప్రాంతం హౌతీల ఆధీనంలో ఉంది. వారి మీద పోరాడుతున్న ఎమెన్ ప్రభుత్వానికి 2015 నుంచి సౌదీ అరేబియా మద్దతు ఇస్తున్నది. ఇటీవల చైనా మధ్యవర్తిత్వంలో ఇరాన్-సౌదీ మధ్య సయోధ్య కుదిరిన నేపధ్యంలో గతంలో మాదిరి హౌతీ దళాలు సౌదీపై క్షిపణులు ప్రయోగించే అవకాశం లేదు. అందువలన అసలు నిజంగా ప్రయోగించారా లేక ఆ పేరుతో అమెరికా నాటకం ఆడుతోందా అన్న అనుమానాలు తలెత్తాయి. అమెరికా గనుక గాజాపై దాడికి జోక్యం చేసుకుంటే తాము దాడులకు దిగుతామని, గీత దాటవద్దని హౌతీ దళాల నేత అబ్దుల్ మాలిక్ అల్ హౌతీ హెచ్చరించాడు.

ఇప్పటికే మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఉన్న పేట్రియాట్ గగనతల క్షిపణి బెటాలియన్‌కు తోడు థాడ్ రక్షణ వ్యవస్థను కూడా పంపనున్నట్లు అమెరికా వెల్లడించింది. ఇప్పటికే రెండు విమానవాహక యుద్ధ నౌకలు, వాటికి అనుబంధ నౌకలతో పాటు రెండువేల మంది మెరైన్లను మోహరించింది. శనివారం నాడు కైరోలో జరిగిన శాంతి సమావేశం ఎలాంటి ఫలితం లేకుండానే ముగిసింది. ఇజ్రాయెల్ హాజరు కాలేదు. కైరోలోని ఒక జూనియర్ అధికారిని అమెరికా పంపింది, అతగాడు నోరు విప్పలేదు. అరబ్ నేతలు గాజాపై దాడులను ఖండించారు. ఐరోపా దేశాల నుంచి వచ్చిన వారు దాడుల నుంచి పౌరులను మినహాయించాలని సూచించారు. హిజబుల్లా మీద దాడులకు పూనుకోవద్దని జో బైడెన్, ఇతర నేతలు ఇజ్రాయెల్‌కు సూచిస్తున్నారని, అదే జరిగితే తాము కూడా యుద్ధంలో ప్రవేశించాల్సి ఉంటుదని కొన్ని అరబ్బు దేశాలు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. పూర్తి స్థాయి యుద్ధమే వస్తే ఇజ్రాయెల్ తన దక్షిణ, ఉత్తర భాగంలో దాడులను ఎదుర్కోవాల్సి వస్తుంది, అప్పుడు అమెరికా-ఇరాన్ కూడా పాల్గొనే అవకాశం ఉంది. అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మధ్యధరా సముద్రంలో అమెరికా మిలిటరీ కేంద్రీకరణ నేపధ్యంలో చైనా ఆరు యుద్ధ నౌకలను ఆ ప్రాంతానికి తరలించినట్లు వార్తలు వచ్చాయి.



> మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఉన్న పేట్రియాట్ గగనతల క్షిపణి బెటాలియన్‌కు తోడు థాడ్ రక్షణ వ్యవస్థను కూడా పంపనున్నట్లు అమెరికా వెల్లడించింది. ఇప్పటికే రెండు విమానవాహక యుద్ధ నౌకలు, వాటికి అనుబంధ నౌకలతో పాటు రెండువేల మంది మెరై న్లను మోహరించింది. శనివారం నాడు కైరోలో జరిగిన శాంతి సమావేశం ఎలాంటి ఫలితం లేకుండానే ముగిసింది. ఇజ్రాయెల్ హాజరు కాలేదు. కైరోలోని ఒక జూని యర్ అధికారిని అమెరికా పంపింది, అతగాడు నోరు విప్పలేదు.

అయితే వీటి గురించి చైనా రక్షణ శాఖ ఒక ప్రకటన చేస్తూ మే నెల నుంచి తమ నౌకలు ఆ ప్రాంతంలో ఉన్నాయని, గత వారంలో ఓమన్ నౌకాదళంతో కలసి సంయుక్త విన్యాసాలు సాగించినట్లు పేర్కొన్నది. అవి పూర్తైన తరువాత అక్టోబరు 18వ తేదీన కువైట్ రేవు షావయాఖ్‌కు తమ నావల్ ఎస్కార్ట్ దళాలు వచ్చినట్లు తెలిపింది. వాటిలో నిర్ణీత లక్ష్యాలను ఛేదించే క్షిపణి నౌక, ఫ్రిగేట్, ఇతర నౌకలు ఉన్నాయి. చైనా-కువైట్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదిరి ఐదు సంవత్సరాలు అవుతున్నది. పది సంవత్సరాలుగా బిఆర్ఐ పథకం కింద పెట్టుబడులు పెట్టింది. చైనా నౌకలు ఎందుకు వచ్చినప్పటికీ ఈ ప్రాంతంలో రాజకీయంగా వాటి ప్రభావం ఉంటుంది. అమెరికా మిలిటరీ శక్తిని చూసి ఆందోళన చెందుతున్న శక్తులకు భరోసా దొరికినట్లు అవుతుంది.

ప్రస్తుతం ఇజ్రాయెల్ పరిమితంగా జరుపుతున్న దాడులు, ఒకవేళ వాటి తీవ్రతను పెంచితే రాగల పరిణామాలు, పర్యవసానాల గురించి అమెరికా మదింపు వేస్తోంది. ఇరాన్ అందచేసిన డ్రోన్లు, ఇతర ఆయుధాలతో హమస్ కంటే పెద్దశక్తిగా ఉన్న హిజబుల్లా గనుక పోరుకు దిగితే తీవ్ర పరిస్థితి ఏర్పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. హమస్ దగ్గర పరిమితమైన ఆయుధాలు మాత్రమే ఉన్నాయి, శిక్షణ పొందిన హిజ్‌బుల్లా దగ్గర స్వల్ప శ్రేణి ఖండాంతర క్షిపణులు, డ్రోన్లు, మానవరహిత ప్రయోగ వ్యవస్థలు ఉన్నాయి. వాటిని రంగంలోకి దింపితే పోరు తీరే మారిపోతుంది. ప్రస్తుతం అది యుద్ధాన్ని కోరుకోవటం లేదని, అమెరికా, ఇజ్రాయెల్ గనుక వారిని ఆవైపుకు నెడితే రంగంలోకి దిగుతుందని పరిశీలకులు అంటున్నారు. బహుశా దానిలో భాగంగానే లెబనాన్ సరిహద్దులో ఉన్న హిజబుల్లా సాయుధులపై ఇజ్రాయెల్ దాడులు చేసి కవ్విస్తున్నది.2019లో అమెరికా మిలిటరీ గూఢచారుల సమాచారం మేరకు హిజబుల్లా వద్ద లక్షా 50వేల రాకెట్లు, ఇజ్రాయెలీ సంస్థ ఒకటి గతేడాది చెప్పినదాని ప్రకారం రెండువేల మానవరహిత ఆయుధ ప్రయోగ వాహనాలు ఉన్నాయి. వెయ్యి కిలోమీటర్ల దూరం వరకు వెళ్లే ఆయుబ్, షాహెద్ వంటి క్షిపణులు కూడా ఉన్నాయి. ఇజ్రాయెల్ వద్ద అధునాతన వైమానిక దళం ఉన్నప్పటికీ హిజబుల్లా వంటి సంస్థల వద్ద ఉన్న నిఘా, ఇతర పరికరాలతో గురిచూసి విమానాలను కూల్చివేసే అవకాశం ఉంది. ఐరన్ డ్రోమ్, ఐరన్ బీమ్ వంటి రక్షణ వ్యవస్థల గురించి ఇజ్రాయెల్ ఎప్పటి నుంచో చెబుతున్నప్పటికీ అవి ఎంతవరకు దాడులను నివారించగలవో ఇంతవరకు రుజువు కాలేదు. గడచిన ఏడు దశాబ్దాలుగా పాలస్తీనా యోధులను అణచేందుకు ఇజ్రాయెల్ చేయని ప్రయోగం లేదు. కానీ ఎప్పటికప్పుడు కొత్త శక్తులు, గెరిల్లా పద్ధతుల్లో దాడులతో తెగబడుతూనే ఉన్నాయి. ఇప్పుడు హమస్‌ను అణచివేయటం కూడా జరిగేది కాదని చెబుతున్నారు. ఇజ్రాయెల్ తాను చేయదలచుకున్న విధ్వంసాన్ని నెల రోజుల్లోపల పూర్తి చేయాలని తరువాత అమెరికా అనుమతించే అవకాశం ఉండదని, భూతల దాడికి దిగితే ఇజ్రాయెల్ కూడా భారీసంఖ్యలో సైనికులను కోల్పోతుందని, దాంతో పౌరుల్లో సహనం కూడా నశిస్తుందని ఒక నిపుణుడు చెప్పాడు. 2006లో జరిగిన రెండవ లెబనాన్ పోరులో హిజబుల్లా పెద్ద సంఖ్యలో ఇజ్రాయెల్ సైనికులను హతమార్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అది సామర్థ్యాన్ని మరింతగా పెంచుకుంది. ప్రస్తుతం లక్ష మంది యోధులున్నట్లు అంచనా. ఇజ్రాయెల్ పరిసరాలన్నీ నివురు గప్పిన నిప్పులా ఉన్నాయి. ప్రపంచ శాంతి శక్తులు కోరుతున్నట్లు యూదు దురహంకారులు వెనక్కు తగ్గుతారా అమెరికా, ఐరోపా ధనిక దేశాల అండ చూసుకొని మరింతగా మారణకాండకు పాల్పడతారా అన్నది చెప్పలేము. ■

కేంద్ర విధానాలతో పౌల్ట్రీ రైతుల దివాలా



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

ప్రపంచ పౌల్ట్రీ ఉత్పత్తిలో భారతదేశం 5వ స్థానంలో ఉంది. గుడ్ల ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉంది. ఏటా పౌల్ట్రీ వ్యాపారం 1,90,500 కోట్ల వ్యాపారం సాగిస్తున్నాం. 2028 నాటికి 3,47,700 కోట్ల వ్యాపారానికి చేరుకుంటుందని ప్రణాళిక రూపొందించారు. 2023-28 సంవత్సరాలకు ప్రణాళిక రూపొం దిస్తూ 10,18 శాతం గ్రోత్‌రేటు పెరుగుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం దేశంలో తమిళనాడు మొదటి స్థానంలో ఉండ గా, వరుసగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. 13 రాష్ట్రాలలో పౌల్ట్రీ ఉత్పత్తులు కొనసాగుతున్నాయి. 2023 సంవత్సరానికి 6,66,753.46 మెట్రిక్ టన్నుల పౌల్ట్రీ మాంసాన్ని ఎగుమతి చేయడం జరిగింది. దీని విలువ 1,081.62 కోట్లుగా ఉంది. ఓమన్, ఇండోనేషియా, మాల్‌దీవులు, యూనైటెడ్ అరబ్ ఎమి రేట్స్, జపాన్ దేశాలకు ఎగుమతులు సాగిస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక గుడ్ల ఉత్పత్తి పెంపుదల జరుగుతున్నది. బ్రాయిలర్ (38.7శాతం), లేయర్ (29.4శాతం), బ్యాక్‌యార్డ్ (29.8శాతం) మరియు ఇతర కోళ్ళ ఉత్పత్తి (1.43 శాతం) ఉత్పత్తి జరుగుతున్నది. గుడ్ల ఉత్పత్తి 136.60 బిలియన్లుగా ఉంది. 6.19 శాతం ఏటా గ్రోత్‌రేటు పెరుగుతుంది. దేశంలో తలసరి వాడకం సంవత్సరానికి 95 గుడ్లు వాడుతున్నారు. జాతీయ పౌష్టిక ఆహార రికమండేషన్ ప్రకారం 180 గుడ్లు వినియోగించాలి. కానీ ఆర్థిక వనరులు లేకపోవడం వల్ల పేద కుటుంబాలు వాడడం లేదు. లేయర్ జాతికి చెందిన కోళ్ళు (గుడ్ల కొరకు మాత్రమే) 550 బిలియన్‌ల వరకు ఉన్నాయి. 5.5 లక్షల మంది ఈ పరిశ్రమలో పని చేస్తున్నారు. మొత్తంగానూ, ప్రాసెసింగ్ యూనిట్లతో కలిపి 3 కోట్ల మంది కోళ్ళ పెంపకంలో జీవనం సాగిస్తున్నారు. ఏటా కోళ్ళ మాంసం 4.2 మిలియన్ టన్నులు ఉత్పత్తి అవుతున్నది. మొత్తం పౌల్ట్రీ జనాభ 1,291 మిలియన్‌లు ఉన్నాయి. ఎగుమతులు 28.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

బడా కంపెనీల నుండి దిగుమతులు

దేశంలో ఉత్పత్తి బాగా పెరిగి ఎగుమతులు చేస్తున్నప్పటికీ ధనిక దేశాలు మన ఉత్పత్తులను తగ్గించడానికి, రైతులను నష్టపర్చడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మన ఎగుమతులకు ఆటంకం కల్పించడానికి "బర్డ్‌ఫ్లూ", పౌల్ కలరా, తదితర పేర్లతో నిషేధాలు పెడుతున్నారు. ఏటా 240 టన్నుల దిగుమతులు చేస్తున్నారు. ముఖ్యంగా "కెంటకి ఫ్రైడ్ చికెన్"తో పాటు (కెఎఫ్‌సి), మరికొన్ని సంస్థలు కోడి కళ్ళను దిగుమతులు చేసుకుంటున్నారు. ప్రపంచంలో కార్గిల్, మిన్నేసోటా, టైసాన్‌ఫుడ్స్, జెబిఎస్, మాల్‌బ్రింగ్ లాంటి సంస్థలు మన దేశ ఎగుమతులకు ఆటంకాలు కల్పిస్తున్నాయి. దేశంలో మరో 14 భారీ సంస్థలు పౌల్ట్రీ వ్యాపారాలు చేస్తున్నాయి. వారు పౌల్ట్రీ పెంచే వ్యవస్థలకు "చిక్స్" (పిల్లలు), దాణా, మందులు సరఫరా చేస్తున్నారు. 1-2 కిలోలు కోడి పెరిగిన తరువాత కిలోకు 8-10 రూపాయల వరకు చెల్లించి బ్రాయిలర్ కొనుగోలు చేస్తున్నారు. వెంకీస్ ఇండియా లిమిటేడ్, సుగుణ ఫుడ్స్ లాంటి సంస్థలు వేల కోట్ల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. మొదట పేద రైతులు 500 కోళ్ళ నుండి 2000 కోళ్ళ వరకు పెంపుదల చేసి జీవనాదాయం పొందారు. కార్పొరేట్ సంస్థలు ప్రవేశించాక పేద రైతులు ఈ రంగం నుండి నెట్టివేయబడ్డారు. వేలకోళ్ల పెంచడంతోపాటు భారీ షెడ్‌లు వేసి 15-20 లక్షల పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితికి పౌల్ట్రీ రంగం పెరిగింది. ఇంత భారీ పెట్టుబడి పేదలు పెట్టలేరు. ఒకవైపున దేశంలో ఉన్న పరిశ్రమను భారీ సంస్థలు, కార్పొరేట్లు ఆక్రమించడమేగాక, విదేశీ ఎగుమతులకు ఆటంకంగా అనేక జబ్బులను ప్రచారం చేసి నష్టం కలిగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ధనిక దేశాల కుట్రలనుగానీ, కార్పొరేట్ సంస్థల ఆక్రమ చొరబాటుని గానీ నిరోధించలేకపోతున్నది. అందువల్ల ఇప్పటికే ఈ రంగం నుండి చాలామంది దివాళ తీసి ఇతర రంగాలకు వెళ్ళిపోతున్నారు. అయినప్పటికీ కోళ్ళ ఉత్పత్తిలో 5వ స్థానంలోనూ, గుడ్ల ఉత్పత్తిలో 3వ స్థానంలో కొనసాగుతున్నది. స్థానిక వినియోగాన్ని పెంచడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పౌష్టికాహార లోపాన్ని సరిదిద్దడానికి గుడ్లు మంచి ఆహారం. పాఠశాలలు, దవఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు, చౌక డిపోల ద్వారా పేదలకు అందే విధంగా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కొనసాగుతుంది. గతంలో గుడ్డు ధర రూ.2లు ఉండగా నేడు రూ.6-7లకు పెరగడంతో పేదల కొనుగోలు తగ్గింది.



మాంసం ఎగుమతులలో మరిన్ని ఆటంకాలు

దేశం నుండి పశుమాంసం (బర్రెలు) రూ.25,648 కోట్లు, గొర్రెల మాంసం రూ.537 కోట్లు ఇతరంగా రూ.6,412 కోట్లు మొత్తంగానూ రూ.32,597 కోట్లు ఎగుమతులు చేస్తున్నాం. హాంకాంగ్, వియత్నం, మలేషియా, ఈజిప్టు, ఇండోనేషియా, ఇరాన్ సౌధి ఆరేబియా, ఫిలిఫ్ఫీన్స్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ దేశాలకు ముఖ్యంగా ఎగుమతులు జరుగుతున్నాయి. వీటికితోడు చేపల ఎగుమతి 17,35,286 మెట్రిక్ టన్నులు రూ.65 వేల కోట్లు కూడ ఎగుమతులు చేస్తున్నాం. ఇందులో 7.11 లక్షల కోట్ల విలువగల రొయ్యలు ఎగుమతులు చేస్తున్నాం. ఈ ఎగుమతులను ఆటంక పర్చడానికి మ్యాడ్‌కౌ, మౌత్ డిసిస్, బ్లూటంగ్, ఇన్‌ఫ్లూఎంజా తదితర జబ్బులు సోకిన మాంసాన్ని ఎగుమతి చేస్తున్నారని దుష్ప్రచారం చేసి అంతర్జాతీయంగా ఎగుమతులకు ఆటంకం కల్పిస్తున్నారు. దేశంలో మాంసం ఉత్పత్తి 92.9 లక్షల టన్నులుగా ఉంది. ఏటా 5.62 శాతం గ్రోత్‌రేటు కొనసాగుతున్నది. దేశంలో వినియోగం 40 లక్షల టన్నులు ఉంది. మిగిలినది ఎగుమతులు చేస్తున్నాం. ప్రపంచంలో 6వ స్థానంలో మాంసం ఉత్పత్తి కొనసాగుతున్నది. దేశంలో తలసరి వాడకం సంవత్సరానికి 6.82 కిలోలుగా ఉంది. మహారాష్ట్ర-12.25 శాతం, ఉత్తర ప్రదేశ్-12.14 శాతం, పశ్చిమ బెంగాల్-11.63 శాతం, ఆంధ్రప్రదేశ్-11.04 శాతం, తెలంగాణ-10.82 శాతం ఉత్పత్తి జరుగుతున్నది. పై పరిశ్రమలతో పాల ఉత్పత్తి 22.10 కోట్ల టన్నులతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నాం. అయినా పాల ఉప ఉత్పత్తుల దిగుమతులు కొనసాగుతూనే ఉన్నాయి. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రధాన ఉత్పత్తి కొనసాగుతున్నది. పాల తలసరి వినియోగం రోజుకు 444 గ్రాములుగా ఉంది.

పై మాంసాహార ఉత్పత్తులు పెంచడానికి, స్థానిక వినియోగ రేటును పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రణాళికలు రూపొందించడం లేదు. జరిగిన ఉత్పత్తినే అంచనా వేసి గణాంకాలు ప్రకటిస్తున్నారు. కోళ్ళు, మాంసం, చేపలు, పాలు తదితర ఉత్పత్తులలో ఇప్పటికి ఉన్న అగ్రస్థానాన్ని మరింత పెంచడంతోపాటు దేశీయ వినియోగం పెంచడం ద్వారా ఈ ఉత్పత్తులు చేసే రైతులకు లాభం కలిగించడంతోపాటు విదేశీ మారకద్రవ్యం కూడా దేశానికి సమకూరుతుంది. కానీ, అంతర్జాతీయ పోటీని తట్టుకోవడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలి. బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రణాళికలు రూపొందించాలి. వీటి ఉత్పత్తులు పెంచడానికి దేశంలో సరిపడినన్ని మౌలిక వసతులు ఉన్నాయి. కేంద్ర బిజెపి ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని పై ఉత్పత్తులను పదే పదే ప్రకటించింది. కానీ, కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలో ఇందుకు తగిన కేటాయింపులు లేవు. 2022 నాటికే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని 2018లో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం గడువు తీరినప్పటికీ ఆ వైపు ప్రణాళికలు రూపొందించలేదు. గ్రామీణ ప్రాంతంలో దాదాపు 20 శాతం ప్రజలు ఈ వృత్తులపై ఆధారపడి ఉన్నారు. వీటిని ప్రణాళిక బద్ధంగా పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెంపుదల చేయడమేగాక, పౌష్టికాహార కొరత కూడా తీరుతుంది. ఇందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలి. ■



తుమ్మల, పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ కోట రాంబాబు

నవతెలంగాణ-మధిర

ఖమ్మంలోని మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మధిర ఎన్నిక ల ప్రచారం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మర్లపాడు పీఏసీఎస్ చైర్మెన్ కటికల సీతరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జక్కా నాగభూషణం సంస్మరణ సభ

పాల్గొననున్న కూనంనేని, పోతినేని

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు జక్కా నాగభూషణం సమస్మరణ సభ బుధవారం ముష్టికుంట గ్రామంలో నిర్వహించనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, గ్రామశాఖ కార్యదర్శి అక్కిన పవన్ మంగళవారం విలేకరులు తెలిపారు. జక్కా నాగభూషణం ఈనెల 15వ తేదీన గుండెపోట మరణించారు. ఈ సంస్మరణ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, సీఎల్పీ నేత మల్లు బట్టి విక్రమార్క, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు, గీత పని వారుల సంఘం రాష్ట్ర కోశాధికారి బొమ్మగాని నాగభూషణంతో పాటు పలువురు సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, వైఎస్ఆర్ టీపీ పార్టీలకు చెందిన జిల్లా, మండల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పలు కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-మధిర

మధిర మండలం దెందుకూరు గ్రామంలో పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల మరణించారు. సోమవారం దశధిన కర్మలో ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణిమల్లు నందిని పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సాయం అందించారు. అనంతరం అదే గ్రామంలో దోర్నాల బాబ దశధిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, గ్రామ సర్పంచ్ కోట విజయశాంతి, దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకష్ణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవి కుమార్, చెరుకూరి నాగార్జున, హనుమంత్ మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లు మురళికి నివాళులు

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డులో అనారోగ్యంతో మరణించారు. మంగళవారం ఆయన మృతదేహానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్మెన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల కమల్‌రాజు ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించి నేరుగా ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజయదశమి వేడుకల్లో పాల్గొన్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని తాళ్లూర్ వెంకటపురం గ్రామంలో దసరా పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ కమిటీ ఆధ్వర్యంలోని యువతీ యువకులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ ఘనపరిచిన యువతీ యువకులకు జెడ్పీటీసీ కట్టా జయకుమార్ బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా చిన్న కోరుకొండి, తెలగారం, మర్లపాడు, పోచారం, గ్రామాల్లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని దసరా పండుగ విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీలు ఉప్పు సుబ్బారావు, మర్సకట్ల మేరమ్మ, సర్పంచులు మోదుగు సుబ్బారావు, సంద్రు అన్నపూర్ణ, సీతామాలక్ష్మి మోదుగు యశోద వీరయ్య, నామ రాధమ్మ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల్లో విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నిరసన

నవతెలంగాణ-కల్లూరు

పట్నంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం కాంగ్రెస్ సత్తుపల్లి నాయకుల ఆధ్వర్యంలో మట్టా రాగమయి రాముల వారి గుడిలో రాకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నాయకురాలు రాగమయిను రాముల వారి గుడిలోకి వెళ్ళనీయకుండా బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పాలెపు రామారావు తన అనుచరులతో కలిసి అడ్డుకున్నారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం నిరసన తెలిపారు. చెన్నూరు గ్రామం లో సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి దళిత మహిళను గుడిలోకి రాకుండా అవమానపరిచిన వారు చేసిన అవమాన సంఘటన పై నిరసన తెలుపారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రభుత్వానికి, త్వరలోప్రజలు బుద్ధి చెబుతారని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మట్టా దయానంద్ విజయకుమార్, ఏనుగు సత్యంబాబు, భూక్య శివకుమార్, మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.5.5 లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-వేంసూరు

మండల పరిధిలోని వెంకటాపురం చెక్ పోస్ట్ వద్ద సోమవారం ఎస్సై వీరప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కారులో వస్తున్న నలుగురు వ్యక్తుల నుండి రూ.5.5 లక్షల నగదు ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

పామాయిల్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-వేంసూరు

మండల పరిధిలోని మర్లపాడు నందు పామాయిల్ గెలల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ అధికారి ఆకుల బాలకష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు కష్టాలు తీరాయని, అవకాశాన్ని పామాయిల్ రైతులు వినియోగించుకోవాలలన్నారు. ప్రతి సోమవారం రైతుల నుండి నేరుగా గెలలు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. అశ్వరావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ వరకు రవాణా చేయుటం రైతులకు ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని ఈ సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. అనంతరం పామాయిల్ ఫ్యాక్టరీ అధికారులు రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ జీ. కళ్యాణ్, జిల్లా మేనేజర్ భారతి ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావు, నవ్య నాగలక్ష్మి, రైతులు బండి గురవారెడ్డి, పూర్ణ చంద్రరెడ్డి, సొసైటీ అధ్యక్షులు కూరపాటి నాని, సోమిరెడ్డి నరోత్తమరెడ్డి, మందపాటి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కందాళ

నవతెలంగాణ-కూసుమంచి



ఈనెల 27న పాలేరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో నిర్వహించనున్నారు. మంగళవారం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించే సభ ప్రాంగణాన్ని, నిర్వహించే ఏర్పాట్లను పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాళ స్థానిక నాయకులతో కలిసి సభ జరుగు స్థలాన్ని, పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి, ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బెల్లం వేణు, ఆఫీస్ పాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో అరాచక పాలన

- తెలంగాణ, ఏపీ రాజకీయాలపై మాజీ మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు
- ఇలాంటి అవినీతి, నిర్బంధ పాలనను చూడలేదని విమర్శ
- బెదిరించి, అదిరించి ఎక్కువ కాలం రాజకీయాలు చేయలేరని వ్యాఖ్య

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో దారుణమైన రాజకీయాలు నడుస్తున్నాయని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అరాచక పాలన కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి అవినీతి, నిర్బంధ పాలన తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ప్రతీకారాలకు పాల్పడలేదని చెప్పారు. ప్రతిపక్షాలను, ప్రజలను బెదిరించి, అదిరించి ఎల్లకాలం రాజకీయాలు చేయలేరని అన్నారు. ఖమ్మం 14వ డివిజన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో తుమ్మల మాట్లాడారు. తెలంగాణలో సుస్థిరమైన పాలన కావాలంటే కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని కోరారు. రాజకీయాల్లో నీతి ,నిజాయితీ అవసరమన్నారు. అది కొరవడటం దురదష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రజలకు మాట ఇస్తే తలతెగిపడినా ఇచ్చిన మాట నెరవేర్చాలన్నారు. అదిలిపోవడం పైగా తమ విధానాలు సమర్ధించుకోవడం పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతుందని అన్నారు . ఖమ్మం అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేయబోతున్న తుమ్మల నియోజకవర్గంలో విస్తత పర్యటనలు చేస్తున్నారు .ఇప్పటికే పలువురు అధికార బీఆర్ యస్ నుంచి తుమ్మల ఆధ్వరంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.. అటు అధికార పార్టీ అభ్యర్థి మంత్రి పువ్వాడ అజయ్ తుమ్మల మధ్య ఖమ్మం పోరుపై ప్రజల్లో ఆసక్తి నెలకొన్నది. అంతకు ముందు తుమ్మల సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కూడా చేరికలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో తుమ్మలతో పాటు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.ఫోటోరైటప్.చిరుమర్రిలో దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా అన్నదానమును ప్రారంభించిన సిపిఎం జిల్లా నాయకులు బండి రమేష్.

చిరుమర్రిలో మహా అన్నదానం

నవతెలంగాణ ముదిగొండ.దేవీ నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలపరిధిలో చిరుమర్రి గ్రామంలో ప్రధాన సెంటర్లో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ మండపం వద్ద నిర్వాహకులు మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన మహా అన్నదానాన్ని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బండి రమేష్ లాంఛనీయంగా ప్రారంభించారు.ఈకార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బండి పద్మరైతు సంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్,చిరుమర్రి ఎంపిటిసి సభ్యురాలు కోలేటి అరుణ,దేవి నవరాత్రుల ఉత్సవాల కమిటీ సభ్యులు గండు ఉపేందర్,సోమగాని రాము,గోపి,గండు పుల్లమ్మ కిట్టమ్మ,మండేపూడి రమేష్,వీరేష్,సురేష్,బండి శేఖర్,పల్లపాటి అప్పారావు, చిట్టిబాబు, గండు యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పేరబత్తిని నాగేశ్వరరావు మృతి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోనే పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పేరబత్తిని నాగేశ్వరరావు (62) అనారోగ్య సమస్యలతో మంగళవారం మతి చెందారు. మతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నాగేశ్వరరావు పెద్ద బీరవల్లి గ్రామానికి ఒకసారి సర్పంచిగా పనిచేశాడు. నాగేశ్వరరావు సర్పంచ్‌గా ఉన్న సమయంలో పెద్ద బీరవల్లి గ్రామ అభివద్ధికి విశేషంగా కషి చేశారు. గ్రామంలో పార్టీ అభివద్ధికి నిరంతరం శ్రమించారు. సీపీఐ(ఎం) కార్యక్రమాలలో చురుకైన పాత్ర నిర్వహించారు. సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించి ప్రజా హదయాలలో స్థానం సంపాదించారు. గ్రామంలో అనేక సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర నిర్వహించాడు. సీపీఐ(ఎం) పట్ల ఎంతో విదేయతగా, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పెద్దపోలు కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎనమద్ది సత్యనారాయణ, పెద్ద బీరవల్లి సర్పంచ్ ఆళ్ల పుల్లమ్మ, పెద్ద బీరవల్లి ఎంపీటీసీ కర్లకుంట దేవమణి, సీపీఐ(ఎం) గ్రామశాఖ కార్యదర్శి చల్లగుండ రామ నరసయ్య, మాజీ సొసైటీ అధ్యక్షులు ఆళ్ల ప్రసాదు, మాజీ ఎంపీటీసీ కర్లకుంట ముత్తయ్య, సీపీఐ(ఎం) నాయకులు ఆళ్ల హనుమంతరావు, చట్టు వీరబాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు
- మధిరలో లారీ డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మధిర







ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ లారీ డ్రైవర్లగా పనిచేస్తున్న డ్రైవర్ల కుటుంబాలకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డును అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు అన్నారు. మంగళవారం మధిర మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నిత్యవసర వస్తువులు సప్లై చేస్తున్న లారీ డ్రైవర్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి అగమ ఘోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రయివేట్ ట్రాన్స్‌ఫోర్ట్‌లో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కుటుంబాలకు 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, వారి పిల్లలకు విద్యా వైద్యం ప్రభుత్వం అందించాలని, జాతీయ రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ బిల్లు కార్మికుల ప్రయోజనాలు కాకుండా యాజమాన్యాలకు ప్రయోజనంగా ఉన్నాయని, యూనియన్ పెట్టుకుంటే 15 రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేయాలని, యూనియన్ రిజిస్ట్రేషన్ ఫీజు కూడా ప్రభుత్వం తగ్గి డిమాండ్ చేశారు. అనంతరం ప్రైవేటు ట్రాన్స్‌ఫోర్ట్ లారీ డ్రైవర్లగా ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలోమధిర ప్రధాన కార్యదర్శిగా వాడపల్లి నాగరాజు, అధ్యక్షుడిగా రామాల జయరాజు, ఉపాధ్యక్షులుగా లక్క మాల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బట్ట కష్ణ, షేక్ సయ్యద్ పాషా సహాయ కార్యదర్శిగా మీనుగు కృష్ణ, దండపాటి విష్ణు, చిర్రా భూపతి, కోశాధికారిగా మువ్వా రామ కోటేశ్వరరావు, సీఐటీయూ మధిర మండల కన్వీనర్ మధు తదితరులు లారీ కార్మికులు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపుకు ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



రానున్న అసెంబ్లీ సాధారణ ఎన్నికల దష్యా జిల్లాలోని ఐదు నియోజక వర్గాలకు కేటాయించిన ఈవీఎంల తరలింపుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ అన్నారు. మంగళవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ నుండి ఐదు నియోజక వర్గాల కోసం ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలకు ఈవీఎం, సీయూ, వీవీపాట్‌ల తరలింపు కోసం పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి వీపీ. గౌతమ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20న నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్ లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోగా, మంగళవారం ఉదయం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ తెరిచి ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేసుకొని, నియోజకవర్గాల వారిగా ఖమ్మం నియోజక వర్గంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, పాలేరు నియోజకవర్గంలోని కిట్స్ కళాశాల, మధిర నియోజకవర్గంలోని మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వైరా నియోజకవర్గంలోని వైరా సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, సత్తుపల్లి నియోజక వర్గంలోని స్థానిక జ్యోతి నిలయం హైస్కూల్‌లలో ఏర్పాటు చేసుకున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపరచడం జరుగుతుందని, ఆ తరువాత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అబ్జర్వర్ పర్యవేక్షణలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీ. సత్యప్రసాద్, డీ. మధుసూదన్ నాయక్, మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, అదనపు డీసీపీ ప్రసాద్ రావు, జెడ్పి సీఈఓ వీవీ. అప్పారావు, డీటీవో సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి టీ. కిషన్‌రావు, ఆర్డీవోలు జీ. గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసి రాజేశ్వరి, ఖమ్మం పట్టణ ఏసీపీ హరికష్ణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, సిపిఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి తిరుమలరావు, బీజేపీ పార్టీ ప్రతినిధి జిఎస్ఆర్‌పి. విద్యాసాగర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బాలగంగాధర తిలక్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి జి. కష్ణ, టిడిపి పార్టీ ప్రతినిధి కె. కరుణాకర్, బీఎస్పీ ప్రతినిధి ఉపేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మేనిఫెస్టోపై అద్భుత స్పందన

- మా లక్ష్యం 'లక్ష' కుటుంబాలను కలవాలని..
- కాంగ్రెస్ హామీలను ప్రజలు విశ్వసించడం లేదు
- బీఆర్ఎస్ సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై ప్రజల్లో అద్భుతమైన స్పందన కనపడుతోందని, తెలంగాణ వచ్చాకే అభివృద్ధి జరుగుతోందని, ప్రజలకు ఏం కావాలో ఎరిగిన కేసీఆర్ వాటిని అమలు చేసుకుంటూ పోతున్నారని బీఆర్ఎస్ సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర సంకటవీరయ్య అన్నారు. ఇంటింటికి బీఆర్ఎస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే సండ్ర సత్తుపల్లి మండలం రామానగరం నుంచి ప్రారంభించారు. గులాబీ శ్రేణులను వెంటేసుకొని ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో ప్రతులను పంచుతూ వాటిని వివరించారు. కర్నాటక పరిస్థితి తెలిశాక కాంగ్రెస్ మేనిఫెస్టోను తెలంగాణ ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

లక్ష కుటుంబాలను కలవాలని మా లక్ష్యం

సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష కుటుంబాలను ఈ మూడ్రోజుల్లో కలవాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సండ్ర చెప్పారు. ఇంటింటికి మేనిఫెస్టోను అందిస్తూ అందులో ఉన్న అంశాలను ప్రజలకు వివరిస్తున్నట్టు తెలిపారు. దీంతో పాటు నవంబరు 1న కల్లూరులో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభకు ఆయా కుటుంబాలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఎంపీపీ దొడ్డా హైమవతిశంకరరావు, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, సర్పంచ్ వేల్పుల కళావతి, ఉప సర్పంచ్ మోటపోతుల పుష్ప, ఎంపీటీసీ సభ్యుడు నాగచంద్రమోహన్, గ్రామశాఖ బాధ్యులు మోటపోతుల నాగేశ్వరరావు, మోటపోతుల వెంకటేశ్వరరావు, కామా శ్యాంసన్, బుద్దా రవి, సాలి విజయకుమార్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ(ఎం) మండల స్థాయి సమావేశం

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలో గల వీర తెలంగాణ రైతాంగ సాహిత పోరాట అమరవీరుల భవనంలో సీపీఐ(ఎం) మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించినట్లు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య గెలుపును కాంక్షిస్తూ మంగళవారం కార్యకర్తలు గ్రామ గ్రామాన ప్రచారం మొదలుపెట్టారు. బీఆర్ఎస్ సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటా పంచుతూ సండ్రకు ఓటు వేయాలంటూ ప్రచారం సాగిస్తున్నారు. పెనుబల్లి, అడవి మల్లెల, ,సూర్య బంజర్, కారాయి గూడెం, గౌరారంతో పాటు అన్ని పంచాయతీలలలో ఇంటింటా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య వినీల్, మండల ఉపాధ్యక్షురాలు నరుకుళ్ళ కస్తూరి, దొడ్డపనేని రవి, తాళ్లూరి శేఖర్ రావు, మందడపు అశోక్ కుమార్, జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్రావు, భూక్య ప్రసాద్, తావునాయక్, తేలూరి నాగేశ్వరరావు, చింత నిప్పు సత్యనారాయణ పాల్గొన్నారు.

అంకె కీర్తికి నివాళులు

నవతెలంగాణ-మధిర

మధిర మండల పరిధిలోని ఆత్కూరు గ్రామ పంచాయతీ నందు అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న అంకె జాలమ్మ కోడలు అంకె కీర్తి అనారోగ్యంతో మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఆత్కూరు గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్యా రామకష్ణ ఆమె మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కంభంపాటి చిట్టిబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


విజయదశమి వేడుకలు

నవతెలంగాణ -ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ ప్రాంతంలోని గుట్టల బజార్‌లో వేచి ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దసరా పండుగ పురస్కరించుకుని ఉదయం శ్రీ వాసవీ మాత అమ్మవారు మహిషాసురమర్దిని దేవి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. మహిషాసురవధ , కోరిన కోరికలు సంకల్పసిద్ధికై జమ్మి చెట్టుకు శమీ పూజ అనంతరం అమ్మవారి దర్శనం, అమ్మ వారి "లడ్డు" మహా ప్రసాదం "వేలంపాట", మహిత ప్రచండశక్తి మహిషాసురమర్దనికి మధురతర మంగళహారతులు" సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీ కపిలవాయి అచ్యుత రామారావుచే భాగవత ప్రవచనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారని ఆలయ కమిటి అధ్యక్షులు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవత అనిల్ కుమార్, కోశాధికారి కొత్తమాసు హేమ సుందరరావు, ఉపాధ్యక్షులు గోళ్ళ భాస్కరరావు, బిజ్జల ఈశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేశరశెట్టి పూర చందర్‌రావు, మద్ది వెంకట వీరభద్రరావు, సహాయ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, అనుమోలు రమేష్, యర్రమళ్ళ సుదర్శన్ రావు, దుగ్గి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-బోనకల్



మండల కేంద్రమైన బోనకల్‌కు చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి పత్తిపాటి మదార్ (67) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మతునికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మదార్ చిన్న కుమారుడు పత్తిపాటి వెంకటేష్ కరోనా సమయంలో కరోనాతో మృతి చెందాడు. అయితే కుమారుడు చనిపోయిన కేవలం నెల వ్యవధిలోనే మదార్ భార్య మార్తమ్మ కూడా కరోనాతో మృతి చెందింది. నెల రోజుల వ్యవస్థలోనే భార్య కుమారుడు మృతి చెందటంతో మదార్ తీవ్ర ఆవేదనతో ఉంటున్నాడు. మానసికంగా బాగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి వద్ద ఉండగానే గుండె నొప్పి వస్తుందని పెద్ద కుమారుడు సురేష్‌కు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగానే మార్గమధ్యలో మరణించారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) బోనకల్ శాఖా నాయకులు మచ్చా గురవయ్య, ఏసు పోగు బాబు, పలువురు సహచర రైల్వే ఉద్యోగులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు

ప్రజలను ఆకట్టుకున్న వేషధారణలు

నవతెలంగాణ-తల్లాడ



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలను సోమవారం రాత్రి తల్లాడ లో ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మెన్ రంగారావు ఆధ్వర్యంలో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చిన కళాకారులు, ధరించిన వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారిని తొమ్మిది రకాల వేషధారణలతో భారీ ర్యాలీ ఏర్పాటు చేయడంతో ప్రజలు వీక్షించి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. మేళ తాళాలు డబ్బు వాయిద్యాలు, నడుమ మాస్టర్ ధనకొండ నాగబాబు ఆధ్వర్యంలో నృత్యాలు కోలాటం ప్రజలను, ఉర్రూతలూగించాయి, మండల కో ఆప్షన్ సభ్యులు, షేక్ యూసఫ్, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ దుపాటి, భద్రరాజు వెంకటేశ్వరరావు, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, బొడ్డు రామ లక్ష్మణ్, చల్లా లక్ష్మయ్య మద్దిరామయ్య ,మహిళలు భక్తులు పాల్గొన్నారు.

ఆర్ఓబీ బ్రిడ్జి మధ్య గ్యాప్‌లో ఇరుక్కున్న కారు

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి మధ్య గ్యాప్‌లో మంగళవారం ఒక కారు ఇరుక్కుపోయింది. దాదాపు అర్థగంట పాటు కారు డ్రైవర్ ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మండల కేంద్రంలో గల ఆర్‌ఓబీ బ్రిడ్జి ప్రమాదకరంగా మారిన సంగతి విధితమే. బ్రిడ్జికిమధ్య గల రైలింగ్ వద్ద పెద్ద గుంత పడింది. ఈ గుంత అత్యంత ప్రమాదకరంగా మారిందని ఇటీవల నవ తెలంగాణలో కథనం కూడా ప్రచురితమైంది. ఈ గుంత ప్రమాదకరంగా మారి ప్రతిరోజు ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురైతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా ఓ కారు బ్రిడ్జిపై వెళ్తూ ఆ పెద్ద గుంతలో ముందు రెండు చక్రాలు ఇరుక్కుపోయాయి. దాదాపు అర్థగంట పాటు డ్రైవర్ ప్రయత్నాలు చేశాడు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఎట్టకేలకు అర్ధగంట తర్వాత ఆ కారుని డ్రైవర్ ముందుకు కాకుండా వెనుకకు ప్రయత్నం చేయటంతో కథ సుఖాంతమైంది. దీంతో అనేక వాహనాలు అర్థగంట పాటు బ్రిడ్జిపై నిలిచిపోయాయి. ప్రమాదకరంగా బ్రిడ్జి మారిన ఆర్ అండ్ బి అధికారులు గాని జిల్లా ఉన్నతాధికారులు గాని పట్టించుకునే పరిస్థితి లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమత్తు పనులు చేపట్టాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ

ఖమ్మం

బుధవారం | అక్టోబర్ 25, 2023 | www.navatelangana.com



మహిళలకు బతుకునిచ్చే అమ్మ బతుకమ్మ

- ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మెరుగు రమణ
- ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-వైరాటౌన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో మహిళలకు బ్రతుకు నిచ్చే అమ్మ బతుకమ్మ స్ఫూర్తితో ఆడపిల్లలను పుట్టనిదాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం, బ్రతకనిద్దాం అని బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మెరుగు రమణ మాట్లాడుతూ బతుకమ్మ సాక్షిగా ఆడపిల్లల మీద అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళలపై అఘాయిత్యాలు జరగడానికి పాలక వర్గాల నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. బతుకమ్మ సాక్షిగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను సమాజం ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత, నాయకులు భుక్యా విజయ, మల్లెంపాటి శకుంతల, ఇమ్మడి సుశీల, ఇమ్మడి ప్రియాంక, గుమ్మా వెంకట సాయి లక్ష్మి, చిత్తారు అనూష, దుద్దుకూరు వీరమ్మ, దుద్దుకూరు రాములమ్మ, రాచబంటి విజయ, మల్లెల సావిత్రి, నూతి వరమ్మ, పోతగాని జ్యోతి, దుద్దుకూరు నందిని, దుద్దుకూరు వర్షిత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

నవతెలంగాణ-కొణిజర

బోడేపూడి రాజా ట్రస్ట్ చైర్మెన్ బోడేపూడి రాజా మానవత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని బోడియతండా గ్రామంలో వడ్తియ్యా తావు ధర్మసోత్ గోపాల్ కుటుంబాలకు బియ్యంతోపాటు నిత్యవసర సరుకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రాజా గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు వడ్తియ్యా రంగా, ఉపసర్పంచ్ రాందాస్, హనుమా, లాలు, బాబోత్ వెంకన్న, రమేష్, రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోచవరం సొసైటీ చైర్మెన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని పోచవరం సొసైటీ అధ్యక్షులు నర్వనేని పెద్ద అంజయ్యకు ఇటీవల గుండె ఆపరేషన్ జరగగా సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య మంగళవారం తాళ్లూరు వెంకటాపురం గ్రామంలోని ఆయన నివాస గహంలో పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తాళ్లూరు గ్రామంలో ఇటీవల మతి చెందిన మర్సకట్ల శౌరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మోదుగు సుబ్బారావు, ఎంపీటీసీ మరసకట్ల మేరమ్మ గ్రామస్తులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొన్న భట్టివిక్రమార్క సతీమణి

నవతెలంగాణ-మధిర



మధిర పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత, మధిర శాసన సభ్యులు మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మల్లు నందినివిక్రమార్క, కుమారుడు మల్లు సూర్యవిక్రమాదిత్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నధాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీదేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ శోభకత్ నామ సంవత్సర శ్రీ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నిర్వహించిన పూర్ణహుతి, శమీ పూజలతో ముగిసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కొత్తూరు జగన్ మోహన్‌రావు, ఆలయ పర్యవేక్షకురాలు విజయకుమారి తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 9వ రోజు దసరా సందర్భంగా అమ్మ వారిని శ్రీ మహిషాసుర మర్దని, శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం నందు ఉదయం ప్రాత: కాల పూజలు, సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంత రం శ్రీ మహిషాసుర మర్దని అమ్మ వారికి ప్రత్యేక పూజలు, దసరా వేడుకలు, భక్తులచే మహా చండీ హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవాలు పూర్తయిన సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని యాగ శాలలో అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, మాజీ చైర్మన్ ఉప్పల జయదేవ శర్మ, ఉప ప్రధాన అర్చ కులు ఉప్పల విజయదేవశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ, రాజీవ్ శర్మ,సుదర్శనశాస్త్రి, రఘురామ కృష్ణశాస్త్రి, రమణబాబు, చక్రధర్, వేద పండితులు విజ యకష్ణ, అనంత శయనాచార్యులు, అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఎంపీజే ఆధ్వర్యంలో ఓటరు అవగాహన

ముఖ్య అతిథిగా ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ అజీజ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర శాఖ సూచించిన, ఓటరు అవగాహన కార్యక్రమం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని స్థానిక అజీజ్ గల్లీలో జె.ఐ.హెచ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ అజీజ్ పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికల్లో బాగా ఆలోచించి, యోగ్యులైన అభ్యర్థులకు ఓటు వేయండి అని తెలిపారు. పక్షపాత, ఫాసిస్ట్, మతతత్వ అభ్యర్థులకు ఓటు వేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం అల్ హిందీ, కోశాధికారి అహ్మద్ హమీదుద్దీన్ షకీల్, ఎంపీజే జిల్లా ఉపాధ్యక్షులు ఎండి జహీర్, ఎంఎ గఫార్, కార్యదర్శి బి సతీష్ పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ పూజలు

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ ఆకాంక్షించారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు కమిషనర్ ఆయన సతీమణి హదయ మేనాన్, కుటుంబ సమేతంగా ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందని, విజయం చేకూర్చే విజయదశమి పర్వదినాని పురస్కారించుకొని, జిల్లాలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, పోలీసుల గౌరవం, కీర్తిప్రతిష్టలు పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, ఏసీపీలు గణేష్, హరికష్ణ, భస్వారెడ్డి, ప్రసన్న కుమార్, నర్సయ్య, ఆర్ఐలు, సిఐలు పాల్గొన్నారు.

ప్రారంభం ఘనం.. నిర్వహణ అధ్వానం

- అపహాసం చేస్తున్న ఆట స్థలాలు
- క్రీడలు ఆడని క్రీడా ప్రాంగణాలు
- ఊరికి దూరంగా నిర్మాణాలు,
- కోట్ల రూపాయలు ప్రజా ధనం వృథా

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యం తో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ప్రారంభం ఘనంగానూ నిర్వహణ అధ్వానంగా ముళ్ళ పొదలతో మునిగి పోయి ఆ ట స్థలాలు అపహాసం చేస్తున్నాయని క్రీడా కారులు విమర్శిస్తున్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీలకుగాను 30 గ్రామ పంచాయతీలలో మాత్రమే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. నరసింహాపురం గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్థలం లేక పోవడంతో ఆ గ్రామపంచాయతీ నందు క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయలేదు. క్రీడా ప్రాంగణాలలో కొన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో యువత ఆటలు ఆడటానికి ఆసక్తి చూపటం లేదు. మండల కేంద్రమైన ఎర్రుపాలెంతో పాటు మరో నాలుగు క్రీడా ప్రాంగణాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన క్రీడా ప్రాంగణాలలో క్రీడలు ఆడటం లేదని, ప్రజా ధనాన్ని వృథా చేశారని ప్రభుత్వం విమర్శల పాలవుతుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. రాష్ట్ర జిల్లా స్థాయిలో కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం శూన్యంలా కనిపిస్తుందని ప్రజలు అంటున్నారు. మండలంలో 30 క్రీడా ప్రాంగణాలకుగాను లక్షలరూపాయలు బూడిదలో పోసిన పన్నీరులాగా నేల పాలయయ్యాయని క్రీడలు ఆడని క్రీడా ప్రాంగణాలుగా మిగిలి పోయాయని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్మించిన ప్రాంగణాలు క్షేత్ర స్థాయిలో అపహస్యం చేస్తున్నాయి. అధికారుల ప్రణాళిక లోపం ప్రజాప్రతి నిధుల అవినీతి రాష్ట్ర స్థాయిలో వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగింది, ప్రభుత్వ పథకాల నిధులపై చూపించిన శ్రద్ధ వాటి నిర్మాణ తీరుపై కనబరచక పోవడం కొట్టొచ్చినట్లు కనపడుతుందని చెప్పక తప్పదు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వయస్సుతో సంబంధం లే కుండా అందరికీ ఉపయోగపడేలా అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సామాగ్రిని అందుబాటులో ఉంచాలని వాకింగ్ ట్రాక్‌లు పిల్లలకు ఆట వస్తువులు బెంచీలు వంటివి ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ అవి ఎక్కడ అమలు కాకపోగా కోట్లాది రూపాయలప్రజాధనం దుర్వినియోగం అయిందని ప్రజలు ఆగ్రహాన్ని ప్రదర్శి స్తున్నారు. మానసిక ఉల్లాసంతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగ పడతాయని క్రీడల వలన యువత కు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించినప్పటికీ అధికారుల అత్యుత్సాహం ప్రజా ప్రతినిధుల కక్కుర్తి ఫలితంగా ఎక్కడా క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలో లేవు. ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలకోసం నిధులు మంజూరు చేసి నిర్మించినా యువతకు దోహదం పడటం లేదని విమర్శలున్నాయి. క్రీడా ప్రాంగణా లు అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసంగా ఉపయోగ పడుతున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. కొన్ని క్రీడా ప్రాంగణాలలో ఏ ఒక్క క్రీడా నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ సంకల్పం ఆచరణలో విఫలమైన దనడంలో అతిశయోక్తి లేదు. ఇందుకు క్రీడా ప్రాంగణాలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతి నిధుల సమన్వయ లోపం వల్లనే అనువైన స్థలాలను ఎంపిక చేయక పోవడంతో అలంకార ప్రాయంగా నిలిచాయని ప్రజల విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీలలో నివాస ప్రాంతాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో యువత విద్యార్థులు క్రీడాకారులు వాటి వైపు చూడను కూడా చూడక పోవడం ఉపయోగించుకునే ఆసక్తి లేకుండా పోయింది. గ్రామాలకు రెండు మూడు కిలో మీటర్ల దూరాన నిర్మానుష్య ప్రాంతాలలో ఏర్పాటు చేయటం వలన వాకింగ్ చేసే సాధారణ ప్రజలు కూడా అటువైపు వెళ్ళటం లేదు. నిబంధనల మేరకు వాలీబాల్ షార్ట్ పుట్ లాంగ్ జంప్ నేర్చుకునే వారి కోసం గ్రావెల్ వేసి మైదానాన్ని క్రీడలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి అమలుకు ఎక్కడ నోచుకోలేదని చెప్పవచ్చు. భూమిని చదును చేసి క్రీడా ప్రాంగణం పేరిట ఆర్చిని ఏర్పాటు చేశారు. వాలీబాల్ కోర్ట్ పేరిట రెండు పోల్స్ వ్యాయామానికి ఉపయోగ పడే ఇనుప పై పులతో పోల్స్‌ను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. కనీస వసతులు ఏర్పాటు చేయకుండా నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి క్రీడ ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించేందుకు మండలంలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ చెబుతున్నప్పటికీ అధికారి ఎక్కడ ఉంటాడో ఎవరికీ తెలియదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో క్రీడాకారులకు ఈనెల ఆరో తేదీన 27 గ్రామ పంచాయతీలకు 20 వేల రూపాయల విలువ కలిగిన క్రికెట్ కిట్లు 16 వేల రూపాయల విలువ క లిగిన వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు యువత క్రీడాకారులు క్రీడా ప్రాంగణాలను గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా వినియోగంలోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.



మాజీ మంత్రి తుమ్మల విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 39 వ డివిజన్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరరావు డివిజన్లోని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఫయాజ్ ఇంటికి వెళ్లి స్వయంగా కలిశారు. తొలుత మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరరావు కు ఫయాజ్ ఆధ్వర్యంలో డివిజన్ మహిళలందరూ కలిసి పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఫయాజ్ ఇంటికి వెళ్లిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫయాజ్ తండ్రి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతామన్నారు. అలాగే వీధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యలకు కూడా పరిష్కారం చూపిస్తామని తుమ్మల నాగేశ్వరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, చావా నారాయణ, ఖాదర్ బాబా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి జరిగితే...దమ్ముంటే నిరూపించాలి

- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



గోళ్ళపాడు ఛానల్‌లో అవినీతి జరిగిందని అంటున్నారు.. ఇన్నేళ్లు ఏమైంది. నోరు ఎందుకు మూసుకుని ఉన్నారు.. ఎన్నికలు వచ్చాయి కాబట్టి ఇప్పుడు అవినీతి జరిగింది అంటున్నారు. దమ్ముంటే నిరూపించాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు తుమ్మలకు సవాల్ విసిరారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రీ టౌన్ ప్రాంతంలో 28వ డివిజన్ ప్రకాష్ నగర్‌లో మంగళవారం కోడి లింగయ్య అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నాడు జైతెలంగాణ అంటే కళ్లేర్ర జేసీ ఉద్యమకారులపై లాఠీ దెబ్బల వర్షం కురిపించిన ఘనత మీది అని అన్నారు. ఇండ్లలో చోరబడి బలవంతంగా కండువాలు కప్పి ఫోటోలు వాట్స్‌ఆప్‌లలో పెట్టి మద్దతు తెలిపిండు అని అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. గోళ్ళపాడు ఛానల్‌లో జరిగింది అవినీతి కాదు.. అభివద్ధి అన్నారు. ప్రకాష్ నగర్‌కు కాంగ్రెస్ అభ్యర్థి గడచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో ఒక్కసారి అయిన ప్రకాష్ నగర్ వచ్చాడా చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న 9ఏళ్ల కాలంలో అనేక మార్లు ఇక్కడ ప్రజలను కలిసిన, ప్రతి కార్యక్రమానికి వచ్చా.. వాళ వచ్చారా ఏనాడైనా.. అని చెప్పాలన్నారు. చేసిన అభివద్ధి మీ ముందే ఉంది.. మళ్ళీ మమ్మల్ని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, స్థానిక కార్పొరేటర్ గజ్జెల లక్ష్మీ వెంకన్న, పల్లా కిరణ్, తొట్టి ఎల్లయ్య, ముత్యాల వెంకయ్య, గజ్జెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గోర్కీ వైద్య సేవలు మరువలేనివి

- గోర్కీ హస్పిటల్‌ని ప్రారంభించిన సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు, మంత్రి అజయ్, కూనంనేని

నవతెలంగాణ-ఖమ్మం



పేదల వైద్యుడు డాక్టర్ పారుపల్లి గోర్కీ సేవలు ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నటికీ మరువలేరని సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని వైరా రోడ్డులో గోర్కీ నర్సింగ్ హోం పున ప్రారంభం కార్యక్రమాన్ని గోర్కీ కుటుంబ సభ్యులతో కలిసి పువ్వాడ నాగేశ్వరరావు, మంత్రి అజయ్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులతో నర్సింగ్ హోం ప్రారంభించారు. ఈ సందర్భంగా పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత యాభై సంవత్సరాలుగా ఖమ్మం పట్టణంలో నిజమైన నమ్మకమైన వైద్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఏకైక హస్పిటల్ డాక్టర్ గోర్కీ నర్సింగ్ హెూం మాత్రమేనని ఆయన అన్నారు. డాక్టర్ గోర్కీ మాట్లాడుతూ నాన్న ఆశయాలను కొనసాగించడమే తన లక్ష్యమని, డబ్బులు ముఖ్యం కాదు మంచిపేరు ముఖ్యమని అతీ తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యాలతో అట్టడుగు వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో నూతన హంగులతో విదేశాల్లో ఉన్న టెక్నాలజీలతో నూతనంగా ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాల వైద్య సేవలు నేటినుంచి అందుబాటులో ఉంటాయన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోర్కీ డాక్టర్ వద్ద వైద్యం నెర్చుకున్న శిష్యులు గోర్కీ దంపతులని ఆయన కూమారుడు ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ నిషాంత్‌లను శాలువాలతో సన్మానించారు. పేదల గోర్కీ నర్సింగ్ హెూం పునప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్ ప్రియాంక, గుత్తా అనూహ్య, హస్పిటల్ నిర్వహకులు సత్యనారాయణ, క్రిష్ణప్రసాద్, మేయర్ నీరజా, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు పీఎస్‌వీఎస్ వీ. ప్రసాద్, సంధ్య, బోల్లికోండ శ్రీనివాస్‌రావు, పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్ కూమార్, టీడీపీ పార్లమెంటరీ ఇంచార్జ్ కూరపాటి వెంకటేశ్వరరావు, ప్రముఖ సీనియర్ జనరల్ సర్జన్ వై.ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కల్లూరు



సత్తుపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరామ్ పురం నుండి బీఆర్ఎస్ పట్టణ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ముమ్మరం చేశారు. ముందుగా కల్లూరు పెద్ద చెరువు కట్టపై గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సండ్ర వెంకట వీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాంపురం గ్రామం నుండి గడపగడపకు వెళ్లి సండ్ర చేసిన అభివద్ధి కార్యక్రమాలు వివరిస్తూ పట్టణంలో ప్రచారాన్ని కొనసాగించారు. నవంబర్ ఒకటో తేదీన నిర్వహించే సీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. చంద్రు పట్ల గ్రామంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ కాటమనేని వెంకటేశ్వరావు, సర్పంచ్ గొల్లమందల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. వెంకట వీరయ్య అని గెలిపించాలని, ఒకటో తేదీన సీఎం సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, జడ్పీ, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి.ఇస్మాయిల్, షేక్ కమ్లి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకష్ణ, మండల సెక్రటరీ కొరకొప్పు ప్రసాద్, సీనియర్ నాయకులు మేకల కష్ణ, సర్పంచ్ రావి సూర్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 39 వ డివిజన్ బ్రాహ్మణ బజార్‌లోని శ్రీ శంగేరి జగద్గురు సంస్థానం శ్రీ పార్వతీ, భ్రమరాంభ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం మాజీమంత్రి, కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు బాదంపూడి కాశీ ప్రసాద్, అర్చకులు విజయ్ కుమార్, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరుమీద గోత్రనామాలు చదివి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పూజ కార్యక్రమం నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలసాని లక్ష్మీ నారాయణ, కమర్తపు మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

దశ విధాలైన పాపాలను హరించేదే దసరా

యర్రంబాలగంగాధర్ తిలక్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

దశ విధాలైన పాపాలను హరించేది కనుకనే విజయదశమిని దసరాగా వ్యవహరిస్తారని ఖమ్మం నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ యర్రం బాలగంగాధర్ తిలక్ తెలిపారు. దసరా నాడు ఏ పని ప్రారంభించిన విజయ వంతమవుతుందని అమ్మవారి భక్తుల నమ్మకం అన్నారు. ఖమ్మం నగరంలోని ట్రంక్ రోడ్ లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శమి పూజ కూడా ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, విజయలక్ష్మి దంపతులు పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

మదన్ లాల్ గెలుపు కోసం విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కొణిజర్ల

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్ లాల్ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ శ్రేణులు మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శురుల పిలుపు మేరకు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బోడియతండా గ్రామంలో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు వడ్తియ్యారంగా ఉపసర్పంచ్ రాందాస్ స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి గడపగడపకు తిరిగి బాణోత్ మదన్ లాల్ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వడ్తియ్యా రమేష్, భాస్కర్ రాంబాబు, వెంకన్న శ్రీకాంత్, కోటేశ్వరరావు, హనుమా, వీరు, వెంకటేశ్వర్లు, లాలు, సాయి పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీలక్ష్మి నరసింహ స్వామి పారు వేట

పాల్గొన్న మంత్రి పువ్వాడ, కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



విజయదశమిని పురస్కరించుకుని ఖమ్మం శ్రీలక్ష్మి నరసింహ స్వామి పారు వేట కన్నుల పండుగగా నిర్వహించారు. రేవతి సెంటర్‌లో వేచి ఉన్న శ్రీలక్ష్మి నరసింహ స్వామి గుట్ట ఆలయ మెట్ల వద్ద అర్చకుల అధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన పారువేటలో భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పల్లకిని ఎత్తుకుని స్వామి వారి పారు వేటను ప్రారంభించారు. అక్కడి నుండి నెహ్రూ నగర్, వైరా రోడ్డు, జెడ్పీ సెంటర్ మీదగా జమ్మిబండ వరకు స్వామి వారిని భక్తులకు దర్శనమిస్తూ జమ్మి బండలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం(గుట్ట) పారువేట స్థలంకు చేరుకున్నారు. అనంతరం జమ్మి బండ వద్ద ఉన్న దుర్గా దేవి అమ్మవారికి మంత్రి కుటుంబ సభ్యులు పువ్వాడ అజయ్ కుమార్, వసంత లక్ష్మీ, తనయుడు డాక్టర్ ".నయన్, కోడలు అపర్ణ, ఫ్యామిలీ కలిసి దుర్గా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ..ఖమ్మం శాసన సభ్యుడిగా ఎన్నికైన నాటి నుండి స్వామి వారి పారువేట సేవలో, శమీ పూజలో, అమ్మ వారి పూజల్లో, రావణ దహనం నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే ఉన్నాయన్నారు. స్వామి వారి పారుసేవలో పాల్గొనడం నా అదష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మెన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కష్ణ, దాదే అమతమ్మ సతీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కష్ణారావు, బొమ్మ రాజేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మెన్ గోలి వెంకటేశ్వర్లు(చిన్న), గోలి అనూప్, సింగు శ్రీను, మందడపు రమారావు, సత్యాల మధు, కణతాల నర్సింహా రావు, ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వస్త్రాలు పంపిణీ

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రీ టౌన్ ప్రాంతం గాంధీ చౌక్‌లోనిషిర్డి సాయి మందిరంలో దసరా పండుగ సందర్భముగా మంగళవారం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సహకారముతో ఆలయ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీదలకు ఉచిత వస్త్రాలు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. అదేవిధంగ్గా సుమారు 3,000 మందికి అన్నదానం కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మంత్రి పువ్వాడ ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్ర పువ్వాడకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ళ వెంకట జగన్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడు గల్లంతు

- గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు

నవతెలంగాణ-పినపాక



గోదావరిలో బతుకమ్మలు విడిచిపెట్టడానికి వెళ్లి ఓ యువకుడు గల్లంతైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం రాయిగూడెం ఎస్సీ కాలనీకి చెందిన ప్రాంతానికి చెందిన చిట్టిమల్ల సురేష్ అనే యువకుడు గోదావరిలో గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సురేష్ బంధువులు, స్నేహితులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకు గల్లంతైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టిన ఎటువంటి ప్రయోజనం లేదు. డీఎస్పీ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఉపాధ్యాయిని శైలజ మృతి పట్ల ఎల్టా సంతాపం

నవతెలంగాణ-కొత్తగూడెం



టేకులపల్లి మండలం బొమ్మనపల్లీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పనిచేయుచున్న అదిములపు శైలజ (53) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఆమె పనిచేసిన ప్రతీ పాఠశాలల్లో వృత్తికి అంకితమై పనిచేసి, విద్యార్థులకు ఇంగ్లీష్ భాష ప్రావీణ్యాన్ని పట్టును పెంచి, ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, రిసోర్స్ పర్సన్‌గాను జిల్లా విద్యాధికారుల, తల్లిదండ్రుల మన్ననలు పొందారు. శైలజ ఆకస్మిక మృతి పట్ల ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ దస్తగిరి, ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్ షరీఫ్, కోశాధికారి వారణాసి వేంకటేశ్వర రావు, జయదాస్, జిల్లా రిసోర్స్ పర్సన్స్ షేక్ మీరా హుస్సేన్, సైదులు, తబిత సంధ్యారాణి, జానకి దేవీ, సుధారాణిలు వారీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు.

మండల కేంద్రంలో విప్ రేగా పర్యటన

నవతెలంగాణ-పినపాక

పేద ప్రజలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. మంగళవారం పినపాక మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని, కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. అనంతరం పినపాక గ్రామానికి చెందిన కొమరం నాగమణికి బీఆర్ఎస్ పార్టీ రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికి రూ.రెండు లక్షల ప్రమాద బీమా సైతం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి భవాని శంకర్, స్థానిక ఎంపీటీసీ సత్యం, మన్యం మనగడ రీజినల్ మేనేజర్ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-కొత్తగూడెం



విజయ దశమి సందర్భంగా కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహించిన నవరాత్రి మహూత్సవాలు సోమవారం ముగిశాయని కార్యనిర్వహణాధికారి కె.సులోచన మంగళవారం ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణం శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానం నందు జరిగిన శ్రీ స్వర్ణదుర్గ అమ్మవారి దేవీ శరన్నవరాత్ర మహోత్సవములలో భాగముగా తొమ్మిదవ రోజు ఆఖరిరోజు అనగా 23న విజయ దశమి సందర్భముగా సోమవారం ఉదయం 11 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12.30 గంటలకు కలశోద్వాసన తదుపరి అమ్మవారు శ్రీ కవచాలంకృత స్వర్ణదుర్గాదేవి అలంకారములో దర్శనం, సాయంత్రం శమిపూజతో నవరాత్ర కార్యక్రములు ముగిశాయని ఈఓ తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో ప్రజలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.

పొత్తులు తేల్చకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- బత్తుల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు

పొత్తుల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాన్చుడు ధోరణి వీడకుంటే కాంగ్రెస్ పార్టీకే నష్టమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వామపక్షాలతో పొత్తులు ఉంటాయని చెప్తుతూ ఇంత వరకూ పొత్తు విషయం తేల్చలేదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలలో వ్యతిరేకత ఉన్నప్పటికీ వారి నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ప్రచారం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ వామపక్షాలకు అసెంబ్లీ స్థానాలు తేల్చకుండా ఉండటం వల్ల అనేక సమస్యలు వస్తాయని ఆయన అన్నారు. వామ పక్షాలకు ఇచ్చే సీట్లు పదో, 20వ స్థానాలు ఇస్తున్నట్టుగా తేల్చకుండా ఉండటం కాంగ్రెస్‌కు పెద్ద తీరని లోటని ఆయన అన్నారు. తొందరగా తేల్చాలని, ప్రచారంలోకి దూసుకుపోదామని ఆయన అన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు...82వేలు స్వాధీనం

నవతెలంగాణ-కొత్తగూడెం

చుంచుపల్లి పోలీసులు కొంత మంది రహస్యంగా పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుండి రూ.82 వేలు స్వాధీన చేసుకున్నట్లు చుంచుపల్లి పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి చుంచుపల్లి మండలం, విద్యానగర్ కాలనీలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఆకరపు వెంకటేశ్వర్లు ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ఇంటిపై దాడి చేయగా 9 మంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు గ్రహించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇంటి యజమాని ఆకారపు వెంకటేశ్వర్లు, సుజాతనగర్‌కు చెందిన వట్టిచెర్ల శ్రీనివాసరెడ్డి, లక్ష్మీదేవి పల్లికి చెందిన సపావత్ పిచ్చయ్య, సుజాతనగర్‌కు చెందిన కొప్పుల వేణు కుమార్, కోరబోయిన శ్రీనివాసరావు, నరికి మధుకర్, ధారావత్ బాలాజీ, అక్కరపు తిరుపతిరావు, లక్ష్మీదేవిపల్లికి చెందిన చెక్క లక్ష్మణరావులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం కేసీఆర్ ది ప్రజా సంక్షేమ పాలన : రేగా

నవతెలంగాణ-మణుగూరు

సీఎం కేసీఆర్ ది సంక్షేమ పాలన, అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉన్నదని విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టడంతోపాటు ఎన్నికల మ్యానిఫెస్టో దేశంలో ఎక్కడలేని విధంగా రూపొందించారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం సాధించని ప్రగతి తెలంగాణ రాష్ట్రం సాధించింది అన్నారు. గత ఎన్నికలలో మ్యానిఫెస్టోలో లేని విధంగా పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అన్ని వర్గాల ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని కారుకొండ రామవరానికి చెందిన కళ్లెం సాంబయ్య(35) విద్యుత్ షాక్‌తో మరణించారు.

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భద్రాచలం

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో బందు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో ఖాళీలు ఏర్పడిన, ప్రమోషన్ పై వెళ్లిన వారి పోస్టులను నియమించారు. కమిటీ ఉపాధ్యక్షులుగా ఎస్.రాజబాబును, కార్యవర్గ సభ్యులుగా బి.రాజులను డివిజన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్ రాజబాబు, బి.రాజు మాట్లాడుతూ సంఘం నియమాలను అనుసరించి సంఘ కార్యక్రమాలలో విస్తృతంగా తిరిగి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలుపుతూ తమకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని డివిజన్ నాయకత్వానికి, ఆల్ పెన్షనర్స్ సభ్యులందరికీ తమను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

భద్రాచలంలో ఘనంగా సెమీ పూజ

నవతెలంగాణ-భద్రాచలం



దసరా పండుగను పురస్కరించుకొని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దసరా మండపంలో నిర్వహించిన సెమీ పూజ ఘనంగా జరిపారు. ముందుగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అత్యాకస్వాములు... అనంతరం శ్రీ స్వామివారిని పల్లకిపై ఊరేగింపుగా జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న దసరా మండపం వద్దకు తీసుకువచ్చి అక్కడ వేయించేంప చేశారు. ఈ సందర్భంగా జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. రావణాసుర వద కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం మన్యం ఓ ప్రత్యేకం

1952లో ఏర్పడ్డ అసెంబ్లీ నియోజకవర్గం

- 17వ సారి శాసనసభ ఎన్నికకు సిద్ధమైన భద్రగిరి
- పదిసార్లు కమ్యూనిస్టు పార్టీలే హవా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అటు ఉమ్మడి రాష్ట్రంలోనే కాక విడిపోయాక ఇటు తెలంగాణ రాష్ట్రంలో కూడా భద్రాచలం మన్యం ఒక ప్రత్యేక నియోజకవర్గంగా నిలిచింది. ఒకవైపు తెలంగాణ రాష్ట్రానికి చిట్టచివరి నియోజకవర్గం కాగా మరోవైపు నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంగా భద్రాచలం ఏజెన్సీ ఉంది. పూర్తిస్థాయిలో ఆదివాసీ జీవన విధానం కలిగిన ఏజెన్సీ ప్రాంతం దక్షిణ భారతదేశంలోనే సుప్రసిద్ధ ప్రసిద్ధిగాంచిన రామాలయంతో పాటు పర్ణశాల బోగత జలపాతంతో పాటు పూర్వపు నియోజకవర్గంలో మోతుగూడెం, సీలేరు, పోల్లూరుతో పాటు పాపికొండ అందాలకు భద్రాచల నియోజకవర్గంలోనే బోటింగ్ పాయింట్ కలిగి ఉండటంతో భద్రాచల నియోజకవర్గంలో ప్రత్యేక పర్యాటక ప్రదేశాలుగా ఉండేవి. 1952లో అతిపెద్ద నియోజకవర్గంగా ఏర్పడ్డ భద్రాచలం నియోజవర్గం 2018 సంవత్సరానికి వచ్చేసరికి అతి చిన్న నియోజకవర్గంగా మారింది. 2014 సంవత్సరం వరకు 9 మండలాలతో ఎన్నికల బరిలో నిలిచిన నియోజకవర్గం తర్వాతి కాలంలో పోలవరం ముంపు పేరుతో విఆర్‌పురం, కూనవరం, చింతూరు, భద్రాచలం మండలం, ఆంధ్రప్రదేశ్లో కలిసిపోగా వాజేడు, వెంకటాపురం, చెర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం పట్టణం, మాత్రమే తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలం నియోజవర్గంగా మిగిలింది. ప్రస్తుతం భద్రాచలం నియోజవర్గంలో 1,45964 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 70051, మహిళలు 75909తో పాటు ఇతరులు నలుగురు ఉన్నారు. మొత్తం 176 పోలింగ్ కేంద్రాలతో 17వ సారి భద్రాచలం నియోజకవర్గం 2023 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే 16 సార్లు భద్రాచల నియోజకవర్గానికి ఎన్నికలు జరగగా అందులో 1985 నుండి 1994 వరకు మూడుసార్లు వరసగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా కుంజా బొజ్జి నిలిచారు. 1978 సంవత్సరంలో ముర్ల ఎర్రయ్య రెడ్డి గెలుపుతో ఈ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) ప్రస్తావం మొదలైంది. 2009 వరకు ఆ పార్టీ వరుస విజయాలతో దూసుకుపోయింది. సీపీఐ(ఎం) తరపునుండి ముర్ల ఎర్రయ్య రెడ్డి రెండుసార్లు, కుంజా బొజ్జి మూడుసార్లు, సున్నం రాజయ్య మూడుసార్లు గెలుపొంది భద్రాచలం నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి చేశారని చెప్పాలి.



భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు వివరాలు

సంవత్సరం	ఎమ్మెల్యే..
1952	ఇద్దరు.. కె.వి దొర కృష్ణారావుట (కె ఎంపీపీ పార్టీ)
1955	ఇద్దరు..ఎండి తాసిల్ ఎస్ సీతారామయ్య (సీపీఐ)
1957	ఉప ఎన్నిక. పివి రావు (కాంగ్రెస్)
1962	మహమ్మద్ తాసిల్ (సీపీఐ పార్టీ)
1967	కన్నయ్య దొర (కాంగ్రెస్ పార్టీ)
1972	మట్ట రామచంద్రయ్య (కాంగ్రెస్ పార్టీ)
1978	ముర్ల ఎర్రయ్య రెడ్డి (సీపీఐ(ఎం))
1983	ముర్ల ఎర్రయ్య రెడ్డి (సీపీఐ(ఎం))
1985	కుంజ బొజ్జి (సీపీఐ(ఎం))
1989	కుంజ బొజ్జి (సీపీఐ(ఎం))
1994	కుంజ బొజ్జి (సీపీఐ(ఎం))
1999	సున్నం రాజయ్య (సీపీఐ(ఎం))
2004	సున్నం రాజయ్య (సీపీఐ(ఎం))
2009	కుంజా సత్యవతి (కాంగ్రెస్)
2014	సున్నం రాజయ్య (సీపీఐ(ఎం))
2018	పొదెం వీరయ్య (కాంగ్రెస్)

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తా
- విప్, ఎమ్మెల్యే రేగా

నవతెలంగాణ-బూర్గంపాడు



క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తా యని, క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన సహకారం అందిస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరలో గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు నిలిచిన వారికి బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన చేతుల మీదుగా మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.ఐదు వేలు నగదుతో పాటు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర సర్కార్ పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు. క్రీడలలో గెలుపు, ఓటములను స్వీకరించాలని ఆయన పేర్కొన్నారు. గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓడినప్పుడు కింగిపో కుండా యువత ప్రతిదానిని స్వీకరించి తమ తమ రంగాలలో ఉన్నత శిఖరాలు అవరోదించాలని ఆయన అన్నారు. క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి రామ కొండా రెడ్డి, మేడం లక్ష్మీనారాయణ రెడ్డి, గాదె నర్సిరెడ్డి, కొనకంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

నవతెలంగాణ-చండ్రుగొండ

అన్నం పరబ్రహ్మ స్వరూపమని సొసైటీ వైస్ చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ అన్నారు. బతుకమ్మ పురస్కరించుకొని మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంను వెంకటనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మద్దుకూరు పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి కొడెం రాంబాబు, పోట్రు అప్పారావు, మాచినేని వెంకటేశ్వర్లు, మాచినేని సురేష్, జిల్లా యువజన నాయకులు కాంపాటి అశోక్, మడకం నాగరాజు, పదం కృష్ణయ్య, కంపాటి రవి, కాకాటి సాయిబాబా, కాంపాటి రాధమ్మ, మాజీ సర్పంచ్ కాకా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు ప్రధానోపాధ్యాయులు పాటుపడాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపు

నవతెలంగాణ-కొత్తగూడెం



పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుకు, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రధానోపాధ్యాయులు పాటుపడాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థానిక టీచర్స్ భవన్ కొత్తగూడెంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన జరిగిన ప్రధానోపాధ్యాయుల ఓరియంటేషన్, అభినందన సభలో పాల్గొన్న నర్సిరెడ్డి మాట్లాడారు. చాలా కాలం తర్వాత పాఠశాల విద్యా రంగంలో ప్రధానోపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. తద్వారా నూతనంగా ప్రమోషన్ పొందిన ప్రధానోపాధ్యాయులు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంపు ద్వారా వాటి పరిరక్షణకు, విద్యా ప్రమాణాల పెంపుకూ పాటుపడాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగం ప్రజల అభిమానాన్ని పొందేలా కృషి చేయాలని ఉపాధ్యాయలకు అలుగుబెల్లి పిలుపు నిచ్చారు. విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి నట్లయితే కోర్టు కేసులు అన్నింటిని అధిగమించి అన్ని రకాల ప్రమోషన్లు సాధించుకోవడం సాధ్యమయ్యేదని, వారి నిర్లక్ష్యం వల్ల ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిలిచి పోవలసి వచ్చిందన్నారు. ఎస్జీటీలు, పండిట్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ నిలిచి పోవటం విద్యారంగానికి నష్టదాయకమన్నారు. ఎస్‌సీటీఈ నుంచి టెట్‌కు మినహాయింపు తీసుకొని మిగిలిన ప్రమోషన్ల బదిలీల ప్రక్రియను ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని నర్సిరెడ్డి అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కారణంగా వాయిదా పడిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఇతర ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కూడా అధికార యంత్రాంగం ఎన్నికలు అయిన వెంటనే పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా నుండి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన వారికి సర్వీస్ రూల్స్, లీవ్ రూల్స్, అకౌంట్స్, ఆడిట్స్, పాఠశాల నిర్వహణపై టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రధాన వక్తగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహనా కార్యక్రమ రిసోర్స్ పర్సన్స్‌గా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మినారాయణ, జిహెచ్ఎం పద్మలత వ్యవహరించారు. అనంతరం పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.

పాలకుల వైఖరితో ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం : కె.జంగయ్య

ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి వేతన సవరణ తాత్కాలిక భృతి, హెల్త్ కార్డులు తదితర అంశాలను చర్చిస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించకుండా పీఆర్సీ కమిటీ వేసి, ఐదు శాతం ఐఆర్ ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయకుండా, జీతాలు ఇతర బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు చాలా నష్టం కలిగించిందని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య విమర్శించారు. అదేవిధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ఎన్నికల ముందే రద్దు చేస్తారని భావించినా దానిమీద కమిటీ వేస్తామని అధికార పార్టీ ప్రకటించడం ఉద్యోగులకు నిరాశ కలిగించిందన్నారు. రాష్ట్రంలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేయాలని, పెండింగ్ డిఏలని చెల్లించడంతో పాటు నెల మొదటి తేదీన జీతాలు చెల్లించేందుకు, మెరుగైన ఫిట్మెంట్‌ను ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలు, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు అచేతనంగా ఉన్న పరిస్థితుల్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందని, ఇప్పటికైనా ఆ సంఘాలు పునరాలోచించి ఉద్యోగుల ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వి.వరలక్ష్మి, బి.మురళీమోహన్, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం.పద్మ రాణి, ఎం.వెంకటేశ్వర్లు, హాతీరామ్, ఎం.రాజయ్య, డి.తావూర్య, ఆర్.రమేష్ కుమార్, గంగాధర్, విజయకుమార్, బి.బిక్కు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన దసరా సంబరాలు

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి ఆధ్వర్యంలో దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి. దసరా ఉత్సవాలు వేడుకల సందర్భంగా మణుగూరు ఏరియా పి.వి కాలనీ భద్రాద్రి స్టేడియంలో మణుగూరు ఏరియా ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారి సౌజన్యంతో సోమవారం రాత్రి దసరా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏరియా సింగరేణి ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన ఉచిత టీ బిస్కెట్ స్టాల్‌ను ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రారంభించారు. ఈ ప్రసంగిస్తూ నేటి విజయదశమి వేడుకలు ఇంత ఘనంగా జరిగినందుకు సింగరేణి సంస్థతో పాటు చేయి చేయి కలిపి ఈ కార్యక్రమము ఇంత భారీ ఎత్తున నిర్వహించడానికి ప్రతి ఉద్యోగి తమ వేతనాల నుండి రూ.200 నిధులు సమకూర్చమన్నారు. మణుగూరు ఏరియా ఉద్యోగులకు అలాగే మొట్టమొదటిసారిగా దసరా వేడుకల నిర్వహణలో ఆర్థిక తోడ్పాటు అందించిన గ్రేట్ యూనియన్ నాయకులకు, మణుగూరు ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ దిశ నిర్దేశికత్వంలో మన సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తులలో విద్యుత్ ఉత్పాదక రంగంలో దినదినాభివృద్ధి చెందుతూ ప్రభుత్వ పారిశ్రామిక రంగాలలో అగ్ర భాగాన కొనసాగడం మనందరికీ ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి కళాకారులచే స్థానిక కళాకారులు ప్రదర్శించిన నిత్య కళా ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ 2 జీఎం వీసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, నర్సిం రెడ్డి, డీఎస్పీ రాఘవేంద్ర రావు, లక్ష్మీపతి గౌడ్, రాంబాబు, డిజీఎం పర్సనల్ సిఎస్ రమేష్, డాక్టర్ శేషగిరి, ఇతర ఉన్నతాధికారులు సింగరేణి దసరా ఉత్సవ కార్యనిర్వాహక కమిటీ వి.ప్రభాకర్, రామ్ గోపాల్, కిషన్ శ్రీజాన్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో....ద 'సరా' దాలు



దుమ్ముగూడెం దసరా వచ్చిందమ్మో సరదా తెచ్చిదమ్మో జయహో దుర్గా భవాని అంటూ మండల ప్రజలు విజయ దశమి(దసరా) వేడుకలను మంగళవారం సరదాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. బంధు మిత్రులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పిండి వంటలు వివిద రకాల వంటకాలతో ప్రతి ఇంట్లో ఘుమ ఘుమ లాడాయి. చేసే పనుల్లో అన్నీ విజయాలే కలగాలని కనకదుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం ముత్యాలమ్మ అమ్మవారు, సాయిబాబా ఆలయం, లక్ష్మీనగరం దాసాంజనేయ స్వామి వారి ఆలయం, ఆంజనేయ స్వామి వారి ఆలయం, నడికుడి మహంకాళి ఆలయం, నర్సాపురం, చిన్న అరుణాచలేశ్వరస్వామి వారి ఆలయాలతో పాటు పలు హిందూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు నిర్వహించారు. మండలంలో పలు చోట్ల మండపాల్లో నిర్వహిస్తున్న దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిద అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నబండిరేవు గ్రామంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. నేడు దేవి ఊరేగింపు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారనే చెప్పవచ్చు.



ఘనంగా దసరా ఉత్సవాలు

ఇల్లందు స్థానిక జెకె సింగరేణి పాఠశాల ఆటస్థలంలో సోమవారం రాత్రి దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టనుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ నాయక్, మున్సిపల్ చైర్మన్ డివి,



మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



చండ్రుగొండ మండల వ్యాప్తంగా విజయదశమి పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు పూజలు జరిపించారు. సెమిపూజ చేశారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని మహిళలు బతుకమ్మలను స్థానిక చెరువుల్లో, కుంటల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు.

పినపాక పినపాక మండల వ్యాప్తంగా దసరా సంబరాలు అంబరాన్నంటాయి. శమి పూజ, అమ్మవారి పూజా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందోత్సాహాల మధ్య పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. జమ్మిచెట్టుకు పూజ చేయడంతోపాటు పనిముట్లు, యంత్రాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో పాల్గొన్న ప్రజలు జమ్మి ఆకును బంగారంగా భావిస్తూ ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ బయ్యారంలో కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

నిమ్మతో కారోబార్ మృతి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

నిమ్ముతో కారోబార్ మృతి చెందిన సంఘటన ఆళ్ళపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతూరు గ్రామ పంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న గొగ్గెల చలపతి (32) సుమారు నెల నుండి నిమ్ము వల్ల వస్తున్న జ్వరానికి సాధారణ జ్వరమని స్థానిక ఇద్దరు ఆర్‌ఎంపీల వద్ద చికిత్స తీసుకున్నాడు. ఎంతకీ జ్వరం తగ్గట్లేదని వారం క్రితం కొత్తగూడెం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అక్కడ ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చికిత్స అందించారు.

అక్కడ చలపతి ఆరోగ్యం విషమంగా మారడంతో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాంతో భార్య మానస, తల్లి ఎర్రమ్మ, బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు. కారోబార్‌గా చలపతి సుపరిచితుడు కావడంతో మృతి చెందాడనే వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార రథానికి పూజలు

నవతెలంగాణ-భద్రాచలం



విజయదశమి పర్వదినం సందర్భంగా భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచార రథానికి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గల అమ్మవారి గుడి దగ్గర ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ప్రచారారథ పూజా కార్యక్రమంలో భద్రాచల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతరేల సుధీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, పొడెం యమునారావు, మాగపూ రాజు, కొత్త హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం... కెఎల్ నర్సింహారావు

- టెనెన్సీ యాక్టు సవరణ, గిరిజన, రైతు సమస్యలపై కృషి సల్పిన యోధుడు
- విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో శాసన సభ్యత్వానికి రాజీనామా
- భూస్వామ్య దాడులకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి
- క్రమశిక్షణగల కమ్యూనిస్టు ఉద్దండుడు
- సీపీఐ(ఎం)కి, ప్రజలకు విశేష సేవలందించిన మహానుభావుడు

మూడు పర్యాయాలు విజయపథం





నవతెలంగాణ-ఇల్లందు

నియోజవర్గంలో అన్ని వర్గాలవారి సమస్యల పరిష్కారానికి తన వంతు విశేష కృషి చేసి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు మాజీ ఎమ్మెల్యే కెఎల్ నర్సింహారావు. ప్రజలు ఉద్యమాలు సృష్టిస్తారు. వాటి నుండే నాయకులు పుడతారు. అటువంటి వారిలో కెఎల్ ఒకరు. నాడు ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు తాలూకా బేతంపూడి గ్రామంలో కొండపల్లి లక్ష్మినర్సింహం (కేఎల్) జన్మించారు. ఆయన వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం విషేషం. నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా కెఎల్.నర్సింహారావు ఆదర్శనీయుడు. విశిష్ట వ్యక్తిగా పేరుగాంచారు. తొలిసారిగా 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1957లో మద్రాస్ నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డప్పుడు ప్రోగ్రెసీవ్ డెమెక్రటిక్ ఫ్రంట్(పిడిఎఫ్) నుండి పోటీ చేసి హైదరాబాదు శాసన సభకు ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. నాడు సుందరయ్య ప్రతిపక్ష నేతగా, కెఎల్ ఉపనాయకుడుగా పనిచేశారు. అనాడు అసెంబ్లీలో టెనెన్సీ యాక్టుకు సవరణకు కృషి చేశారు. ఈ చట్టంలో 37, 37ఎ, 38ఈ సెక్షన్స్ ప్రవేశపెట్టించి కౌలుదారులకు మేలు చేశారు. గిరిజన, రైతు సమస్యలకు కృషి చేశారు. 1962లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అసెంబ్లీకి పోటీ చేసి ముచ్చటగా మూడోసారి ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. ప్రజా సమస్యలపై తనదైన శైలిలో గిరిజనులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అసెంబ్లీ దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కరింపజేశారు. ఎంఎల్‌ఏగా ఉంటూ రైతు సంఘం నాయకునిగా రాష్ట్రస్థాయిలో అనేక ఉద్యమాలు చేపట్టి



రైతులకు న్యాయం జరిగేటట్లు చేశారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాగిన ఉద్యమంలో పార్టీ నిర్ణయం మేరకు తన శాసన సభ్యత్వానికి రాజీనామా చేసిన నిస్వార్థ జీవి కేఎల్ నర్సింహారావు. 1956లో ఆంధ్ర,హైదరాబాదు రాష్ట్రాను కలిపే సమయంలో అసెంబ్లిలో కెఎల్ సూచించిన ఆంధ్రప్రదేశ్ పేరును నాటి ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో 1956 నవంబర్ ఒకటిన ఆధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.

అరుణ ప్రస్థానం సాగించిన కెఎల్ ధన్యజీవి
ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం

1926 జూన్ 26న ఇల్లందు తాలూకాలోని బేతంపూడి గ్రామంలో కొండపల్లి రాంకిషన్ రావు, అన్నపూర్ణమ్మలకు కెఎల్ నర్సింహారావు జన్మించారు. జమిందారి కుటుంబం అయినప్పటికీ దాయాదుల కుట్రల వల్ల కష్టాలు పడ్డారు. ఖమ్మం నాయకులు చిర్రావూరి లక్ష్మినర్సయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, సర్వదేవభట్ల రామనాధంతో పరిచయమై 1944లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆంధ్రమహాసభలో చేరి రామనాధంతో కలిసి 1944లో వరంగల్‌లో ఆజాంజాహి మిల్ వర్కర్స్ యూనియన్ స్థాపించారు. ఆంధ్ర మహాసభ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో రైతు పోరాటం నిర్వహించి 13 నెలలపాటు జైలు జీవితం గడిపారు. 1949లో తెల్దారుపల్లి భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి విజయం సాధించారు.

15వ ఏటనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. చిన్నపిల్లవాడని పోలీసులు పొమ్మంటే నేను పొట్టిగా ఉండి అలా కనపడుతున్నాను నాకు 20ఏండ్లు అనడంతో జైల్లో వేశారు. 13 నెలలపాటు జైలు జీవితం గడిపారు. దొడ్డి కొమరయ్య బలిదానం వార్త విని చలించిపోయి జైలు గోడల మధ్యనే పాట రాశారు. 1978, 79లో పాటూరి రామయ్య, తెలకపల్లి రవితో కలిసి ప్రజాశక్తి పత్రిక తీసుకురావడంలో తోడ్పడ్డారు. కెల్ భార్య దుర్గాదేవి, కుమారులు, కూతురు, కోడళ్ళను మార్క్సిస్టు ఉద్యమ పథంలో నిలిపారు. కొంత కాలం అనారోగ్యంతో బాధపడుతూ 2011 మార్చి 17న ఖమ్మంలో కన్నుమూశారు. అనేక ఆటుపోట్లు అనుభవాలతో దశాబ్దాల పాటు అరుణ ప్రస్దానం సాగించిన కెఎల్ నర్సింహారావు ధన్యజీవి. 2023 అసెంబ్లి ఎన్నికల నాటికి దేశం, రాష్ట్రంలో నెల కొన్న మతం రంగు, నియంత పాలనలు, కుట్రలు, కుతంత్రాలు, డబ్బు, మద్యంతో రాజ్యమేలుతు ప్రజలను కుదిపేస్తున్న రోజులివి. ఈ కాలంలో ఆయన జీవితం నేటి తరం ప్రజలకు, సీపీఐ(ఎం) పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆదర్శప్రాయం.



గడికోటలో ఘనంగా ప్రారంభమైన క్రికెట్ క్రీడలు

- క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలన్న ప్రముఖులు

నవతెలంగాణ-చర్ల



మండల కేంద్రంలో గల గడికోట క్రీడా మైదానంలో ది 100 లీగ్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్ల సీఐ బి.రాజగోపాల్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో సమయస్ఫూర్తి క్రీడా స్ఫూర్తి మెండుగా ఉండాలని ఆయన సూచించారు. క్రీడలు మనో ఉల్లాసంతో పాటు శారీరిక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ఆయన క్రీడలను ప్రారంభించారు. ప్రెస్ వర్సెస్ పోలీస్ ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్లో పోలీసులు ఘన విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇర్పా శాంత, ఎంపీటీసీ మడకం పద్మజ, 13వ వార్డు సభ్యులు దొడ్డి హరినాగ వర్మ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్డి తాతారావు, రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు, చర్ల ఎస్సై నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ కన్వీనర్ తోట మల్ల వరప్రసాద్, సీనియర్ పాత్రికేయులు జవ్వాది మురళీకృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తోటమల్ల రమణమూర్తి, గడ్డం మణికుమార్, గౌరవ సలహా దారు పొనగంటి కృష్ణ, సభ్యులు పఠాన్ మహబూబ్, తోట మల్ల కృష్ణ, ఏడెల్ల గణపతి, శివశంకర్, సాల్మన్ రాజ్, చంద్రశేఖర్, ఆలం సతీష్, కొంగురు కృష్ణ, పెద్ద ఎత్తున క్రీడాకారులు ,క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

- మెచ్చా విజయం కాంక్షిస్తూ పూజలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



నియోజకవర్గ మండలాల్లో విజయ దశమి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. గత పది రోజులుగా ఆలయాలు, ప్రత్యేక మండపాల్లో అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు చేసిన భక్తులు నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చెడుపై మంచి గెలుపుకు దశరా పండుగ చిహ్నంగా భావించే భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి దర్శించుకున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశరావు, మండల సమన్వయ కమిటీ సభ్యులు తాడేపల్లి రవి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాలు, ప్రత్యేక మండలాల్లో నిర్వాహకులు భక్తులకు మంగళవారం అన్నదానాలు చేపట్టారు.

ఎమ్మెల్యే వనమాను కలిసిన తెల్లం

నవతెలంగాణ-భద్రాచలం



కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా.తెల్లం వెంకటరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాను ఆయన శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజకీయ విషయాలు చర్చించారు. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో తన తరఫున ప్రచారం చేసేందుకు వస్తానని ఎమ్మెల్యే వనమా ఈ సందర్భంగా తెలిపినట్లు తెల్లం ప్రకటించారు.

రూ.2.55 లక్షలు స్వాధీనం

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న ఇరువురు వ్యక్తుల నుండి రూ.2.55 లక్షలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, ఎలూరు జిల్లా బంగారెడ్డిగూడెంకు చెందిన సుధాకర్ రెడ్డి కారులో హైద్రాబాద్ వెళుతున్నాడు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన అజయ్ కుమార్ హైద్రాబాద్ వెళుతున్నాడు. వీరి వాహనాలను తనిఖీ చేయగా సుభాకర్రెడ్డి వద్ద రూ.1.84 లక్షలు, అజయ్ కుమార్ వద్ద రూ.71 వేల నగదును గుర్తించారు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోవటంతో సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీశాంత్ తెలిపారు.

యువకునిపై ఫోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రంలోని న్యూ కాలనీకి చెందిన యువకునిపై మంగళవారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫోక్స్ కేసు నమోదు అయినది. వివరాల ప్రకారం...జూలూరుపాడు న్యూ కాలనీకి చెందిన బాలికపై అదే కాలనీకి చెందిన యువకుడు వేమూరి కనకరాజు (22) ప్రేమ పేరుతో గత కొద్ది రోజులుగా వెంటపడుతూ శనివారం బాధిత బాలిక కిరణా సరుకుల కోసం వెళుతూ ఉండగా సదరు కనకరాజు బలవంతంగా తన ఇంట్లోకి లాక్కొని వెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లోబరచుకొని తన కోరికలు తీర్చుకున్నాడు. తొలుత జరిగిన విషయం గురించి బాలిక భయపడి ఎవరికీ చెప్పలేదు. అనంతరం తల్లిదండ్రులకు తెలియపరచి తల్లితో కలిసి వెళ్లి సదరు యువకుని పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సదరు యువకుడిని రిమాండ్కు తరలిస్తున్నట్లు తెలిపారు.

బాలసానిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

నవతెలంగాణ-భద్రాచలం



మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణని ఖమ్మంలోని వారి నివాసంలో టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్ నేతృత్వంలో వెంకటాపురం మండల సొసైటీ అధ్యక్షులు చిడెం మోహన్ రావు, వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు భద్రాచల నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. చర్చల్లో భాగంగా బాలసాని తెలంగాణ రాష్ట్రానికి ఈశాన్య ప్రాంతమైన భద్రాచలం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పొదెం వీరయ్య మరొకసారి అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని, కానీ ఎక్కడ కూడా అలసత్వం వహించకుండా కాంగ్రెస్ క్యాడర్ చురుకుగా పనిచేసే విధంగా చూసుకోవాలని వారికి సూచన చేసినట్టు కాంగ్రెస్ నేతలు తెలిపారు.

ఆశీర్వదించండి...అభివృద్ధి చేసి చూపెడతా

- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మీ నిండు మనస్సుతో ఆశీర్వచనాలు అందిస్తే ఎమ్మెల్యేగా గెలుపొంది మన ప్రాంత అభివృద్ధి ఎంటో చూపెడతానని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం బొజ్జిగుప్ప, నారాయణరావుపేట, లచ్చిగూడెం, భీమవరం, మారాయిగూడెం గ్రామాలలో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా ఆయనకు బొజ్జిగుప్ప వద్ద గిరిజన సాంప్రదాయ డోలు, కొమ్ము నృత్యాలతో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మారాయిగూడెం గ్రామంలో గల సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారాయిగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు, ఆటో యూనియన్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి తెల్లం పార్టీ కండువా సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మారుమూల గిరిజన గ్రామాలకు తాగు, సాగు నీరు తీసుకు వస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మీ, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపిటీసీలు సోడి తిరుపతిరావు, మడకం రామారావు, పూసం ధర్మరాజు, ఇర్పా చంటి, కల్లూరి రజినీ, గుండి వెంకటేష్, తెల్లం రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలు సాధించిన యువకులను అభినందించిన రేగా


నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని మోరంపల్లి బంజర గ్రామంలో విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అదే గ్రామంలో పోలీసు ఉద్యోగాలు సాధించిన యువకులను అభినందించారు. మోరంపల్లి బంజర గ్రామంలో పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన ఎస్సై మేడం తేజేశ్వర్ రెడ్డి, ఫైర్ కానిస్టేబుల్ పేరం వెంకట్రామిరెడ్డి, బెటాలియన్ కానిస్టేబుల్ మారుడి వెంకటేశ్వర్ రెడ్డి ఉద్యోగాలకు ఎంపిక కావడంతో హర్షం వ్యక్తం చేశారు. వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి రామ కొండా రెడ్డి, మేడం లక్ష్మీనారాయణ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాడు ఓనర్లు...నేడు లారీ డ్రైవర్లు

బొగ్గు లోడింగ్ లేక వాహన యజమానులు ఇక్కట్లు



- ఫైనాన్స్ చెల్లించలేక పలువురి ఆత్మహత్యలు
- బొగ్గు లోడింగ్ పెంచకుంటే కష్టమేనంటున్నా అసోసియేషన్
- సింగరేణి యాజమాన్యమే ఆదుకోవాలని వినతి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి సంస్థతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే ఐక్యతకు మారుపేరుగా చలామణిలో ఉండి అత్యంత శక్తివంతమైనదిగా పేరొందిన మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేడు పలు ఇబ్బందులతో తూలుతున్నది. బొగ్గు లోడింగులు లేక లారీ ఓనర్లు ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. లారీ రవాణా రంగం బాగుందని గతంలో సింగరేణి యాజమాన్యాలు చేసిన సహకారంతో ఎంతోమంది ఫైనాన్స్ ద్వారా లారీ కొనుగోలు చేసి ఈ బొగ్గు రవాణాలోకి అడుగుపెట్టారు. కొంతకాలం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిన బొగ్గు రవాణా ఫీల్డ్ కొద్దీ కొద్దిగా నేడు కోలుకోలేని పరిస్థితికి దిగజారిపోయిందని పలువురు అసోసియేషన్ కమిటీ సభ్యులు లారీ ఓనర్లు వాపోతున్నారు.

వడ్డీల చెల్లింపులకు అప్పులు

మణుగూరు ఏరియాలో బీటీపీఎస్ ఏర్పడిన తర్వాత 12 టైర్ల లారీల పరిస్థితి మరీ అధ్వానంగా మారిందని లారీ ఓనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పస్తులు సైతం ఉండాల్సి వస్తుందని ఫైనాన్స్ చెల్లించేందుకు వడ్డీల మీద వడ్డీలకు అప్పు తెచ్చి మరి ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుందని చెబుతూ వారి బాధలను వ్యక్తపరుస్తున్నారు. లారీలకు లోడింగ్ లేకపోవడంతో ఫైనాన్స్‌లు కట్టలేక ఇంట్లో వారిని పస్తులు ఉంచలేక ఆంజనేయులు, పుల్లారావులతో పాటు మరికొందరు లారీ ఓనర్లు ఆత్మహత్యలు చేసుకోగా మరికొందరు ఈ రంగాన్నే వదిలి వేరే గ్రామాలకు వెళ్లిపోయారని అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 20 లారీలకే లోడింగ్

మణుగూరు ఏరియాలోని లారీ ఓనర్ల అసోసియేషన్లో సుమారు 1000 పైగా లారీలు ఉండగా నేడు వాటి వందల్లోకి పడిపోయింది. ఏరియా సింగరేణి యాజమాన్యం దాదాపు రోజుకు సుమారుగా 400, 800 టన్నుల బొగ్గు మాత్రమే లారీలలో లోడింగ్ చేస్తుంది.

లోడింగ్ పెంచుతామన్నారు

మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ లారీలకి బొగ్గు లోడింగులను పెంచుతామని హామీ ఇచ్చారు. ఏరియాలోని కొండాపురం భూగర్భగని నుంచి వెలికి తీసిన జి సిక్స్ బొగ్గును లారీల లోడింగులకు కేటాయించడంతో రోజు సరాసరిగా 12 టైర్ల లారీలకు 10 మరో 10 టిప్పర్ లారీలను మాత్రమే లోడింగ్ దొరుకుతుంది. దీంతో పాటు వర్షం వస్తే లోడింగ్ ఉండదు. కనీసం ప్రతి నెలలో నాలుగు రోజుల నుండి ఏడు రోజుల వరకు అసలు లోడింగ్ దొరకడం లేదు.

- లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజడ్ల వెంకట రవి

పంచాక్షరయ్యను సన్మానించిన ఎమ్మెల్సీ మధుసూదన్

- తెల్లం వెంకట్రావు గెలుపునకు కృషి చేస్తా : తాళ్లూరి

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలో తాళ్ళూరి ట్రస్ట్ చైర్మెన్ తాళ్ళూరి పంచాక్షరయ్యను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తాత మధుసూదన్ సన్మానించారు. మంగళవారం భద్రాచలం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు కోరుతూ తాళ్ళూరి పంచాక్షరయ్య పూర్తి మద్దతు కావాలని తెల్లం వెంకట్రావు గెలుపునకు కృషి చేయాలని తాళ్ళూరిని కోరారు. ఈ సందర్భంగా పంచాక్షరయ్య మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేనటువంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఉన్నటువంటి రాష్ట్రం కేవలం తెలంగాణ రాష్ట్రమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నటువంటి నాయకుడు కేసీఆర్ అని ఆయన అన్నారు. డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపుకు నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా భద్రాచలం నియోజకవర్గంలో గతంలో నాతో కలిసి పని చేసిన ప్రతి ఒక్కరూ కూడా డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపునకు కృషి చేసే విధంగా సమిష్టిగా పని చేసే విధంగా చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల పీఏసీఎస్ చైర్మెన్ బిక్కసాని శ్రీనివాస రావు, మండల నాయకులు కామిరెడ్డి రామ కొండా రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ మండల నాయకులు వల్లూరుపల్లి వంశీ కృష్ణ, మండల యువజన అధ్యక్షులు గోనెల నాని, భద్రాచలం కమ్మ సంఘం అధ్యక్షులు అడిసుమల్లి జగదీష్, సెక్రటరీ చావా లక్ష్మీనారాయణ, కమ్మ సంఘం కార్యవర్గ సభ్యులు పాకాలపాటి శివబాబు, తాళ్ళూరి ప్రభాకర్ రావు, తాళ్ళూరి రాధాకృష్ణ, ప్రసాద్, తాళ్ళూరి రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోనే రావల్లి గ్రామంలో బీఆర్ఎస్ నుంచి 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరినట్లు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో మల్లు భట్టి విక్రమార్క కు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు విసుకుగు చెంది అనేకమంది మధిర నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 ఎమ్మెల్యే స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు ఏనుగు జనార్ధన్ రావు ఏనుగు సందీప్ తదితరులు పాల్గొన్నారు.



టీఎన్జీవో రూరల్ యూనిట్ సెక్రెటరీగా కేవీవీ ప్రసాద్ నియామకం

నవతెలంగాణ-ఖమ్మం

టీఎన్జీవో రూరల్ యూనిట్ సెక్రెటరీగా కేవీవీ ప్రసాద్‌ను నియమించారు. మంగళవారం నగరంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో టీఎన్జీవో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్ హసన్, ఆర్.వి.ఎస్ సాగర్‌ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ యూనిట్ సెక్రెటరీగా కెవివి ప్రసాద్(రూరల్ ఆర్ఐ)ను ఏకగ్రీవంగా అఫ్జల్ హసన్ నియమించారు. అదేవిధంగా జిల్లా కార్యవర్గంలో మరో నలుగురికి స్థానం కల్పించారు. టౌన్ ఉపాధ్యక్షులుగా బి.రజినీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అన్వర్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా వసంత, టౌన్ జాయింట్ సెక్రెటరీగా ఝాన్సీ, జిల్లా ఆఫీస్ సెక్రెటరీగా పురుషోత్తం రెడ్డి,స్పోర్ట్స్ సెక్రెటరీగా వజీరుద్దీన్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా ఎ.జ్యోతి, జిల్లా పబ్లిసిటీ సెక్రెటరీగా వై.శ్రీనివాసరావు ను నియమించారు. అనంతరం నూతనంగా ఎన్నికయిన వారిని అఫ్జల్ హసన్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అఫ్జల్ హసన్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై పోరాడుతానని చెప్పారు. టీఎన్జీఓ యూనియన్ కార్యాలయానికి భవనాన్ని కేటాయించిన కలెక్టర్ వి.పి.గౌతమ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.ప్రసాద్ రావు, హౌస్ బిల్డింగ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్ చంద్రశేఖర్ రావు, కోశాధికారి భాగం పవన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, యూనిట్ల అధ్యక్షులు నాగుల్ మీరా సాయి పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

చింతకాని : మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో ఓ బెల్ట్ షాప్‌లో అక్రమంగా నిల్వంఉంచిన రూ.10890ల విలువైన మద్యం సీసాలను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా బెల్టు దుకాణాలపై నిఘా ఉంచినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.



ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చేసిన కందాళ

తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం పర్యటన ముగించుకొని తిరిగి వస్తున్న తరుణంలో తిరుమలాయపాలెం పరిధి జాగతి స్కూల్ సమీపంలో వరంగల్ హైవే రోడ్డుపై, చెట్టు విరిగి విద్యుత్ లైన్ తెగి రోడ్డు మీద పడింది. అది చూసిన పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి తన సిబ్బందితో, పక్కన ఉన్న మండల నాయకులతో కలసి రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను, విరిగిన చెట్టును పక్కకు జరిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-చింతకాని

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో బోనకల్లు మండలం ముష్టికుంట్లకు చెందిన దుగ్గి స్వామి(48) మృతి చెందిన సంఘటన పండగ రోజు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముష్టికుంట్లకు చెందిన స్వామి తన బంధువుల స్వగ్రామమైన చింతకాని మండలం అనంతసాగర్ వెళ్లి మేక మాంసం తీసుకొని తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. పందిళ్ళపల్లి, జగన్నాధపురం మధ్య ఆయన వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మరో యువకుడు ఉపేందర్ కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడిపోవడంతో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్వామి బంధువులు సంఘటన స్థలానికి వచ్చి రోధించిన తీరు అక్కడున్నవారికి కన్నీరు పెట్టించింది. ఈ సంఘటనలో ఆ మార్గంలో కొద్దిసేపు ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. వైరా సీఐ సాగర్, ఎస్ఐ రాజేందర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య నరసమ్మ కూడా రెండేళ్ల క్రితం పాముకాటుకు గురై మృతి చెందింది. మృతుడికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీఆర్ఎస్ కు దూరంగా.. కాంగ్రెస్ కు దగ్గరగా

- నేలకొండపల్లిలో బీఆర్ఎస్ నేతలు పలువురి రాజీనామా
- పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక

నవతెలంగాణ ఖమ్మం

బీఆర్ఎస్ కు దూరంగా కాంగ్రెస్ కు దగ్గరగా నేలకొండపల్లి మండలంలో బీఆర్ఎస్ నేతలు పలువురి రాజీనామా చేసి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ అసంతృప్తులంతా ఒక్కొక్కరిగా పార్టీకి రాజీనామా చేస్తున్నారని, ఆ పార్టీలోని కొందరి నేతల అధిపత్య పోరు తమకు ఇబ్బందికరంగా ఉందని చెబుతూ... ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు.పార్టీకి రాజీనామా చేసిన వారంతా పొంగులేటి శీనన్న వెంటే ఉంటామంటూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు .ఈ క్రమంలోనే తాజాగా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలానికి చెందిన మాజీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తేజావత్ కోటేశ్వరరావు, వార్డు మెంబర్ భూక్య భారతి, ధీరావత్ శ్యామాలి, రాజారాం పేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధీరావత్ బాలాజీ, గోబ్రియా, యూత్ నాయకులు వీరన్న, వంశీ తదితరులు బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డిసెంబర్ 4న చలో ఢిల్లీని జయప్రదం చేయండి : వ్యకాస, కెవిపిఎస్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

దళితుల, మైనార్టీల, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాలను నిరసిస్తూ డిసెంబర్ 4న ఢిల్లీలో చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కెవిపిఎస్) మండల కార్యదర్శి పాపిట్ల సత్యనారాయణ అన్నారు. చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ఎం.వెంకటయపాలెం గ్రామంలోని శ్రీనివాస్ నగర్ లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి, సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ అధికారం చేపట్టాక దేశవ్యాప్తంగా దళితులపై, మైనార్టీలపై అట్టడుగు వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. రాజ్యాంగాన్ని తీసివేసి మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి కుట్ర పన్నుతున్నాయని తెలిపారు. మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టేందుకు దళితులు, గిరిజనులు, మైనార్టీలు, శూద్రులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పేదలను పీడించి, పెద్దలు జేబులు నింపుతున్న మోడీని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు వడ్లమూడి మల్లయ్య, ఏపూరి రంగయ్య, కెవిపిఎస్ మండల సహాయ కార్యదర్శి ఏపూరి వరకుమార్, వ్యకాస నాయకులు ఏపూరి నాగేశ్వరరావు, పున్నయ్య,స్వాతి,భారతమ్మ,పుల్లమ్మ,పాపిట్ల రామనాథం,గుర్రం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'హస్తం' సెకండ్ లిస్టులో ఐదుగురు!

- నేడు కాంగ్రెస్ రెండో జాబితా..
- పొంగులేటి, తుమ్మల సహా మరో ముగ్గురు?
- ఆ ముగ్గురూ మాజీ ఎంపీ అనుచరులే..!
- కొత్తగూడెం, వైరాపై కొనసాగుతున్న ఉత్కంఠ

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ రెండో జాబితా బుధవారం వెలువడే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మొత్తం 29 మందితో ఈ జాబితా ఉంటుందని తెలుస్తోంది. దీనిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎవరికి చోటుంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తుపై చర్చల నేపథ్యంలో వైరా, కొత్తగూడెం నియోజకవర్గాలపై ఉత్కంఠ నెలకొంది. వైరా సీపీఐ(ఎం), కొత్తగూడెం సీపీఐకి కేటాయించాలని కోరుతూ టీపీసీసీ నుంచి ఏఐసీసీకి ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం. మొత్తమ్మీద నేడు వెలువడే రెండో జాబితాతో సీట్ల పంపకాలపై కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు కచ్చితంగా ఉండొచ్చని అంటున్నారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి తుమ్మల, పాలేరు నుంచి పొంగులేటి పేర్లు వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

ఆ ఐదుగురు ఎవరు?

రెండోజాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి పొంగులేటి, తుమ్మలతో పాటు శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరులు పాయం వెంకటేశ్వర్లుకు పినపాక, ఇల్లెందు నుంచి కోరం కనకయ్య, అశ్వారావుపేట నుంచి జారె ఆదినారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే మూడు, నాలుగు జాబితాలు కూడా ఉండటంతో ఐదు పేర్లు ఈ జాబితాలోనే ప్రకటిస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. పొంగులేటి, తుమ్మల పేర్లు కచ్చితంగా ఉండొచ్చని, మిగిలినవాటి విషయంలో మాత్రం కొంత సందిగ్ధతే ఉంది. ఒకవేళ ఐదుగురి పేర్లు ప్రకటిస్తే మొత్తం పది నియోజకవర్గాలకు గాను ఫస్టులిస్టులో సీఎల్పీ నేత మల్లు భట్టువిక్రమార్క, భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య పేర్లు వెలువడిన నేపథ్యంలో ఏడుగురి పేర్లు ఖాయమైనట్టవుతుంది.

ఆ మూడుచోట్లా..?!



సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం నియోజకవర్గాలపై ఉత్కంఠ నెలకొంది. సత్తుపల్లి నుంచి మట్టా రాగమయి పేరు కూడా ఈ జాబితాలో వస్తే రావచ్చని అంటున్నారు. కమ్యూనిస్టులతో పొత్తులు కొలిక్కి వస్తేనే కొత్తగూడెం, వైరా అభ్యర్థుల విషయంలో చిక్కుముడి వీడొచ్చనే చర్చ సాగుతోంది. వైరా కంటే కూడా పాలేరుపై సీపీఐ(ఎం) ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో నేడు వెలువడే జాబితాపై ఆసక్తి నెలకొంది.

మాటలు హద్దు మీరితే వీపు మోత మోగుతుంది జాగ్రత్త



- బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు

నవతెలంగాణ-ఖమ్మం

మాటలు హద్దు మీరితే వీపు మోత మోగుతుంది జాగ్రత్త అని బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని బిఆర్ఎస్ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో తుమ్మల నాగేశ్వరరావు, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలో ఉండే నాయకులపై చెడు వ్యాఖ్యలు చేస్తారని, తుమ్మల నాగేశ్వరరావు ఒకటి ఆలోచించుకోవాలని, 6 నెలల క్రితం మీ ఆలోచనకు ఇప్పుడు ఏదో పెను మార్పులు జరుగుతాయని అనుకోవడం తప్పు అని అన్నారు. చాలా మంది బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మీ పార్టీలోకి వస్తారని పొంగులేటి అనుచరవర్గం ఆరోపణలు చేసి మిమ్మల్ని బలి పశువుల్ని చేస్తున్నారని తెలిపారు. అసలైన కాంగ్రెస్ నాయకులు తుమ్మల పంచన చేరడం లేదా మీరు ఏ పార్టీకి వెళ్తే ఆ పార్టీకి వచ్చే నాయకులే ఉన్నారా అని, మీ పార్టీకి ఖమ్మంలో అసలైన అభ్యర్థి ఎవరో ఇప్పటి వరకు కూడా తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తుమ్మల కుక్క తోక పట్టుకుని గోదారి ఈదినట్లుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. తుమ్మల నాగేశ్వరరావును చూస్తుంటే నాకు జాలి వేస్తుందని, జిల్లాలో కీలకమైన పాత్రవహించిన టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవన్ కుమార్ పై ఎన్ని కేసులు బనాయించారని, మీకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రస్థాయి మంత్రిని పట్టుకుని మతి తప్పి గతి తప్పి మాట్లాడుతున్నారని, అంటే మీ సభ్యత, సంస్కారం ఏంటో స్పష్టంగా అర్ధమవుతుందన్నారు. ఎవరెన్ని ఆరోపణలు చేసిన అధికారంలోకి వచ్చేది మాత్రం పువ్వాడ అజయ్. అతి త్వరలో మీకు స్పష్టత వస్తుందని అన్నారు.

బిఆర్ఎస్ నాయకులు

తాళ్లూరి జీవన్ కుమార్ మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్ కుమార్ పై తీవ్రమైన ఆరోపణలు చేశారని, చరిత్రపై అవగాహన ఉన్న ఏ వ్యక్తి అటువంటి వ్యాఖ్యలు చేయరని అన్నారు. దసరా పండుగ మహిళలు, పిల్లలు రోడ్లపైకి వచ్చి బతుకమ్మ ఆడుతున్నారని, నిజాం రాజు ఖాసిం రజ్వీతో పువ్వాడ అజయ్ ని పోల్చడాన్ని మేము ఖండిస్తున్నామని అన్నారు. గడచిన ఈ 9 ఏళ్లలో శాంతి భద్రతలు క్షీణించి ప్రజలు మనుగడ సాధించలేనట్లుగా తుమ్మల వ్యాఖ్యలు సబబు కాదన్నారు. పొంగులేటి రెండు నెలల క్రితం ఖమ్మం నియోజకవర్గంలో పువ్వాడ మీద బచ్చా గాడిని పెట్టి ఒడిస్తా అని అన్నారు. అంటే 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి ముందు బచ్చా నాయకుడా..? ఆ బచ్చా ఎవరో ప్రజలకు తెలియచెప్పాలని అన్నారు. పొంగులేటి నీడన తుమ్మల నాగేశ్వరరావు రాజకీయాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ మాట్లాడుతూ మిక్కిలినేని మంజుల మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, నిత్యం మంత్రి నామస్మరణం చేసే బదులు రామ నామస్మరణ చేస్తే పుణ్యం అన్నా వస్తుంది తల్లీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ఒక్కరి కూడా అక్రమ కేసు బనాయించలేదు అంటున్నారని, మీ భర్త మిక్కిలినేని నరేందర్ మీద నాడు తుమ్మల నాగేశ్వరరావు కేసు బనాయిస్తే మేమంతా ధర్నాలు చేశామని, అది గుర్తుంచుకో తల్లీ.. ఇల్లందు సర్కిల్ లో పెద్ద ఎత్తున రాత్రి అని కూడా చూడకుండా ధర్నా చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో మీ భర్త మీద రౌడీ షీటర్ ఓపెన్ చేశారని, మీ భర్త మీద రౌడీ షీటర్ ఓపెన్ చేసింది బీఆర్ఎస్ పార్టీ కాదు. ఇప్పుడు మీరున్న కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. మిక్కిలినేని మంజుల.. మంత్రి పువ్వాడ ను విమర్శించే స్థాయి నీది కాదు. కొంచం చుస్కొని మాట్లాడు.. మేం కూడా మాట్లాడగలం అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్‌కేవి రాష్ట్ర నాయకుడు పాల్వంచ కృష్ణ, షకీన, జక్కుల లక్ష్మయ్య, గొల్లపూడి హరికృష్ణ, మహేష్, నరేష్, శంకర్రావు, గంటా భీమయ్య పాల్గొన్నారు..

కోడి పందాల స్థావరంపై దాడి ఆరుగురిపై కేసు

నవతెలంగాణ-వైరా

మండలంలోని లింగన్న పాలెం గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై వైరా ఎస్ఐ మేడా ప్రసాద్ సిబ్బందితో మంగళ వారం సాయంత్రం దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుండి కోడి పుంజులు, 15,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కందాళ ప్రచార రథానికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి తన ప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేయించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి ఆలయంలో ఎన్నికల ప్రచార రథానికి ఎమ్మెల్యే సతీమణి విజయమ్మ, కూతురు దీపిక, కుటుంబ సభ్యులు సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం సాయిగణేశ్ నగర్ లోని క్యాంపు కార్యాలయం వద్ద తన వాహనాలకు అన్నింటికి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి తన కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు,అభిమానులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైరా బీఆర్ఎస్ కోటకు బీటలు

- మచ్చా ఇంటికి పొంగులేటి

నవతెలంగాణ-వైరా

వైరా నియోజక వర్గంలో బిఆర్ఎస్ కోటకు బీటలు వారుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించక ముందే కాంగ్రెస్ పార్టీలో పలువురు బిఆర్ఎస్ నాయకులు చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మండలంలోని సిరిపురం (కెజి) గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు, మచ్చా నరసింహా రావు, ఆయన తనయుడు మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వరరావు (బుజ్జి) ఆహ్వానం మేరకు మాజీ ఎంపి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మచ్చా ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మండల బిఆర్ఎస్ నాయకులు మచ్చా నరసింహా రావు, మచ్చా బుజ్జి, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బిడికె రత్నం, సిరిపురం సర్పంచ్ భర్త మట్టూరి నాగేశ్వరరావు, పుణ్య పురం సర్పంచ్ గద్దె మల్లి ఖార్జున రావు, వైరా మునిసిపాలిటీ 9, 10 వార్డు కౌన్సిలర్స్ సూర్య దేవర వింధ్యా రాణి, కర్నాటి నందిని భర్తలు సూర్యదేవర శ్రీధర్, కర్నాటి హనుమంతరావు, దాచాపురం మాజీ సర్పంచ్ శౌరి, తూము కోటేశ్వర రావు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరుటకు సంసిద్ధత తెలిపారు. వీరితో పాటు మండలంలోని మరి కొంత మంది సర్పంచ్‌లు ఎంపీటీసీలు మునిసిపల్ కౌన్సిలర్స్ బిఆర్ఎస్‌ను వీడెందుకు సిద్ధంగా ఉన్నారని, నియోజక వర్గానికి అభ్యర్థిని ప్రకటించిన వెంటనే మరో సారి మండలంలో కార్యక్రమం ఏర్పాటు చేసి భారీ చేరికలకు సిద్ధం చేస్తున్నామని మచ్చా బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తధ్యమని, కెసిఆర్ కుటుంబ పాలనకు చరమగీతం తప్పదని



అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 10 స్థానాలు గెలుచుకోవడం కూడా తధ్యం అన్నారు. వైరా నియోజక వర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థే రంగం లో ఉంటారని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన కెసిఆర్, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా నియోజక వర్గంలో కాంగ్రెస్ టిక్కెట్ రేసులో ఉన్న బానోత్ విజయా బాయి, పనితి సైదులు, సిరిపురం పరిసర గ్రామాల కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

27 నుంచి నియోజక వర్గ స్థాయి సమావేశాలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న ప్రభుత్వాలను గద్దె దింపేందుకు కార్యకర్తలు సంసిద్ధులు కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించలేని పాలకులను గద్దె దింపేందుకు రానున్న ఎన్నికల్లో సిపిఐ కార్యకర్తలు పని చేయాలని ఆయన కోరారు. సిపిఐ కౌన్సిల్ కార్యవర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను విడుదల చేశారు. బీఆర్ఎస్, బిజెపిలకు వ్యతిరేకంగా కార్యకర్తలను సన్నద్ధం చేసే క్రమంలో ఈనెల 27 నుంచి నియోజక వర్గ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ కార్యాచరణను పార్టీ శ్రేణులకు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 27న సత్తుపల్లి నియోజక వర్గ సమావేశం 29న ఖమ్మం, 30న వైరా, 31న పాలేరు సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర, జిల్లా సిపిఐ బాధ్యులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల వైద్య పరీక్షల నిర్వహణ ప్రక్రియ వాయిదా

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణలో పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా జిల్లాలో బుధవారం నుండి జరగవలసిన కానిస్టేబుల్ అభ్యర్థుల వైద్య పరీక్షల నిర్వహణను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి సూచన మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ ఓ ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థులు గమనించగలరని సూచించారు.



వెంకటేశ్వర్లు పోరాట స్ఫూర్తి ఆదర్శం

28వ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం

నవతెలంగాణ-ముదిగొండ

పీడిత, తాడిత ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించిన అమరజీవి వీరబోయిన వెంకటేశ్వర్లు పోరాట స్ఫూర్తి పలువురికి ఆదర్శమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అన్నారు. మండలపరిధిలో కట్టకూరు గ్రామ సీపీఐ(ఎం) నాయకులు అమరవీరుడు వీరబోయిన వెంకటేశ్వర్లు 28వ వర్ధంతిని ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర్లు పార్టీయే శ్వాసగా ఉద్యమమే ఊపిరిగా పని చేశారన్నారు. వెంకటేశ్వర్లు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరాంకితం కావాలన్నారు. భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటంలో వెంకటేశ్వర్లు పాత్ర ఎనలేనిదన్నారు.అనంతరం వెంకటేశ్వర్లు చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ మంకెన దామోదర్, సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న,పద్మ వేల్పుల భద్రయ్య, కందుల భాస్కరరావు,బట్టు రాజు,నెమిలి సైదులు,గ్రామ నాయకులు కొమ్ము సామేలు, పాల్గొన్నారు.

మందిరం వద్ద 'రావణ' సంహారం

నవతెలంగాణ-సత్తుపల్లి



దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా స్థానిక జవహర్ నగర్ కష్ణ మందిరం వద్ద రావణ సంహార కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రావణ చిత్రపటాన్ని అగ్నితో ఏర్పాటు చేసిన బాణంతో దహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అద్దంకి అనిల్ కుమార్, ఆలయ కమిటీ బాధ్యులు వెంకటేశ్వరరావు. శ్రీనివాసరావు, జవహర్ నగర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'శ్రీజ్ఞాన సరస్వతీ దేవి' ఆలయంలో దసరా సంబురాలు

- కోర్కెలు నెరవేర్చాలంటూ జమ్మిచెట్టుకు పూజలు
- సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణ శివారులోని శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆఖరిరోజు దసరా పర్వదినం సందర్భంగా అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా ఆలయం వద్ద ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన జమ్మిచెట్టుకు భక్తులు ప్రదక్షిణలు చేస్తూ కోర్కెలు నెరవేర్చాలంటూ శమీపూజలు చేశారు. జ్ఞానసరస్వతి, లలిత, గాయత్రి అమ్మవార్ల ఎదుట తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలను జరిపించారు. నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రతిరోజు అమ్మవార్లకు వివిధ రూపాల్లో అలంకరణలు చేస్తూ లలితా సహస్రనామార్చనలు, కుంకుమపూజలు, మంగళ ఊరేగింపు తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొడిమెల అప్పారావు, సోమరాజు లక్ష్మీనరసింహారావు, గౌరవ అధ్యక్షుడు కంకిపాటి జగన్మోహనరావు, బాధ్యులు మాదిరాజు పుల్లారావు, ఎంఎస్ఆర్ శర్మ అలవాల శ్రీనివాసరావు, ఊటుకూరు వినోదరావు, పీవీ రమణారావు, మల్లికార్జునరావు, సోమరాజు శివరాం ప్రసాద్ (రామప్ప) పాల్గొన్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో దసరా పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

వీవీసీ అధినేత రేఖల భాస్కర్‌ని కలిసి తుమ్మల

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ప్రముఖ విద్యా సంస్థల (వివిసి) అధినేత రేఖల భాస్కర్ ని వారి నివాసం లో మాజీ మంత్రి, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తుమ్మల నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎంఏ ఖయ్యూం, స్వామి రమేష్ కుమార్, కాంపాటి పిచ్చయ్య, గుర్రం తిరుమలరావు, వడ్డెబోయిన నర్సింహారావు, కార్పొరేటర్లు నాగండ్ల దీపక్ చౌదరి, కమర్తపు మురళి, చావా నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన తారా

నవతెలంగాణ-ఖమ్మం

రఘునాథ పాలెం మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బానోత్ తారా మాజీ మంత్రి, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ తార రాజకీయ భవిష్యత్తుకు నాది హామీ అని అన్నారు. బానోత్ తార మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీ కోసం ఎంతో కష్ట పడ్డాను, మంత్రి అజయ్ గెలుపులో కీలక పాత్ర పోషించాను కానీ ఇప్పటివరకు నాకు పార్టీలో ఎటువంటి ప్రాధాన్యత కల్పించక పోగా అనేక అవమానాలకు గురిచేశారని అన్నారు. అందుకే వారి ఒంటెద్దు పోకడలకు విసుగు చెంది పార్టీకి రాజీనామా చేసి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరానని తెలిపారు.

15వ డివిజన్ లో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మాజీ మంత్రి, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం మంగళవారం స్థానిక 15వ డివిజన్ అల్లిపురం గ్రామం నుండి కార్పొరేటర్ రావూరి సైదుబాబు ఆధ్వర్యంలో దాదాపు 300 వందల మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు . వారికి తుమ్మల నాగేశ్వరరావు ,మాజీ ఎంఎల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వాళ్ళలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సంక్రాంతి నాగేశ్వరరావు, యనిగండ్ల నాగేశ్వరరావు, పత్తిపాటి వీరభద్రం, చల్లగండ్ల నాగేశ్వరరావు, యనిగండ్ల సత్యనారాయణ, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ముప్పారపు బాలకృష్ణ, ముప్పారపు సైదులు, సామినేని సైదులు,సామినేని ముత్తయ్య, గద్దల నాగేశ్వరరావు,గుండె నాగరాజు,మందా శ్రీను, కత్తి శంకర్, మామిల్లపల్లి నాగేశ్వరరావు, శ్రీరాముల సైదులు పార్టీలో చేరాయి.

నవతెలంగాణ

తెలంగాణ ఎన్నికల్లో కచ్చితంగా పోటీచేస్తాం

- విషప్రచారాన్ని నమ్మొద్దు
- త్వరలో అభ్యర్థుల ఖరారు
- టీడీపీ నేతల స్పష్టీకరణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కచ్చితంగా పోటీచేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేశారు. పోటీచేయడం లేదంటూ ప్రచారం చేయడాన్ని ఖండించారు. వదంతులు, అబద్దాలను ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కివస్తుందని తెలియజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో తెలుగుదేశం తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శులు షేక్ ఆరీఫ్, వి జీ నాయుడు, అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌నాయుడు, రామేశ్వర్‌రావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం పోటీలో ఉండకూడదన్న కుట్ర కోణంలో ఇలాంటి తప్పుడు వార్తా కథనాలను మీడియాలో ప్రసారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మనోభావాలు దెబ్బతీసేందుకే కుట్ర జరిగిందని విమర్శించారు 119 నియోజకవర్గాలకు సంబంధించి ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకున్నామన్నారు. అధ్యక్షులు జ్ఞానేశ్వర్‌ను సంప్రదించి వివరాలు అడిగి రాయాలనీ, ప్రసారం చేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ బలపడితే తాము ఎక్కడ దెబ్బతింటామోననే భయమే కొన్ని రాజకీయ పార్టీలు తమపై వదంతులు సష్టిస్తున్నాయన్నారు.

రక్షణ మంత్రిని తొలగించిన చైనా !

తైపే : రక్షణ మంత్రి జనరల్ లీ షాంగ్ఫూను చైనా తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వ రంగ సిసిటివి పేర్కొన్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. దాదాపు రెండు నెలల నుండి షాంగ్ఫూ ప్రజాబాహుళ్యంలో కనిపించడం లేదని, అందువల్లే ఆయనను తొలగించినట్లు తెలుస్తోందని మీడియా పేర్కొంది. ఈ ఏడాదిలో ప్రజాబాహుళ్యంలో కనిపించని కారణంలో విధుల నుంచి తొలగింపునకు గురైన రెండో సీనియర్ చైనా అధికారి లీ. అంతకుముందు మాజీ విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ కూడా ఇలాగే తొలగింపునకు గురయ్యారు. గత మార్చిలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ సందర్భంగా లీని రక్షణ మంత్రిగా తీసుకున్నారు. ఆగస్టు 29న ఒక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన అనంతరం ఆయన బహిరంగంగా కనిపించలేదు.

కార్పొరేట్ ఏజెంట్లకు సీట్లు

- మావోయిస్టు బీకేఏఎస్‌ఆం డివిజన్ కార్యదర్శి ఆజాద్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల్లో కార్పొరేట్ ఏజెంట్లకు సీట్లు ఇస్తున్నారని సీపీఐ(మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పువ్వాడ అజయ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరూ కార్పొరేట్ రాజకీయ నాయకులేనని పేర్కొన్నారు. వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్న వీరి పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

బైజూస్ సిఎఫ్‌ఒ అజయ్ గోయల్ రాజీనామా

- తిరిగి వేదాంత గూటికి..

న్యూఢిల్లీ : ఆర్థిక ఇబ్బందులు, ఎకౌంట్ కష్టాల్లో ఉన్న బైజూస్‌కు అత్యంత కీలకమైన అధికారి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్‌ఒ) అజయ్ గోయల్ రాజీనామా చేశారు. కరోనా కాలంలో ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మైనింగ్ దిగ్గజం వేదాంత గ్రూపు నుంచి ఈ ఏడాది ఏప్రిల్‌లో వచ్చిన అజయ్ తిరిగి ఆ సంస్థ గూటికే చేరారు. వేదాంతలోనూ సిఎఫ్‌ఒగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నెల 30 నుంచి అజయ్ విధుల్లో చేరతారని వేదాంత వెల్లడించింది. కంపెనీ పునర్ వ్యవస్థీకరణ ప్రణాళిక కీలక దశలో ఉన్న తరుణంలో ఆయన పునరాగమనం సంస్థ వృద్ధికి దోహదం చేసే అవకాశం ఉందని పేర్కొంది.


పుతిన్ ఆరోగ్యంగా ఉన్నారు

- అస్వస్థత వార్తలను కొట్టిపారేసిన క్రెమ్లిన్

మాస్కో : రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ అస్వస్థతకు గురయ్యారన్న వార్తలను క్రెమ్లిన్ మంగళవారం తిరస్కరించింది. బహిరంగంగా కనిపించాల్సిన సమయాల్లో పుతిన్ బదులు వేరొక వ్యక్తి కనిపించేలా ఏర్పాట్లు చేసుకున్నారంటూ వస్తున్న పుకార్లను కొట్టిపారేసింది. 'ఆయన చక్కగా వున్నారు. ఈ పుకార్లన్నీ కేవలం బూటకమే" అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు. ఆదివారం సాయంత్రం పుతిన్ తీవ్రమైన అస్వస్థతకు గురయ్యారంటూ పశ్చిమ దేశాల మీడియా ఇచ్చిన వార్తను రష్యన్ టెలిగ్రామ్ చానల్ ప్రస్తావించడం గురించి ప్రశ్నించగా ఆయన పై రీతిన బదులిచ్చారు. పుతిన్ బదులు ఆయనను పోలిన మరో వ్యక్తి బహిరంగ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటూ అడిగిన ప్రశ్నకు పెద్ద పెట్టున నవ్వుతూ తిరస్కరించారు. "ఇది అసంబద్ధ, బూటకపు సమాచార మాధ్యమాలకు చెందినది. మీడియా మొత్తంగా దీనిపై చర్చిస్తుంది. ఇవి వింటుంటే నవ్వే వస్తుంది." అని పెస్కోవ్ ప్రతిస్పందించారు. ఈ నెల 7న 71వ సంవత్సరంలోకి అడుగిడిన పుతిన్ అనేక సభలు, సమావేశాల్లో పాల్గొంటూ తీరికలేని షెడ్యూల్‌తోత వున్నారు. అనేకమంది ఆయన్ని టివిల్లో చూస్తూనే వుంటారు. గత వారమే చైనాలో కూడా పర్యటించారు. 2020లో ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ తనపై వచ్చిన పుకార్లను కొట్టిపారేశారు.

నెతన్యాహుపై చర్యలు తీసుకోవాలి

- అంతర్జాతీయ న్యాయ స్థానం ఎదుట భారీ ప్రదర్శన



ది హేగ్ : గాజాలో యుద్ధనేరాలకు పాల్పడినందుకు గాను ఇజ్రాయిల్ ప్రభుత్వాధినేత బెంజమిన్ నెతన్యాహుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంతర్జాతీయ న్యాయ స్థానం ప్రవేశమార్గం ఎదుట పాలస్తీనా అనుకూల కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో, గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ అడ్డూ అదుపు లేకుండా బాంబు దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ ప్రదర్శన జరిగింది. కాగా ప్రదర్శనలో పాల్గొన్న 19 మంది కార్యకర్తలను డచ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం దాటగానే అంతర్జాతీయ న్యాయస్థానం ఎదురుగా గల వంతెనను పాలస్తీనా అనుకూల కార్యకర్తలు స్వాధీనంలోకి తీసుకున్నారు. 'నెతన్యాహు యుద్ధ నేరస్తుడు' అంటూ పతాకాలు చేబూనారు. క్లైమేట్ ఎమర్జెన్సీ యాక్టివిస్ట్ గ్రూప్ డచ్ శాఖకు చెందిన కార్యకర్తలు అక్టోబరు 7 నుండి పాలస్తీనా అనుకూల కార్యాచరణ చేపడుతునే వున్నారు. అయితే ఈ ప్రదర్శన వల్ల ఐసిసి సాధారణ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని ఐసిసి ప్రతినిధి సోనియా రొబ్లా తెలిపారు. అదుపులోకి తీసుకున్న 19మందిని విడుదల చేసిన తర్వాత, ఐసిసి గ్రౌండ్స్ వెలుపల పాలస్తీనా అనుకూల నిరసనల్లో వారు పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్స్ యాతన

వేతనాలు రాక ఆరు నెలలుగా పస్తులు

- హైకోర్టు ఆర్డరిచ్చిన 170 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి
- అయినా స్పందించని పాలకులు

నవ తెలంగాణ– మహబూబ్ నాగర్ ప్రాంతీయ ప్రతినిధి



అతిథి అధ్యాపకుల గోస ఎవరికి పట్టడం లేదు. శాసనసభ ఎన్నికల సందర్భంగా అమలు కాని హామీలు ఇస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. అధికార పార్టీ ఒక అడుగు ముందుకేసి హామీల వర్షం గుప్పిస్తున్నది. ఉన్నత విద్యను అందించే అధ్యాపకులను మాత్రం తెలంగాణ పాలకులు మరిచిపోయారు. ఆరు నెలలుగా వేతనాలు లేక బతుకులు దుర్భరంగా గడుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 170 మందిని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు చెప్పినా ఉలుకూ పలుకూ లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయకపోతే వచ్చే ఎన్నికల్లో సత్తా ఏంటో చూయిస్తామని గెస్ట్ లెక్చరర్స్ హెచ్చరిస్తున్నారు.

6 నెలలుగా జీతాలు లేవు

"పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. గెస్ట్ లెక్చరర్స్ గోస ప్రభుత్వానికి పట్టదా" అని ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగ భద్రత, 12 నెలల కన్సాలిడేటేడ్ పే చెల్లించాల్సిన పాలకులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ కాలేజీల దాటికి కుదేలైపోతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గెస్ట్ లెక్చరర్స్ సమర్థవంతంగా పనిచేస్తూ ఇంటర్ విద్య బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ట్రైమ్‌కు జీతాలు రాకపోయినా విద్యార్థుల సంఖ్య పెంచడం, రికార్డు స్థాయిలో రిజల్ట్స్ తెప్పిస్తూ ప్రభుత్వ కళాశాల అభ్యున్నతికి తోడ్పడుతున్నారు. రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పదేండ్లుగా 1654 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. 2023-24 ఇంటర్ అకాడమిక్ ఇయర్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 6 నెలలుగా జీతాలు లేక జీవితాలు దుర్భరంగా మారి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. తక్షణమే రాష్ట్రంలో గెస్ట్ లెక్చరర్స్‌కు జీతాలు చెల్లించాలని అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినా పాలకులకు చీమ కుట్టినట్లయినా లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వెంటనే జీతాలు అందిస్తామని హామీనిచ్చినా.. ఇప్పటికీ అమలుకాలేదు. 6 నెలలైనా జీతాలు లేక పండుగ పూట పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, హైకోర్టు ఆర్డరిచ్చిన 170 మంది గెస్ట్ లెక్చరర్స్‌ని ఇంకా విధుల్లోకి తీసుకోలేదు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. డిగ్రీ, పీజీ కళాశాల్లో పనిచేసే వారికి సైతం నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. "నెల రోజులు వేతనం రాకుంటేనే పూట గడవని పరిస్థితులున్నాయి. నెలల తరబడి వేతనాలు రాకుంటే జీవనం సాగేది ఎలా" అని గెస్ట్‌లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అద్దె, పాల బిల్లు, స్కూలు ఫీజులు, వైద్యం ఖర్చులు, రవాణా చార్జీలు.. ఇలా కుటుంబ నిర్వాహణ మొత్తం తడిసి మోపెడవుతున్నది. ఒకటో తారీఖు రాగానే అప్పులోళ్లు ఇంటికి క్యూ కడుతున్నారు. జీవితం ఎలా సాగించాలో తెలియని దుర్భరంగా బతుకుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు చెల్లించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు ఇవ్వడంలో వివక్ష

అతిథి అధ్యాపకులుగా ప్రభుత్వ కళాశాలల్లో అనేక సేవలు అందిస్తూ కార్పొరేట్ కాలేజీలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.

సేవలు చేయించుకుంటూ వేతనాలు ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారు. ఆరు నెలలుగా వేతనాలు రాక అధ్యాపకులు ఉపవాసాలు ఉంటున్నారు. దసరా పండుగ సందర్భంగా ఆయినా జీతాలిస్తారని ఆశించాం. ఇప్పటికైనా జీతాలు చెల్లించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.



గూల్ల రమేష్, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, పాలెం

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు పెంచింది. కార్పొరేట్ స్థాయిలో సేవలందిస్తున్న ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు మాత్రం నెలసరి వేతనాలు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నెలసరి వేతనం ఇచ్చి ఆదుకోవాలి. హైకోర్టు చెప్పినట్టుగా 170 మందిని అధ్యాపకులను విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలి.



ఐలు సదానందం గౌడ్, అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు

టికెట్ల కేటాయింపుల్లో అభ్యంతరాలుంటే...

అంతర్గత వేదికలో మాత్రమే మాట్లాడండి

- ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీ ఖాన్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

అసెంబ్లీ టికెట్ల కేటాయింపుల విషయంలో ఏమైనా విభేదాలుంటే, పార్టీ అంతర్గత వేదికల మీద మాత్రమే మాట్లాడాలని ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ పార్టీ నేతలకు విజ్ఞప్తి చేశారు. పార్టీ టికెట్ల కేటాయింపుల విషయంలో ఇంకా సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. టికెట్ల కేటాయింపుల వ్యవహారం ఇంకా ముగియలేదన్నారు. టికెట్ల కేటాయింపులపై పార్టీకి వ్యతిరేకంగా కానీ, నాయకులకు వ్యతిరేకంగా కానీ బహిరంగంగా మాట్లాడవద్దని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ టికెట్ల కేటాయింపుల విషయంలో కొందరు నాయకులు ప్రెస్‌మీట్స్ పెట్టి మాట్లాడుతున్నారని చెప్పారు. అలా చేయడం పార్టీ విధానాలకు వ్యతిరేకమన్నారు. ఎలాంటి సమస్యలున్నా పార్టీ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరానికి కోట్లు దుబారా :బక్క జడ్సన్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కోట్ల రూపాయలను దుబారా చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఏఐసీసీ సభ్యులు బక్క జడ్సన్ పిండ ప్రదానం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకున్నారని ఆరోపించారు. రీడిజైన్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నేటికి మన కండ్ల ముందు పటిష్టంగా కనపడుతున్నదని గుర్తు చేశారు.



తనిఖీల పేరుతో సామాన్యులను ఇబ్బందిపెడుతున్నారు : టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే పోలీసులు తనిఖీలు చేస్తూ...డబ్బు సీజ్ చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టకుండా డబ్బు కట్టడి చేయమని ఎన్నికల సంఘం చెప్పింది తప్ప రోడ్ల మీద తనిఖీలు చేసి సామాన్య ప్రజలకు ఇబ్బందులు పెట్టమని కాదని చెప్పారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు ఓటర్లను ప్రలోభ పెట్టడం కోసమైతే డబ్బు సీజ్ చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. డబ్బు, బంగారం బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళితే, అక్కడ అధికారులు స్వాధీనం చేసుకుని చెక్ పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని అధికారులు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన లేఖ రాశారు.

ఈనెల 31న కొల్లాపూర్‌లో ప్రజాభేరి సభ మహేష్ కుమార్ గౌడ్

ఈనెల 31న కొల్లాపూర్‌లో పాలమూరు ప్రజా బేరి బహిరంగ సభ నిర్వహిస్తామని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరుకానున్నట్టు తెలిపారు. ఢిల్లీ నుంచి ఆమె శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని చెప్పారు. అక్కడి నుంచి నేరుగా కొల్లాపూర్ సభకు బయలుదేరుతారని వివరించారు. నిజామాబాద్ అర్బన్ టిక్కెట్ ఎవరికి కేటాయించాలనేది స్క్రీనింగ్ కమిటీ నిర్ణయిస్తుందన్నారు. రెండవ విడత సీట్ల జాబితాలో బలమైన అభ్యర్థులందరికీ టికెట్లు వస్తాయన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్ స్థానాలను మైనార్టీలు ఆశిస్తున్నట్టు తెలిపారు.

28 నుంచి రెండో విడత బస్సు యాత్ర

రాష్ట్రంలో రెండో విడత కాంగ్రెస్ బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఒకటి వరకు బస్సు యాత్ర జరగనుంది. ఈ యాత్రలో రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాల్గొననున్నారు. ఈనెల 28, 29 తేదీల్లో బస్సు యాత్రలో సిద్ధరామయ్య పాల్గొంటారు. ఈనెల 30, 31 తేదీల్లో ప్రియాంక గాంధీ.. వచ్చే నెల ఒకటిన రాహుల్ గాంధీ పాల్గొంటారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బస్సు యాత్ర సాగేలా పీసీసీ ప్లాన్ చేసింది. ఉమ్మడి మెదక్, మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో రెండో విడత బస్సు యాత్ర సాగనుంది.

జైల్లో కిరాతకులుండాలి.. చంద్రబాబు కాదు

- ఉపవాస దీక్షలో మోత్కుపల్లి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

'చంద్రబాబును అక్రమంగా నిర్బంధించి జైలులో పెట్టారు..జైలులో కిరాతకులుండాలి..ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన చంద్రబాబు కాదు..జగన్, మీరు జైలులో ఉండి వస్తే అందరూ జైలుకు పోవాలా ? చంద్రబాబు అరెస్ట్‌తో తెలుగు ప్రజలు అల్లాడిపోతున్నారని" మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న తన నివాసంలో చంద్రబాబుకు మద్దతుగా దసరా వేడుకలకు ఆయన దూరంగా ఉంటూ ఉపవాస దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ చంద్రబాబుకు బెయిల్ రాకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆయన్ను మానసిక క్షోభకు గురిచేయడం అన్యాయమని వ్యాఖ్యానించారు. ఏపీ సీఎం జగన్ రాజ్యంలో ఎవరైనా సుఖంగా ఉన్నారా ? రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయిందని అభిప్రాయపడ్డారు. జగన్..ఇక మీ ఆటలు సాగవనీ, మీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. మీ నాన్న పాలించినా ఇంత కుట్ర చేయలేదని గుర్తు చేశారు. ప్రజలు జగన్ ఆటకట్టిస్తారనీ, డాక్టర్ సుధాకర్‌ను చంపిన పాపం జగన్‌దేనని అన్నారు. పేద ప్రజలు ఉచ్చిన అధికారాన్ని ఆయన దుర్మార్గంగా ఉపయోగించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరుదు సోదరులకు స్టాలిన్ నివాళి

- 'గాడ్సే గ్యాంగ్'పై విమర్శలు



చెన్నై : స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల వర్థంతి సందర్భంగా మంగళవారం వారి విగ్రహాలకు పూలమాలలు వేసి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ 'గాడ్సే గ్యాంగ్'పై విమర్శలు గుప్పించారు. మహాత్మాగాంధీపై చివరి రోజుల్లో విషపూరితమైన విమర్శలు చేసి ఇప్పుడు వీరు అకస్మాత్తుగా జాతీయవాదులుగా మారిపోయారని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళ ప్రముఖ మహాకవి భారతియార్ వీరిని 'యాక్టింగ్ స్వదేశీస్'గా విమర్శించారని స్టాలిన్ గుర్తు చేశారు. తమిళనాడులో స్థానిక స్వాతంత్ర్య సమరయోధులను విస్మరించారని గవర్నర్ ఆర్‌ఎన్ రవి సోమవారం చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ స్టాలిన్ ఈ ప్రతివ్యాఖ్యలు చేశారు. మంత్రులు ఎంపి సామినాథన్, మా సుబ్రమణియన్, చెన్నై మేయర్ ఆర్ ప్రియ, దక్షిణ చెన్నై ఎంపి తమిజాచి తంగపాండియన్, పలువురు ఉన్నతాధికారులు కూడా మరుదు సోదరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

జమ్ముకాశ్మీర్ ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

శ్రీనగర్ :జమ్ముకాశ్మీర్ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య రంగానికి వెన్నెముకగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల నిజమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి సిపిఎం నాయకులు మహ్మద్ యూసఫ్ తరిగామి మంగళవారం విజ్ఞప్తి చేశారు. అరకొర వేతనాలకు పనిచేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. వేతనాలు పెంచాలని కొంతకాలంగా ఆశా వర్కర్లు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

దీంతో సమ్మెలు, ధర్నాలకు దిగాల్సి వస్తోందని, అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదని వాపోయారు. జమ్ముకాశ్మీర్‌లోని ప్రతి జిల్లాలో ఆశా వర్కర్లు ఇటీవలే పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. ఆశాల డిమాండ్లను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేస్తామని ప్రభుత్వ అధికారులు హామీ ఇవ్వడంతో వీరంతా నిరసనలను విరమించారు. కానీ స్థానిక ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. అదే విధంగా ఐసిడిఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు, సూపర్‌వైజర్లకు గత కొన్ని నెలలుగా వేతనాలు సైతం నిలిపివేశారు. దీంతో వీరంతా తమ కుటుంబాలను పోషించుకోవడానికి నానాయాతన పడుతున్నారు. కష్టపడి పని చేసినా సకాలంలో వేతనాలు అందక వీరంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీరికి వేతనాలు చెల్లించాలని, ఇతర డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తరిగామి డిమాండ్ చేశారు.

తాయిలాల్లోనే అందలం.. సీట్లలో కాదు...

- మహిళల పట్ల పార్టీల తీరిది
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మేనిఫెస్టోల్లో వారికే ప్రాధాన్యత
- టిక్కెట్ల కేటాయింపులో మాత్రం వివక్షే

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్





ఇటీవల పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టినప్పుడు ఇటు బీఆర్‌ఎస్.. అటు కాంగ్రెస్... ఆ బిల్లు గురించి పుంఖాను పుంఖాలుగా మాట్లాడాయి. వారికి చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాలంటూ నినదించాయి. ఇది జరిగిన కొద్ది రోజులకే రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైంది. ఈ క్రమంలో మహిళలపై హామీల వర్షం కురిపించిన ప్రధాన పార్టీలు... టిక్కెట్ల కేటాయింపులో మాత్రం వారి జనాభా, వాటాకు తగ్గట్టు న్యాయం చేయకపోవటం గమనార్హం. తొలుత ఆరు గ్యారెంటీలతో హస్తం పార్టీ ముందుకొచ్చింది. అందులో మహిళలకు సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉన్నాయి. మహాలక్ష్మి పథకం పేరిట నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, చేయూత పథకం కింద ఒంటరి మహిళలు, వితంతువులకు నెలకు రూ.4 వేల పింఛన్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర హామీలను ఆ పార్టీ ఇచ్చింది. ఆ తర్వాత అధికార బీఆర్‌ఎస్ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. మహిళలపై వరాల జల్లు కురిపించింది. సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన పేద మహిళలకు ప్రతి నెలా రూ.3 వేల చొప్పున భృతి చెల్లింపు, ఆసరా పింఛన్లు రూ.5 వేలకు పెంపు, రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు స్వశక్తి భవనాల నిర్మాణం తదితర కీలకాంశాలు దాంట్లో ఉన్నాయి.

కానీ టిక్కెట్ల కేటాయింపులో మాత్రం ఆ రెండు పార్టీలు... మహిళలను చిన్న చూపే చూశాయి. 115 మంది అభ్యర్థులతో తన తొలి జాబితా ప్రకటించిన బీఆర్‌ఎస్... అందులో ఆరు స్థానాలే మహిళలకు కేటాయించింది. కోవా లక్ష్మి (ఆసిఫాబాద్), పద్మా దేవేందర్ రెడ్డి (మెదక్), సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), గొంగిడి సునీత (ఆలేరు), బడే నాగజ్యోతి (ములుగు), బానోత్ హరిప్రియా నాయక్ (పినపాక) ఆ జాబితాలో ఉన్నారు. ఇవిగాక మెదక్ జిల్లా నర్సాపూర్ స్థానాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డికి కేటాయించే అవకాశాలున్నాయి. ఆ స్థానాన్ని కూడా కలుపుకుంటే బీఆర్‌ఎస్ నుంచి మొత్తం ఏడు స్థానాలు మహిళలకు దక్కినట్టవుతుంది. కానీ మొత్తం 119 స్థానాల్లో ఈ శాతం చాలా స్వల్పం.

ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ విషయంలో బీఆర్‌ఎస్‌తో పోల్చితే కొంత బెటర్‌గానే ఉన్నా... 55 మందితో విడుదల చేసిన తన తొలి జాబితాలో ఆరు స్థానాలనే మహిళలకు కేటాయించింది. ఉత్తమ్ పద్మావతి (కోదాడ), సునీతారావు (గోషా మహల్), ధనసరి అనసూయ (సీతక్క–ములుగు), సింగాపురం ఇందిర (స్టేషన్ ఘన్‌పూర్), సరితా తిరుపతయ్య (గద్వాల)కు ఈ జాబితాలో చోటు దక్కింది. ఆ పార్టీ ఇంకా 64 స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించాల్సి ఉంది.

ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం... రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26 జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇంకా చెప్పాలంటే 119 శాసనసభా నియోజకవర్గాల్లో 76 స్థానాల్లో వారి ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. ఆయా సీట్లలో మహిళలు ఎటు వైపు మొగ్గితే ఫలితం అటు వైపే ఉంటుంది. వృద్ధులు, యువకులు, పురుషులు ఎప్పుడూ స్థిరంగా ఉండి... ఒకే పార్టీకి ఓటేయబోరన్నది విశ్లేషకుల అభిప్రాయం. కానీ మహిళలు మాత్రం ఆలోచించి, ఆచితూచి తమ నాయకుడిని ఎన్నుకుంటారని వారు చెబుతుంటారు. ఒక స్థిర నిర్ణయం ద్వారా వారు గెలుపోటములను నిర్ణయిస్తారు. అలాంటి మహిళలకు రాజకీయాల్లోనూ, సీట్లలోనూ తగిన అవకాశాలు కల్పించకపోవటంపై ఇప్పుడు సర్వత్రా చర్చ కొనసాగుతోంది.



పిల్లలకు ఇవి నేర్పించండి

తల్లిదండ్రులందరూ పిల్లలను చాలా ప్రేమగా, అపురూపంగా పెంచాలని తాపత్రయ పడతారు. వారు జీవితంలో సరైన మార్గంలో వెళ్లాలని కూడా కోరుకుంటారు. అయితే కొంతమంది తెలియకుండానే పిల్లలను కొన్ని విషయాల్లో బాగా గారాబం చేయడం, కొన్ని విషయాల్లో మరింత కఠినంగా ప్రవర్తించడం చేస్తారు. దీని వల్ల చాలా సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందంటున్నారు మానసిక నిపుణులు. అలా సమస్యలు రాకుండా పిల్లలు క్రమశిక్షణతో పాటు చదువులో కూడా ఉన్నమైన స్థానానికి చేరేలా తీర్చిదిద్దడానికి కొన్ని చిట్కాలు చెబుతున్నారు. అవేంటో చూద్దాం...

పిల్లల ఎదుగదలను చూసి మురిసిపోని తల్లిదండ్రులు ఉండరు. అయితే తెలియకుండానే వాళ్లకి కొన్ని విషయాల్లో అతిగా స్వేచ్ఛను ఇస్తుంటారు. మరికొంతమంది పిల్లలకు అస్సలు స్వేచ్ఛ ఇవ్వకుండా ప్రతిదీ తాము చెప్పినట్లే చేయాలని విపరీతమైన ఒత్తిడి తెస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు మన మాట లెక్కచేయకపోవడం లేదా అతి క్రమశిక్షణ వల్ల యాక్టివ్‌గా లేకపోవడం వంటి దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉంది. దాంతో పిల్లలు తల్లిదండ్రుల మాట లెక్కచేయడం మానేసి వారికి నచ్చినరీతిలో వారు ఉంటారు. అంతేకాకుండా వారికొచ్చే చిన్న చిన్న ఇబ్బందులను కూడా మనతో షేర్ చేసుకోవడం తగ్గించి వారికి వారే సొంత నిర్ణయాలు తీసుకొని పెడదారిన పడే అవకాశం కూడా లేకపోలేదు.

పాజిటివిటీ పెంపొందించండి

మొదటగా పిల్లల్లో పాజిటివిటీ పెంచాలి. చదువులో గాని, ఆటల్లో గాని వారికి కావాల్సిన ప్రేరణను మనం వారికి అందించాలి. తద్వారా వారిలో ఏదైనా సాధించగలం అనే పాజిటివిటీ పెరుగుతుంది. ఇది వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరేందుకు చాలా ముఖ్యం. ప్రతీ విషయానికి వాళ్ల మీద చిరాకు పడడం అంత మంచిది కాదు. ఇది వారు చెడు మార్గం వైపు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది.

సహాయపడే గుణం..

పిల్లలకు చిన్నప్పటి నుండి సహాయపడే గుణాన్ని అలవాటు చేయాలి. చిన్నతనం నుండి వారిలో స్వార్థాన్ని నూరిపోయకూడదు. ఇతరుల అవసరాలకు స్పందించేలా వారిని ప్రోత్సహించాలి. దాంతో వారు అందరితో కలివిడిగా ఉంటూ స్నేహపూరిత వాతావరణాన్ని అలవాటు చేసుకుంటారు. తద్వారా వారు ఒంటరిగా ఉన్నామనే భావనను కోల్పోయి ఉత్సాహంగా ఉంటారు. కాబట్టి వారిలో ఏదో సాధించాలనే ఆశయంతో పాటు ఇతరులకు సహాయపడాలనే తపన కూడా ఉండేలా ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లల్లో లీడర్‌షిప్ క్వాలిటీస్ కూడా పెరుగుతాయి.

అనవసరంగా కోపగించుకోవడం

కొన్ని సందర్భాల్లో పిల్లలపై తెలియకుండానే కోపాన్ని ప్రదర్శిస్తాం. ఉదాహరణకు వారు మన కండ్ల ముందే ఏదైనా గోడ ఎక్కడం లేదా ప్రమాదకర వస్తువులతో ఆడుకోవడం వంటివి చేసినప్పుడు పట్టరాని కోపం వస్తుంది. అయితే ఇలాంటి సందర్భాలలో మనం కొంచెం నిగ్రహంగా ఉంటూ వారిని దగ్గరకు తీసుకొని అలా చేయకూడదని నెమ్మదిగా చెప్పాలి. దాని వల్ల జరిగే అనర్థాలను పిల్లలకు వివరించాలి. మనం ఎంత ఎక్కువ వారి మీద కోపం పెంచుకుంటే వారు అంత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంది. వారి అలవాటును మనం వ్యతిరేకిస్తే పిల్లలు సహించలేరు. అందుకే ముందుగా వారితో మంచిగా మాట్లాడి మచ్చిక చేసుకోవాలి.

చిన్న చిన్న బాధ్యతలు అప్పగించండి

పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు వారి చదువుకే ప్రాధాన్యం ఇస్తారందరూ. ఎంత చదివితే అంతర ప్రయోజనం అని భావిస్తారు. అయితే పిల్లలకు చదువుతోపాటు ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలను కూడా అప్పజెప్పాలి. దీనివల్ల వారిలో కృషి, పట్టుదల పెరిగి సంఘంలో ఎలా నడుచుకోవాలో చిన్నప్పటి నుండే తెలుస్తుంది. రోజూ మన ఇంటిలో ఉండే కొన్ని బాధ్యతలను వారు క్రమం తప్పకుండా నిర్వర్తించేలా వారిని ప్రేరేపించాలి.



కోపం తగ్గించుకోవడానికి చిట్కాలు

- అత్యవసరమయితే తప్ప పిల్లలపై కోపం తెచ్చుకోకూడదు
- కోపం తగ్గకపోతే కొంత సమయం పాటు అక్కడి నుండి వేరే దగ్గరకు వెళ్లి కోపం తగ్గాక తిరిగి రండి.
- మీకు కోపం వచ్చినప్పుడు ఐదు సార్లు గట్టిగా శ్వాస తీసుకోండి. ఇలా చేయడం ద్వారా మీరు మీ కోపాన్ని అదుపు చేసుకోవచ్చు.
- పిల్లలను బెదిరించడం మానేయండి

ఈ చిట్కాలు పాటించి మీరు మీ పిల్లలపై కోపాన్ని తగ్గించుకొని వారిని సరైన మార్గంలో నడిపించవచ్చు.

జీవిత భాగస్వామితో బలమైన బంధం

భార్యభర్తల మధ్య సఖ్యతలేని పిల్లలకంటే అన్యోన్యంగా ఉండే భార్యభర్తల పిల్లలు జీవితంలో విజయం సాధిస్తారని చాలా అధ్యయనలు తెలుపుతున్నాయి. భార్యభర్తల సఖ్యతగా ఉండడం అనేది కూడా పిల్లల ఎదుగుదలకు దోహద పడుతుంది. సాధారణంగా చాలామంది పిల్లలు అమ్మతోనో లేదా నాన్నతోనో చనువుగా ఉంటారు. ఇంకొకరితో పెద్దగా మాట్లాడరు. వారికి సంబంధించిన ఏ విషయం కూడా షేర్ చేసుకోరు. ఇలా కాకుండా ఇద్దరితో సమానంగా వారి అభిప్రాయాలను పంచుకునేలా వారికి తెలియజేయాలి. వారికి జీవితంలో ఎటువంటి ప్రమాదం వచ్చినా తల్లిదండ్రులు ఇద్దరి దగ్గర కష్టాన్ని చెప్పుకునేలా చిన్నప్పటి నుండి పిల్లల్ని ప్రోత్సహించాలి.



సవాళ్లను అధిగమించేలా...

పిల్లలు ఏదైనా సాధించాలనే గుణాన్ని వారికి చిన్నప్పటి నుండే నేర్పించాలి. వారు ఎప్పుడూ ఏదో ఒక గోల్ పెట్టుకొని దాని మీద ఫోకస్ చేసేలా వారికి తర్ఫీదు ఇవ్వాలి. ఎటువంటి సావాళ్లనైనా భయపడకుండా ధైర్యంగా స్వీకరించేలా ప్రోత్సహించాలి. ఏ పనినైనా కష్టంతో కాకుండా ఇష్టంగా చేయడం నేర్పాలి. ఇది వారిలో పోరాట పటిమను పెంపొందించి జీవితంలో ఏదైనా సాధించాలనే తపనను చిన్నపటి నుండి బలంగా నాటుతుంది.

ఒత్తిడిని నియంత్రించుకోవడం

మనలో చాలామంది మన దైనందిక జీవితంలో ఉండే ఒత్తిడి ప్రభావాన్ని మన కుటుంబసభ్యులపై లేదా పిల్లలపై చూపిస్తుంటాం. ఇది పిల్లల్లో మన పట్ల నెగిటివిటీని పెంచుతుంది. దాంతో వారు క్రమక్రమంగా మనల్ని శత్రువుల్లా చూడటం ప్రారంభిస్తారు. అందుకోసమే మన ఒత్తిడిని, కోపాన్ని వారి మీద చూపించకూడదు. మనం మన పనిలో ఎంత ఒత్తిడిలో ఉన్నా వారిని మాత్రం ప్రేమగానే దగ్గరకు తీసుకొని మాట్లాడం అలవరచుకోవాలి. ఇలా చేయడం వల్ల వారు మనపై ఉండే భయాన్ని కోల్పోయి ప్రతీ విషయాన్ని మనతో షేర్ చేసుకోవడం అలవాటు చేసుకుంటారు.

పై సూచనలు మీ పిల్లలు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరేలా ప్రోత్సహించేందుకు, చిన్నప్పటి నుండి వారు ఉన్నతమైన మార్గంలో పయనించేందుకు చాలా ముఖ్యమైనవని అంటున్నారు పిల్లల నిపుణులు.



కమిలిన చర్మానికి

- ద్రాక్షలో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు సూర్యుని కఠినమైన కిరణాల నుండి రక్షణను ఇస్తాయి. ఎండకు వెళ్లినప్పుడు ముఖ చర్మం కమిలినట్లనిపిస్తే కొన్ని ద్రాక్ష పండ్లను తీసుకుని వాటి రసాన్ని ముఖం చర్మంపై సున్నితంగా మర్దన చేస్తే చాలు చర్మం నిగారింపు సంతరించుకుంటుంది.
- ద్రాక్షలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వృద్ధాప్య ప్రక్రియను తిప్పికొట్టడంలో సహాయపడతాయి. ఇది మీ చర్మాన్ని కూడా టోన్ చేస్తుంది. రసాయన యాంటీ ఏజింగ్ క్రీములకు బదులు ద్రాక్ష పళ్లను ఉపయోగించి చూడండి, మీకే తెలుస్తుంది.
- ఇరవై ద్రాక్షపండ్ల గుజ్జు తీసుకొని మీ ముఖానికి రాయండి. సుమారు 15-20 నిమిషాలు మెత్తగా మసాజ్ చేయండి. ఆ తర్వాత నీటితో కడగాలి. ఇలా ద్రాక్ష రసాన్ని వీలున్నప్పుడల్లా ఉపయోగించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను చూడొచ్చు. ద్రాక్షలో ఉండే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు సూర్యుని కఠినమైన కిరణాల నుండి రక్షణను ఇస్తాయి.
- ఎండకు వెళ్లినప్పుడు ముఖచర్మం కమిలినట్లనిపిస్తే కొన్ని ద్రాక్ష పండ్లను తీసుకుని వాటి రసాన్ని ముఖం చర్మంపై సున్నితంగా మర్దన చేస్తే చాలు చర్మం నిగారింపు సంతరించుకుంటుంది.
- ద్రాక్షలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వృద్ధాప్య ప్రక్రియను తిప్పికొట్టడంలో సహాయపడతాయి. ఇది మీ చర్మాన్ని కూడా టోన్ చేస్తుంది. రసాయన యాంటీ ఏజింగ్ క్రీములకు బదులు ద్రాక్ష పళ్లను ఉపయోగించి చూడండి, మీకే తెలుస్తుంది.
- ఇరవై పండ్ల గుజ్జు తీసుకొని మీ ముఖానికి రాయండి. సుమారు 15-20 నిమిషాలు మెత్తగా మసాజ్ చేయండి. ఆ తర్వాత నీటితో కడగాలి.

ఇలా ద్రాక్ష రసాన్ని వీలున్నప్పుడల్లా ఉపయోగించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను చూడొచ్చు.

బ్రిడ్జి ఎందుకు కుంగింది..?

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో మంగళవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం అనీల్ జైన్ ఆధ్వర్యంలో బ్యారేజీని పరిశీలించింది. ఆరో బ్లాక్ నుంచి ఏడవ బ్లాక్ వరకు నిషితంగా పరిశీలించి బ్యారేజి పరిస్థితిని అంచనా వేసి కేంద్రజల జలవనరుల శాఖకు నివేదిక అందించనుంది. ఆరుగురు సభ్యుల బృందం డామేజ్ అయిన ప్రాంతానికి పరిశీలించి ఎక్కడెక్కడ పిల్లర్లు కుంగాయి, అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం 11 గంటలకు బ్యారేజీ వద్దకు చేరుకున్న కేంద్ర బృందం దాదాపు రెండు గంటల పాటు వంతెన కుంగిన ప్రాంతాన్ని, బ్యారేజి పగుళ్లు ఏర్పడిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. 20వ పిల్లర్ వద్ద నిచ్చెన సాయంతో కిందకు దిగి దెబ్బతిన్న ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి కొలతలు తీసుకున్నారు. శనివారం రాత్రి ఏం జరిగిందన్నది ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశీలన పూర్తయిన అనంతరం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెనుదిరిగారు. దీనికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో కేంద్ర జలశక్తి శాఖకు నివేదికను అందించనున్నట్టు సమాచారం. కాగా మేడిగడ్డ వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో కేవలం అధికారులకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. కేంద్ర బృందం వెంట కాళేశ్వరం ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ రెండో జాబితా..!

(మొదటిపేజి తరువాయి)

విడుదల కానుంది. ఒకవేళ బుధవారం సమావేశం ముగియడం ఆలస్యం అయితే, గురువారం సీఈసీ ఆమోదించిన అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నారు. కాగా రాష్ట్రంలో ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు నేతలు నేడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. కొత్తగా పార్టీలో చేరే వీరి కోసం 4-5 స్థానాలను కేటాయించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం స్క్రీనింగ్ కమిటీ రూపొందించిన తుది జాబితాలో స్వల్ప మార్పులు, చేర్పులు జరుగనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కొండగల్‌లో పోటీకి రా..

నవతెలంగాణ-కొడంగల్

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లయితే కొడంగల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ తనపైన పోటీ చేసి గెలవాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులకు ఓటు వేసిన పాపానికి కొడంగల్‌కు గౌరవం తగ్గిందని, కొడంగల్ పేరు చెప్పుకోలేని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఎన్నికలు రావడంతో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతున్నారని వారి మాటలు ప్రజలు నమ్మొద్దన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మించి, రెండేండ్లలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి, కొడంగల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసి, ప్రజల కాళ్లు కడిగి నెత్తి పైన చల్లుకుంటామని కేసీఆర్, కేటీఆర్ అన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం తీసుకువస్తే దాన్ని మట్టిలో కలిపి పాలమూరు-రంగారెడ్డి తీసుకొస్తామని చెప్పి, కొడంగల్‌ను ఎడారిగా మార్చారని విమర్శించారు. బీఆర్‌ఎస్ వాళ్లకు ఓటు వేస్తే కొడంగల్ ఎడారిగా మారుతుందన్నారు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో ఓటమి తప్పదన్నారు. రాజకీయాల్లో నువ్వా.. నేనా.. ఎవరు ఉండాలో తెల్చుకుందాం రా అని సవాల్ విసిరారు. రైతు సమస్యల పరిష్కారం, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇచ్చానని చెబుతున్న సీఎం కేసీఆర్ కొడంగల్ నుంచి పోటీ చేసి, గెలవాలని సవాల్ విసిరారు. సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాలకు ఎన్ని నిధులు పోయాయో కొడంగల్‌కు ఎన్ని నిధులు వచ్చాయో చెప్పాలని నిలదీశారు. దత్తత తీసుకున్న కేటీఆర్ నిధులు ఇస్తే జూనియర్ కళాశాల, కృష్ణాజలాలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కొడంగల్ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొడంగల్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి యూసుఫ్, వెంకట్‌రావు, బోడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి ఆ పిల్లర్లే సాక్ష్యమా!?

(మొదటిపేజి తరువాయి)

తోపాటు మరో ఐదుగురితో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని మహాదేవ్‌పూర్‌కు పంపింది. మంగళవారం పగుళ్లు పట్టిన 20వ పిల్లర్‌ను ఆ బృందం పరిశీలించింది. బ్యారేజీ కుంగిపోవడానికి కారణాలను మాత్రం స్పష్టం చేయలేదు. మరో రెండురోజులు అధ్యయనం చేస్తేగానీ, అసలు కారణం బయటపడదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం సాగునీటి, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్‌తోపాటు మరో ఇద్దరితో కూడిన ఒక కమిటీని నియమించినట్టు సమాచారం. అయితే ఉన్నతాధికారులెవరూ ఈ కమిటీని వేసినట్టుగా ప్రకటించలేదు. అందువల్ల రహస్య అధ్యయనమేమైనా జరగనుందా ? అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

ఏడు లింకులు..28 ప్యాకేజీలు

ఏడు లింకులు 28 ప్యాకేజీలతో కాళేశ్వరంను నిర్మించారు. మొత్తం అప్పులతోనే చేపట్టారు. దాదాపు రూ. 80,190 కోట్లతో ఎత్తిపోతల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 13 జిల్లాలకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. గోదావరితోపాటు ప్రాణహిత నదుల నీటితో ఆయకట్టును తడపాలని ప్రభుత్వం భావించింది.240 టీఎంసీల నీటికిగాను 195 టీఎంసీలు లక్ష్మి బ్యారేజీ నుంచి, 20 టీఎంసీలు శ్రీపాద-ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి, మరో 25 టీఎంసీల నీళ్లు భూగర్భజలాల ద్వారా సమకూరుతాయని అంచనా. ఈ నీటిలో 169 టీఎంసీలను సాగునీటికి, 30 టీఎంసీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, 16 టీఎంసీలను పరిశ్రమలకు 10 టీఎంసీలను ప్రాజెక్టు చుట్టుపక్కల గ్రామాల తాగునీటికి వాడాలని సర్కారు నిర్ణయించింది. 18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు 17 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణకు కాళేశ్వరంను ఉపయోగించుకోవాలని సర్కారు ప్రణాళిక.

అప్పట్లోనే..

కాళేశ్వరం నిర్మిస్తున్న సమయంలోనే అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటించడం లేదనీ, పర్యావరణ ప్రమాణాలను తుంగలో తొక్కారనే ఆందోళనా వ్యక్తమైంది. కేసులు సైతం అయ్యాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా రికార్డు సమయంలో నిర్మించామనే పేరుకోసం అడ్డదారులు తొక్కినట్టు ప్రస్తుత పిల్లర్లకు పట్టిన పగుళ్లే చెపుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భారీ అవినీతి చోటుచేసుకుందనే విమర్శలూ తక్కువేంకాదు. ఇప్పుడీ వంతెన కుంగిపోవడంతో ఆ ఆరోపణలు, విమర్శలకు బలంచేకూర్చినట్టవుతున్నది. ఇంజినీరింగ్ అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఆకాశానికెత్తిన ప్రభుత్వంలో, ఇప్పుడు బ్యారేజీ కుంగిపోవడంతో చడీచప్పుడూ లేదు. మొత్తం ప్రాజెక్టుపై సమగ్ర విచారణ చేయాలనే డిమాండ్ ప్రతిపక్షాలు, రాజకీయపక్షాల నుంచి వస్తున్నది. వంతెన కుంగిపోవడానికి కారణం నిర్మాణ లోపాలా ? సాంకేతిక వైఫల్యమా ? ప్రమాణాలను నిర్లక్ష్యం చేయడమా ? నిగ్గు తేల్చాల్సిన అవసరమున్నది. అలాగే అవినీతి అధికారులు, తెరవెనుక ఉన్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులనూ గుర్తించి కఠినంగా శిక్షించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. అయితే లోపాలను గుర్తించి బాధ్యులను పట్టుకునే బదులు, ఆసాంఘీక శక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు పేర గందరగోళపరిచే చర్యలకు స్థానిక అధికారులు పూనుకోవడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

సమగ్ర విచారణ జరిపించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కేసీఆర్ మానసపుత్రికైన కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో కీలకమైన మేడిగడ్డ బ్యారేజి 20వ పిల్లర్ కుంగుబాటుపై సమగ్ర విచారణ జరిపించాలి. నాణ్యతా లోపాల వల్ల నష్టం, తదితర వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలి. డ్యాం సేఫ్టీ అధికారుల నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును దేశంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టారనీ, మూడేండ్లలోనే రికార్డు స్థాయిలో నిర్మాణం పూర్తిచేశామనీ, ఆ ప్రాజెక్టు ద్వారా 18.5లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరివ్వడమే కాకుండా, మరో 17లక్షల పాత ఆయకట్టును స్థిరీకరించడానికి ప్రణాళిక రూపొందించామని ప్రభుత్వం చెబుతోందనీ, అయితే ఆ మురిపెం మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని పేర్కొన్నారు. అది పూర్తయిన రెండేండ్లకు గోదావరికి వరదలు రావడంతో ఇదేబ్యారేజి లోని 7పంపులు నీట మునిగాయని తెలిపారు.

వాటి రిపేర్లు, నష్టం ఎవరు భరించాలన్న మీమాంస ముందుకొచ్చిందని గుర్తుచేశారు. ఆ సంఘటన మర్చిపోక ముందే ఇప్పుడు 18 నుంచి 21 వరకు గల బ్యారేజి పిల్లర్లు అడుగున్నర లోతుకు కుంగిపోయాయనీ, వీటితో పాటు వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో తలెత్తిన లోపాలు కూడా ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. పగుళ్లు, లీకేజీలు, పెచ్చులూడటం వంటివి కన్పిస్తున్నాయని తెలిపారు.

నాలుగేండ్ల నుంచి 8 ఏండ్ల లోపు నిర్మాణం చేసిన ప్రాజెక్టుల్లో నాణ్యతా లోపాలు వెలుగుజూస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బ్యారేజి పూర్తికాగానే తెలంగాణ, మహారాష్ట్రకు మధ్య భారీ వాహనాలు రాకపోకలకు అనుమతిచ్చారని తెలిపారు. ప్రతీ బ్యారేజిపై రవాణాను నిషేధించినా, కాళేశ్వరం నుంచి రవాణాను అనుమతించారని పేర్కొన్నారు. పిల్లర్ ఒకవైపు కుంగిన తర్వాత 10.6 టీఎంసీల నిల్వ వున్న నీటిని మొత్తం బయటకు పంపించారని తెలిపారు. దీంతో యాసంగిలో ప్రాజెక్టులోని నీటిని వినియోగించుకోలేని పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. మొత్తం నీరు వినియోగంలోకి రాకుండానే నిర్మాణ లోపాలు బహిర్గతమయ్యాయని వివరించారు. భారీ స్థాయిలో బ్యారేజికి నష్టం జరిగినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి గానీ, ఇంజనీర్ల వైపు నుంచి గానీ వాస్తవాలు ఎందుకు బైట పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు పూర్తి కాకముందే జరిగిన భారీ నష్టంపై సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను తెలియజేయడంతో పాటు నష్టానికి బాధ్యులు ఎవరో ప్రకటించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దెబ్బ మీద దెబ్బ

(మొదటిపేజి తరువాయి)

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి తనకు టిక్కెట్ కేటాయించాలంటూ ఆయన కోరారు. ఆ మేరకు దరఖాస్తు కూడా చేసుకున్నారు. దీనికి బీజేపీ అధిష్టానం అంగీకరించకపోవటంతో నర్సయ్య ఇప్పుడు అలకబూనారు. ఇక మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి పోటీ పడుతున్న మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి... ఇద్దరూ పార్టీకి తలనొప్పిగా మారారు. గద్వాలలో సీనియర్ న్యాయవాది అయిన వెంకటాద్రి రెడ్డిని నిలబెట్టి... తనకు ఎంపీగా అవకాశమివ్వాలని అరుణ కోరుతున్నారు. ఇదే సమయంలో తన కుమారుడు మిథున్‌రెడ్డికి షాద్‌నగర్ అసెంబ్లీని కేటాయించి, తనకు లోక్‌సభకు అవకాశం కల్పించాలంటూ జితేందర్‌రెడ్డి కోరుతున్నారు. కానీ ఆయన్ను శాసనసభకు పోటీ చేయాలంటూ కమలం పార్టీ ఢిల్లీ పెద్దలు ఆదేశించారు. వారి ఆదేశాన్ని పాటించలేనంటూ ఆయన తిరస్కరించినట్టు సమాచారం. ఈ క్రమంలో డీకే, జితేందర్ ఏం చేస్తారో చూడాలి. ఇక హైదరాబాద్ లోక్‌సభ పరిధిలోని గోషామహల్ నుంచి పార్టీ టికెట్ ఆశించి భంగపడిన విక్రమ్‌గౌడ్ కూడా బీజేపీపై గుర్రుగా ఉన్నారు. ఆయన త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ అవుతున్నట్టు తెలిసింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన బీజేపీ అధికార ప్రతినిధి రాకేశ్



రెడ్డి కూడా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇలా కీలక నేతలందరూ అలకలు, అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో బీజేపీకి మరిన్ని దెబ్బలు తగలటం ఖాయంగా కనబడుతున్నది. తెలంగాణలో సీన్ రివర్సని తేలిన తర్వాత కమలం పార్టీ పరిస్థితి ఈ విధంగా మారటం గమనార్హం.

దళిత యువకుడిపై అమానుషం..

(మొదటిపేజి తరువాయి)

25 కిలోల సోయాను దొంగిలించాడని ఆరోపిస్తూ.. పల్లె నారాయణ, పల్లె హనుమాండ్లు, పల్లె సిద్దయ్య, బాధితుడి సమీప బంధువు సాలెరావు సాయి అతనిపై దాడి చేశారు. దుస్తులు విప్పించి గ్రామంలో నగ్నంగా ఊరేగించి దారుణంగా అవమానించారు. ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. దళితుడిని నగ్నంగా ఊరేగించడంపై విచారణ చేపట్టామని, ఘటనలో ముగ్గురు బీసీకులాలకు చెందిన వారు కాగా మరొకరు బాధిత కుటుంబానికి చెందిన సమీప బంధువని తెలిపారు.

దళితసంఘాల మండిపాటు

ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు, గ్రామంలోని దళిత నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు తప్పు చేస్తే శిక్షించడానికి చట్టాలు ఉన్నాయని, కానీ ఇలా చట్టాన్ని చేతిలో తీసుకుని దౌర్జన్యంగా నగ్నంగా ఊరేగించడం లాంటి అమానుష ఘటనలు చోటుచేసుకోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను నగ్నంగా ఊరేగించిన ఘటనపై బాధితుడు బోధన్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ తెలిపారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజి తరువాయి)

ఉన్నాయని అభిప్రాయపడ్డారు. బిల్లును పరిశీలించిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ తమ ఆందోళనలను పరిగణనలోకి తీసుకోలేదని, రాజ్యసభలో ఆగస్ట్ 2వ తేదీన జరిగిన చర్చలో సైతం ఇవి ప్రస్తావనకు రాలేదని తెలిపారు. బిల్లుకు లోక్‌సభ జూలై 26న, రాజ్యసభ ఆగస్ట్ 2న ఆమోదం తెలిపాయి. ఆగస్ట్ 4న దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ నెల 20న విచారణ జరిపింది. పిటిషన్ దాఖలు చేసిన వారిలో పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖకు చెందిన ఇద్దరు మాజీ కార్యదర్శులు ఎంకే రంజిత్ సింగ్, మీనా గుప్తా, వన్యప్రాణుల జాతీయ బోర్డు మాజీ సభ్యుడు ప్రేరణా సింగ్ బింద్రా ఉన్నారు.

కేసీఆర్‌పై పోటీగా.. 100 నామినేషన్‌లు వేస్తాం

నవతెలంగాణ-తాడ్వాయి

కేసీఆర్‌పై పోటీగా కామారెడ్డి నుంచి 100 నామినేషన్లు వేస్తామని మాస్టర్ ప్లాన్ బాధిత రైతు ఐక్య కార్యాచరణ కమిటీ రైతులు ప్రకటించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు అంశాలపై చర్చించారు. ఆయా గ్రామాల రైతులు నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. అనంతరం మీడియాతో రైతులు మాట్లాడుతూ.. తమ భూములు కాపాడుకునేందుకు ఎంతకైనా వెళ్తామని తెగేసి చెప్పారు. మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ కాలేదని, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను అనవసరంగా బదనాం చేస్తున్నారని మంత్రి కేటీఆర్ సంబంధంలేని మాటలు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కామారెడ్డి మున్సిపల్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతోనే తాము ఉద్యమ బాట పట్టామన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మొన్న గజ్వేల్ కార్యకర్తలతో సీఎం మాట్లాడుతూ.. కామారెడ్డిలో తనకు పని ఉండటం వల్లనే అక్కడికి వెళున్నానని కేసీఆర్ చెప్పారని, కేసీఆర్‌కు ఇక్కడేం పని అని ప్రశ్నించారు. గజ్వేల్‌లో భూములు అయిపోయాయి కాబట్టి ఇక్కడికి ఆ పనిమీదే వస్తున్నారా అని ప్రశ్నించారు. రైతు రాములు ఆత్మహత్య లాంటి ఘటనలు మరోసారి జరగకముందే కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నామని చెప్పిన తర్వాతే కేసీఆర్ కామారెడ్డికి రావాలని సూచించారు. గవర్నర్ ద్వారా మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రతి గ్రామం నుంచి 15 చొప్పున కేసీఆర్‌పై 100 నామినేషన్లు వేస్తామని స్పష్టం చేశారు. దానికోసం రైతులందరం పార్టీలకు అతీతంగా సంఘటితం అవుతామని, 9 గ్రామాల్లో రైతులకు సంబంధించిన బంధువులతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. 9 గ్రామాల్లోనే కాకుండా నియోజకవర్గం మొత్తం కలియ తిరిగి కాళ్ళు మొక్కి అయినా కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని, తమకు మద్దతిచ్చే వ్యక్తికి ఓటు వేస్తామని స్పష్టం చేశారు.

మ్యూజిక్ రికార్డింగ్‌తో చిరు నయా సినిమా షురూ..



చిరంజీవి నటించనున్న ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం త్వరలో సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. యువి క్రియేషన్స్ నిర్మాణంతో 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా యూనిట్, కొంతమంది అతిథులు సమక్షంలో పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.
చిరంజీవి, సురేఖ దంపతులు కలిసి ప్రొసీడింగ్స్‌ను ప్రారంభించడానికి మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందజేయగా, అల్లు అరవింద్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కె రాఘవేంద్రరావు క్లాప్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివి వినాయక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.
పాత సంప్రదాయాన్ని తిరిగి తీసుకువస్తూ లాంచ్‌కు ముందు మేకర్స్ సినిమా మ్యూజిక్ రికార్డింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి మాట్లాడుతూ, 'మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు శుభవార్త. ఇది చిరంజీవి 156వ చిత్రం. యూవీ క్రియేషన్స్ 14వ ప్రొడక్షన్. సినిమాలో 6 పాటలు ఉంటాయి. సంగీత రికార్డింగ్‌తో పూజా కార్యక్రమాలను ప్రారంభించడం సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని తిరిగి తీసుకువస్తూ, మ్యూజిక్ రికార్డింగ్‌తో ప్రొసీడింగ్‌లను ప్రారంభించాలనుకుంటున్నాం. సెలబ్రేషన్స్ సాంగ్ రికార్డింగ్‌తో పనులు ఆరంభమయ్యాయి. సినిమాను తన భుజస్కంధాలపై మోస్తున్న వశిష్టకు ఆల్ ది బెస్ట్' అని తెలిపారు.
'ఇలాంటి అరుదైన, అసాధారణమైన సినిమాలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. కీరవాణికి, దర్శకుడు వశిష్టకు, నిర్మాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు. అద్భుతమైన పాటలతో మీ ముందుకు వస్తామని హామీ ఇస్తున్నాం' అని గీత రచయిత చంద్రబోస్ చెప్పారు.
విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటి వరకు చిరంజీవి కెరీర్‌లోనే హై బడ్జెట్ మూవీ అని చిత్ర యూనిట్ తెలిపింది.

నవచిత్రం

డెవిల్.. పీరియడ్ స్పై థ్రిల్లర్

కల్యాణ్‌రామ్ నటిస్తున్న కొత్త సినిమా 'డెవిల్'. ద బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ అనే ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రాన్ని అభిషేక్ నామా నిర్మాతగా, దర్శకుడిగా తెరకెక్కిస్తున్నారు. నవంబర్ 24న ఈ సినిమాని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.
ఇటీవల విడుదలైన టీజర్‌కి సర్వత్రా మంచి ప్రశంసలు దక్కాయి. సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని అంచనాలు పెంచేసింది టీజర్. అలాగే మాళవిక నాయర్, ఎల్నాజ్ నరౌజి పోస్టర్లు సైతం అందర్నీ మెస్మరైజ్ చేశాయి. ఇక లేటెస్ట్‌గా దసరా శుభసందర్భంగా అభిమానులను స్పెషల్ పోస్టర్‌తో విష్ చేశారు కల్యాణ్‌రామ్. ఈ తాజా దసరా పోస్టర్‌లో కల్యాణ్‌రామ్ డైనమిక్‌గా కనిపిస్తున్నారు. పార్టీకి రెడీ అయినట్టు స్పెషల్ టుక్సెడోలో అదుర్స్ అనిపిస్తున్నారు. 'చెడుపై మంచి సాధించిన విజయాన్ని పర్వదినంగా జరుపుకుందాం. అందరికీ దసరా పర్వదిన శుభాకాంక్షలు. అందరి జీవితాల్లోనూ ఆనందాలు, శుభాలు వెల్లివిరియాలి' అని ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. పీరియడ్ స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



కళ్యాణ్ రామ్

దీపావళి కానుకగా ఫస్ట్ సాంగ్ రిలీజ్



రామ్ చరణ్

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న సినిమా కావటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే సౌత్ ఇండియన్ సినిమా రేంజ్‌ను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లిన సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ మేకింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటి వరకు ఆయన తెరకెక్కించిన సినిమాలను మించేలా ఈ చిత్రాన్ని ఆయన రూపొందిస్తున్నారు. లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్‌తో చరణ్‌ను ప్రెజెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో దసరా సందర్భంగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించి సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దీంతో పాటు మరో అమేజింగ్ అప్‌డేట్‌ను అందించారు. దీపావళి సందర్భంగా ఈ సినిమా నుంచి తొలి సాంగ్‌ను విడుదల చేస్తున్నారు.
రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్‌లతో పాటు ఎస్.ఎస్.తమన్ కలిసి తొలిసారి వర్క్ చేస్తున్న ఈ సినిమా ఇది. ఈ తొలిపాటను పాన్ ఇండియా రేంజ్‌లో దీపావళికి గ్రాండ్ లెవల్లో రిలీజ్ చేయటానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

గేమ్ ఆఫ్ లవ్



సుప్యర్ద సింగ్, కార్తిక్ రత్నం

కార్తిక్ రత్నం, సుప్యర్ద సింగ్ జంటగా నటించిన చిత్రం 'లింగోచ్చా'. ఆనంద్ బడాని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీకాల ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో యాదగిరి రాజు నిర్మించారు. ఈనెల 27న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు.'గేమ్ ఆఫ్ లవ్ అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. హైదరాబాద్‌కి సంబంధించిన రొమాంటిక్ కామెడీ విత్ లవ్‌తో ఈ కథ నడుస్తుంది. కార్తిక్ రత్నంలో ఉన్న స్టార్ యాక్టర్‌ని చూడబోతున్నారు. సినిమా హిట్ ఖాయం' అని దర్శక, నిర్మాతలు చెప్పారు.

ఆద్యంతం వినూత్నం



అపర్ణ జనార్ధన్, రక్షిత్ అట్లూరి, నాగశౌర్య

రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన సినిమా 'నరకాసుర'. అపర్ణ జనార్ధన్, సంకీర్తన విపిన్ హీరోయిన్లు. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహించారు. నవంబర్ 3న తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ మూవీ రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో నాగశౌర్య రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'హీరో రక్షిత్ ఈ సినిమాలో అద్భుతంగా నటించారు. డైరెక్టర్ సెబాస్టియన్ డెడికేషన్‌తో చేశారు' అని చెప్పారు.
'ఇందులోని ప్రతి ఫ్రేమ్, సీన్, ప్రతి అంశం కొత్తగా ఉంటుంది. మేము కొత్త ప్రయత్నం చేశాం అని ప్రూవ్ చేసుకోవాలని అనుకుంటున్నాం. కేటీఆర్ స్ఫూర్తితో ఇందులో ట్రాన్స్‌జెండర్ అంశాన్ని పెట్టాం. అది సినిమాకు ఆకర్షణ అవుతుంది' అని డైరెక్టర్ అన్నారు.
హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ, 'ఈ సినిమా మిమ్మల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. సినిమా చూశాక మేం చెప్పింది నిజం కాదని మీకు అనిపిస్తే మీ టికెట్, పాప్ కార్న్ డబ్బులు తిరిగి ఇస్తాం' అని అన్నారు.

అన్ని భాషల్లోనూ చెప్పాల్సిన కథ

వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పిస్తున్న చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రానికి పూజ కొల్లూరు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంపూర్ణేష్ బాబు, వి.కె. నరేష్, శరణ్య ప్రదీప్ నటించారు. దర్శకుడు వెంకటేష్ మహా ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, అలాగే ఓ ముఖ్యపాత్రలోనూ నటించారు. వినోద ప్రధానంగా రూపొందిన ఈ రాజకీయ వ్యంగ్య చిత్రం ఈనెల 27న విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, 'ఇదొక కొత్త సినిమా. ప్రయోగం చేశారు. నన్ను కొత్తగా చూపించారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రీమియర్లు వేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఇండస్ట్రీకి చెందిన చాలామంది కూడా నీకు సరైన సినిమా పడిందని అన్నారు' అని తెలిపారు.



వెంకటేష్ మహా, సంపూర్ణేష్ బాబు

'మొదట వైనాట్ స్టూడియోస్ నుంచి ఈ సినిమా డైరెక్ట్ చేయమని ఫోన్ వచ్చింది. కొన్ని కారణాల వల్ల డైరెక్షన్ చేయనని చెప్పాను. అయితే సినిమా చూడమంటే చూశాను. చూశాక అర్థమైంది. ఇది ఖచ్చితంగా చెప్పాల్సిన కథ. ప్రజాస్వామ్యం ఎన్ని దేశాల్లో ఉంటే అన్ని దేశాల్లో చూపించాల్సిన సినిమా. అన్ని భాషల్లోనూ చెప్పాల్సిన కథ. పూజని దర్శకురాలిగా ఎంపిక చేశాం. కింగ్ పాత్రకి సంపూని ఎంపిక చేయటానికి కారణం ఈయన కింగ్ పాత్రలో తెర మీద కనిపిస్తే ఒక సగటు మనిషి వచ్చాడురా అనే భావన చూసే ప్రేక్షకులకు కలుగుతుంది. ఆయన కూడా పాత్రకి తగ్గట్టుగా బాగా మౌల్డ్ అయ్యారు. ఇందులో ఓ ముఖ్య పాత్రలో నేనూ నటించాను. ఈ సినిమా చూశాక ప్రేక్షకులు తమని తాము కింగ్‌లా ఫీలై థియేటర్ల నుంచి బయటకు వస్తారనే నమ్మకం ఉంది' అని దర్శకుడు వెంకటేష్ మహా చెప్పారు.



భవ్యశ్రీ, కిషోర్ తేజ

థ్రిల్ చేసే చిత్రం

కట్ట శివ సమర్పణలో శ్రీ సాయి ప్రొడక్షన్స్ బ్యానర్ పై కిషోర్ తేజ – భవ్యశ్రీ హీరో, హీరోయిన్లుగా దర్శకుడు రామ్ కుమార్ తెరకెక్కిస్తున్న మూవీ 'బాగుంది'. శ్రీరామోజు వంశీకృష్ణ, విజయ్ భాస్కర్, దేవిశ్రీ పద్మా జయంతి, పద్మిని, చిట్టిబాబు, మల్లిక్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రాజనేని వెంకటేశ్వరరావు, డా. మహేంద్రబాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.
హర్ష ప్రవీణ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను దర్శకులు వేణు ఉడుగుల, నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ లాంచ్ చేయగా, ఫస్ట్‌లుక్‌ను తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు.
నిర్మాత రాజనేని వెంకటేశ్వర రావు మాట్లాడుతూ,'డైరెక్టర్ రామ్ కుమార్ చెప్పిన కథ విన్నాను, బాగా నచ్చింది. దర్శకుడే అన్నీ దగ్గరుండి చూసుకుంటూ సినిమాను పూర్తిచేశారు. మా సినిమా అన్ని వర్గాల వారికి నచ్చుతుంది' అని తెలిపారు. 'ఇదొక సస్పెన్స్ జోనర్ సినిమా. చూసిన వాళ్ళు ఖచ్చితంగా థ్రిల్ అవుతారు. ఈ సినిమాలో మూడు సాంగ్స్, మూడు ఫైట్స్ ఉన్నాయి' అని దర్శకులు రామ్ కుమార్ చెప్పారు. కో ప్రొడ్యూసర్ డా. మహేంద్రబాబు మాట్లాడుతూ,'భిన్న కాన్సెప్ట్‌తో రూపొందిన ఈసినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.



ఆఫ్ఘన్ మరో సంచలనం

- పాకిస్తాన్‌పై 8వికెట్ల తేడాతో గెలుపు

చెన్నై: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు మరో సంచలనానికి తెరలేపింది. 1992 వన్డే ప్రపంచకప్ విజేత పాకిస్తాన్‌పై ఆఫ్ఘన్ జట్టు సంచలన విజయం నమోదు చేసింది. చెపాక్ స్టేడియంలో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ నిర్దేశించిన 283 పరుగుల లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ జట్టు కేవలం 2 వికెట్లు కోల్పోయి 49 ఓవర్లలోనే ఛేదించింది. షాహీన్ షా అఫ్రిది వేసిన చివరి బంతిని హస్మతుల్లా బ్యాక్ వర్డ్ స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి పంపి విన్నింగ్ షాట్ కొట్టాడు. ఆఫ్ఘన్ బ్యాటర్స్‌ను కట్టడి చేయడంలో పాక్ బౌలర్లు విఫలమయ్యారు. హస్మతుల్లా షాహిదీ(48నాటౌట్; 45బంతుల్లో 4ఫోర్లు), రహ్మత్‌షా(77నాటౌట్; 84బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) ఆఫ్ఘన్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. అంతకుముందు ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్(65; 53బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్), ఇబ్రహీం జద్రాన్(87; 113బంతుల్లో 10ఫోర్లు) తొలి వికెట్‌కు 130పరుగులు చేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత ఆఫ్ఘన్ బ్యాటర్లు నిలకడగా ఆడుతూ రన్ రేట్ పెంచుతూ.. వీలు చిక్కినప్పుడల్లా బంతిని బౌండరీలకు తరలిస్తూ.. రన్‌రేట్‌ను తగ్గకుండా పరుగులు రాబట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన నిర్ణీత 50 ఓవర్లలో పాకిస్థాన్ ఏడు వికెట్లు కోల్పోయి 282 పరుగులు చేసింది. ఓపెనర్ షఫీక్(58), బాబర్(74) అర్ధసెంచరీలకి తోడు షాదాబ్(40), ఇఫ్తికార్(40) బ్యాటింగ్‌లో రాణించారు. చివర్లో షాదాబ్, ఇఫ్తికార్ బ్యాట్ ఝుళిపించడంతో పాక్ జట్టు ఆమాత్రమైనా స్కోర్ చేయగల్గింది. చివరి ఓవర్‌లో ఇఫ్తికర్ అహ్మద్, షాదాబ్ ఖాన్ వికెట్లు 300పరుగుల మార్క్‌ను పాక్ చేరుకోవడంలో విఫలమైంది. నూర్ అహ్మద్‌కు మూడు, నవీన్-ఉల్-హక్‌కు రెండు, నబీ, అజ్మతుల్లాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇబ్రహీం జద్రాన్‌కు లభించగా.. ఈ ఓటమితో పాకిస్తాన్ జట్టు సెమీస్ ఆశలు సంక్లిష్టం చేసుకుంది. అంతకుముందు ఆఫ్ఘనిస్తాన్ జట్టు 69పరుగుల తేడాతో ఇంగ్లండ్‌జట్టుపై నెగ్గి తొలి సంచలనానికి తెరలేపగా.. నెదర్లాండ్స్ జట్టు 38పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసిన సంగతి తెలిసిందే.

డికాక్ భారీ శతకం

- క్లాసెన్ క్లాసిక్ ఇన్నింగ్స్
- మహ్మదుల్లా సెంచరీ వృధా
- బంగ్లాదేశ్‌పై 149పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు

ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా మరో భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. వాంఖడే స్టేడియంలో మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 149పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 382పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో బంగ్లాజట్టు 46.4ఓవర్లలో 233పరుగులకు ఆలౌటైంది. తొలుత దక్షిణాఫ్రికా ఓపెనర్, వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ మరోసారి భారీ శతకంతో విరుచుకుపడ్డాడు. వన్డే ప్రపంచకప్‌లో తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ.. బంగ్లాదేశ్‌పై 174 పరుగులతో చెలరేగాడు. ఇందులో 15ఫోర్లు, భారీ 7సిక్సర్లు ఉన్నాయి. అలాగే మిడిల్ ఆర్డర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (90; 49బంతుల్లో 2ఫోర్లు, 8సిక్సర్లు క్లాసిక్ ఇన్నింగ్స్, చివర్లో డేవిడ్ మిల్లర్ (34నాటౌట్; 15బంతుల్లో ఫోర్, 4సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో దక్షిణాఫ్రికాజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 382 పరుగుల భారీ స్కోరు చేసింది. తొలుత ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (12; 19 బంతుల్లో), వన్‌డౌన్‌లో వచ్చిన వాండర్ డుసెన్(1) విఫలమయ్యారు. నిలకడగా ఆడుతున్న హెండ్రిక్స్‌ను ఆరో ఓవర్‌లో షోరిఫుల్ ఇస్లామ్ వెనక్కి పంపాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన డుస్సెన్‌ను మెహదీ హసన్ మిరాజ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అనంతరం డికాక్, మార్‌క్రమ్ నిలకడగా బౌండరీలు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. డికాక్ 47 బంతుల్లో, మార్‌క్రమ్ 57 బంతుల్లో అర్ధ శతకాలు పూర్తి చేసుకున్నారు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించిన మార్‌క్రమ్.. షకీబ్ అల్ హసన్ బౌలింగ్‌లో లిట్టన్ దాస్‌కు చిక్కాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన క్లాసెన్‌తో కలిసి డికాక్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. చివర్లో డికాక్ గేర్లు మార్చి ఆడాడు. షోరిఫుల్ వేసిన 42 ఓవర్‌లో ఓ ఫోర్, సిక్స్ బాదిన అతడు.. షకీబ్ వేసిన తర్వాతి ఓవర్‌లో 6, 4, 6, 4 బాదేసి 150ల్లోకి వచ్చేశాడు. షోరిఫుల్ వేసిన మరో ఓవర్‌లో డికాక్ వరుసగా రెండు బౌండరీలు రాబట్టగా.. క్లాసెన్ సిక్స్ కొట్టాడు. డబుల్ సెంచరీపై కన్నేసిన డికాక్‌ను హసన్ మమమూద్ ఔట్ చేశాడు. డికాక్ ఔటైన తర్వాత క్లాసెన్ మరింత ధాటిగా ఆడాడు. మహమూద్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన క్లాసెన్.. ముస్తాఫిజుర్ వేసిన 47 ఓవర్‌లో వరుసగా 6,4,6 దంచాడు. మిల్లర్ కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. షోరిఫుల్ వేసిన 49 ఓవర్‌లో రెండు సిక్స్‌లు,



ఓ ఫోర్ బాదాడు. మహమూద్ వేసిన చివరి ఓవర్‌లో తొలి బంతికి సిక్స్ బాదిన క్లాసెన్ తర్వాతి బంతికే మహ్మదుల్లాకు క్యాచ్ ఇచ్చాడు. చివర్లో డికాక్, క్లాసెన్, డేవిడ్ మిల్లర్ ఫోర్లు, సిక్సర్లతో విధ్వంసం సష్టించారు. చివరి 13 ఓవర్లలో సౌతాఫ్రికా ఏకంగా 174 పరుగులు రాబట్టింది. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహమూద్‌కు రెండు, షోరిఫుల్, హసన్ మిరాజ్, షకీబ్ అల్ హసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.
ఛేదనలో భాగంగా బంగ్లాదేశ్ 158పరుగులకే 8వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా మిడిలార్డర్ బ్యాటర్ మహ్మదుల్లా(111; 111బంతుల్లో 11ఫోర్లు, 4సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. లింటన్ దాస్(22) ఫర్వాలేనిపించినా.. కెప్టెన్ షకీబ్(1), ముష్ఫికర్(9), నజ్ము(0) నిరాశపరచడంతో జట్టు ఫలితంపై ప్రభావం చూపింది. దక్షిణాఫ్రికా బౌలర్లు కోర్జేకు మూడు, జెన్సన్, విలియమ్స్, రబడాకు రెండేసి, మహరాజ్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డి కాక్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి)నసుమ్ అహ్మద్ (బి)హసన్ మహ్మద్ 174, హెండ్రిక్స్ (బి)షోరిఫుల్ ఇస్లామ్ 12, డుస్సెన్ (ఎల్‌బి)మెహిదీ హసన్ మిరాజ్ 1, మార్‌క్రమ్ (సి)లింటన్ దాస్ (బి)షకీబ్ 60, క్లాసెన్ (సి)మహ్మదుల్లా (బి)హసన్ మహ్మద్ 90, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 34, జెన్సన్ (నాటౌట్) 1, అదనం 10. (50ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 382పరుగులు.

వికెట్ల పతనం: 1/33, 2/36, 3/167, 4/309, 5/374

బౌలింగ్: ముస్తాఫిజుర్ 9-0-76-0, మెహిదీ హసన్ మిరాజ్ 9-0-44-1, షోరిఫుల్ ఇస్లామ్ 9-0-76-1, షకీబ్ 9-0-69-1, హసన్ మహ్మద్ 6-0-67-2, నసుమ్ అహ్మద్ 5-0-27-0, మహ్మదుల్లా 3-0-20-0.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజీద్ హసన్ (సి)క్లాసెన్ (బి)జాన్సెన్ 12, లింటన్ దాస్ (ఎల్‌బి)రబడా 22, నజ్మల్ హొసైన్ (సి)క్లాసెన్ (బి)జాన్సెన్ 0, షకీబ్-అల్-హసన్ (సి)క్లాసెన్ (బి)విలియమ్స్ 1, ముష్ఫికర్ రహీమ్ (సి)ఫెల్యూలియో (బి)కోర్జే 8, మహ్మదుల్లా (సి)జెన్సన్ (బి)కోర్జే 114, మెహిదీ హసన్ (సి)ఫెల్యూలియో (బి)మహరాజ్ 11, నసుమ్ అహ్మద్ (సి అండ్ బి)కోర్జే 19, హసన్ మహ్మద్ (సి)కోర్జే (బి)రబడా 15, ముస్తఫిజుర్ (సి)మిల్లర్ (బి)విలియమ్స్ 11, షోరిఫుల్ ఇస్లామ్ (నాటౌట్) 6, అదనం 17. (46.4ఓవర్లలో) 233 పరుగులకు ఆలౌట్.

వికెట్ల పతనం: 1/30, 2/30, 3/31, 4/42, 5/58, 6/81, 7/122, 8/159, 9/227, 10/233

బౌలింగ్: జెన్సన్ 8-0-39-2, విలియమ్స్ 8.4-1-56-2, కోర్జే 10-0-62-3, రబడా 10-1-42-2, మహరాజ్ 10-0-32-1

ఆటలు

దిగ్గజ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ కన్నుమూత..



ఛండీగఢ్: భారత్ దిగ్గజ క్రికెటర్లలో ఒకరైన బిషన్ సింగ్ బేడీ (77) కన్నుమూశారు. స్లో లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ గా 1966 నుంచి 1979 వరకు భారత్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కిషన్ సింగ్ బేడీ సోమవారం కన్నుమూశారు. 1946 సెప్టెంబర్ 25న పంజాబ్‌లోని అమత్‌సర్‌లో జన్మించిన బిషన్ సింగ్ బేడీ 15వ ఏట నార్త్రన్ పంజాబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ దేశవాళీ క్రికెట్‌లో అడుగు పెట్టాడు. 1966లో భారత్ తరపున టెస్టుల్లో అరంగేట్రం చేసి 13 ఏళ్లపాటు టీమిండియాలో కొనసాగారు. 67 టెస్టుల్లో 28.71 సగటుతో 266 వికెట్లు పడగొట్టాడు. భారత్ నుంచి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 1976-78వరకు టీమిండియాకు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జట్టులో పోరాట పటిమను నింపి, క్రమశిక్షణకు సంబంధించి కొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పిన కెప్టెన్‌గా బిషన్ సింగ్ బేడీకి పేరుంది. కెప్టెన్‌గా బిషన్ సింగ్ బేడీ 1976లో సొంత గడ్డపై టెస్ట్ సిరీస్‌లో అప్పటి బలమైన జట్టు వెస్టిండీస్‌ను ఓడించాడు. 1979లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. అయినా క్రికెట్‌పై మక్కువ తగ్గలేదు. ఆ తర్వాత వ్యాఖ్యాతగా క్రికెట్ జగత్తులో తనదైన ముద్ర వేశారు. టీమిండియా కోచ్‌గా కూడా తన అనుబంధం కలిగి ఉన్నాడు. అంతేకాకుండా.. స్పిన్ విభాగంలో భారత్‌ను పటిష్టంగా ఉంచడానికి, బిషన్ సింగ్ బేడీ కొత్త ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చాడు. తుదిశ్వాస విడిచేవరకు భారత క్రికెట్‌కు సేవలు అందిస్తూనే ఉన్నారు. 1970లో కేంద్ర ప్రభుత్వం.. పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసి గౌరవించింది. 2004లో సికె నాయుడు లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు అందుకున్నారు.

రెండోరౌండ్‌కు చిరాగ్-సాత్విక్

- ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ షట్లర్లు చిరాగ్-సాత్విక్ జోడీ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సాత్విక్-చిరాగ్ జంట 21-13, 21-13తో 34వ ర్యాంకర్స్ లూకాస్-రోనన్(ఫ్రాన్స్)జోడీని చిత్తుచేశారు. ఈ మ్యాచ్‌ను భారత షట్లర్లు కేవలం 35 నిమిషాల్లోనే ముగించారు. ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించడంతో భారత డబుల్స్ తొలిసారి ఓ టోర్నమెంట్‌లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగారు. ఇక మహిళల డబుల్స్‌లో భారత్‌కు చెందిన శ్వేతపర్ణ-రుతుపర్ణ 6-21, 16-21తో చైనా జంట చేతిలో ఓటమిపాలయ్యారు.

సింధు శుభారంభం..

ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సింధు 12-21, 21-18, 21-15తో గ్రెగోరియా మరిస్కా (ఇండోనేషియా)పై చెమటోడ్చి నెగ్గింది. తొలి గేమ్‌ను సునాయాసంగా కోల్పోయిన సింధు.. ఆ తర్వాత రెండు, మూడు గేమ్‌లలో సత్తా చాటి మ్యాచ్‌ను ముగించింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886